www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

అవయవ మార్పిడి అక్రమాలపై ఉక్కుపాదం!

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

10 ఏళ్ల జైలుశిక్ష.. 12 లక్షల జరిమానా


తప్పుడు ధ్రువపత్రాలు సమర్పిస్తే..

రూ.20 లక్షల నుంచి కోటి వరకు ఫైన్

టీహెచ్‌వోటీఏ-2011 సవరణ చట్టాన్ని

అమలు చేయనున్న రాష్ట్ర ప్రభుత్వం

నేడు శాసనసభలో తీర్మానం



12

సోమవారం | 24-3-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) :22 సంచిక (Issue) : 355 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం; తిథి: దశమి తె.5.06 తదుపరి ఏకాదశి; నక్షత్రం: ఉత్తరాషాఢ తె.4.27 తదుపరి శ్రవణం; వర్జ్యం: మ.12.21-1.57; అమృతఘడియలు: రా.10.00-11.37; దుర్ముహూర్తం: మ.12.45-1.33, మ.3.10-3.58; రాహుకాలం:ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.19, సూర్యాస్తమయం: 6.23 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ఎల్ఆర్ఎస్ లక్ష్యం
రూ.8,800 కోట్లు

20 లక్షల అర్జీలు పరిష్కారమైతే వచ్చే మొత్తమిది

ఈ నెలాఖరుకు 30% వరకు అర్జీలు రావొచ్చని అధికారుల అంచనా.. దాంతో రూ.2 వేల కోట్ల రాబడి

శుక్రవారం అర్ధరాత్రి దాకా వచ్చింది రూ.500 కోట్లే

ఇప్పటిదాకా ఫీజు కట్టిన వారు 1,25,732 మంది

రుసుము చెల్లించినా ప్రొసీడింగ్స్ రావట్లేదని

పలువురు దరఖాస్తుదారుల ఆందోళన

హైదరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): లే-అవుట్ క్రమబద్ధీకరణ పథకం(ఎల్ఆర్ఎస్) ద్వారా రూ.8,800 కోట్ల ఆదాయాన్ని పొందాలని అధికారులు అంచనాలు రూపొందించారు. 2020లో రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన 25.68 లక్షల దరఖాస్తుల్లో సుమారు 20 లక్షల మంది ఫీజు చెల్లించినా ఈ మొత్తం వస్తుందని లెక్కగట్టారు. ఎల్ఆర్ఎస్ పథకానికి గత ఆగస్టులో ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినప్పటికీ పెద్దగా పురోగతి కనిపించలేదు. ఈ నేపథ్యంలో మార్చి 31 వరకు 25 శాతం రాయితీ ఇస్తూ, గతంలో ఇచ్చిన ఉత్తర్వుల్లో కొన్ని సవరణలు చేసి, పెండింగ్ దరఖాస్తుల ప్రక్రియను వేగవంతం చేయడానికి సర్కారు చర్యలు చేపట్టింది. రాయితీని ఎక్కువ మంది సద్వినియోగం చేసుకోవాలనే ఉద్దేశంతో ఫీజు చెల్లించాలని 20 లక్షల దరఖాస్తులకు ఒకేసారి లేఖలు పంపింది. మొత్తం దరఖాస్తుల్లో నిషేధిత భూముల పరిధిలో 2.50 లక్షల దరఖాస్తులు, జలవనరులకు ఆనుకుని ఉన్న వాటికి సంబంధించి 1.60 లక్షల దరఖాస్తులు, ఇతర సాంకేతిక కారణాలతో మరికొన్ని కలిపి సుమారు 5 లక్షలకు పైగా దరఖాస్తులను అధికారులు

మిగతా 14వ పేజీలో...

ప్రాథమిక ఆధారాలున్నాయి.. లోతైన దర్యాప్తు
జరపాల్సిందే

జడ్జి ఇంట్లో నోట్ల కట్టల వ్యవహారంపై సీజేఐకి ఢిల్లీ హైకోర్టు సీజే జస్టిస్ ఉపాధ్యాయ సిఫారసు

మార్చి 15నే సీజేఐ దృష్టికి డబ్బు కట్టల విషయం

జస్టిస్ వర్మకు మూడు ప్రశ్నలు వేసి లిఖితపూర్వక సమాధానాలు రాబట్టాలని సూచించిన సీజేఐ

ఆర్నెల్ల కాల్ రికార్డులూ తీసుకోవాలని సూచన

మొబైల్‌ఫోన్లు పారేయవద్దని, వాటిలో డేటా డిలీట్ చేయొద్దని జస్టిస్‌వర్మకు సూచించాలని ఆదేశం

ఆ గది నా ఇంట్లో భాగం కాదు.. ప్రాంగణంలో ఉంది

ఇది నా ప్రతిష్ఠను దెబ్బతీసే కుట్ర: జస్టిస్ వర్మ

ఇప్పటికీ మాకు ఆ ప్రాంతంలో కాలిన నోట్లు దొరుకుతున్నాయి.. పారిశుధ్య కార్మికుల వెల్లడి



ఢిల్లీలో జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసం సమీపంలో చెత్త మధ్య కాలిన నోట్లు

న్యూఢిల్లీ, మార్చి 23: ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో నోట్ల కట్టల వ్యవహారానికి సంబంధించి.. సుప్రీంకోర్టు తన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన నివేదిక ద్వారా పలు కీలక అంశాలు బయటపడ్డాయి! ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయకు ఈ వ్యవహారం గురించి మార్చి 15 సాయంత్రం తెలియగా.. ఆ తర్వాత కొద్దిసేపటికే ఆయన ఈ విషయాన్ని సుప్రీం సీజే జస్టిస్ సంజీవ్ ఖన్నా దృష్టికి తీసుకెళ్లారు. శనివారం రాత్రి పొద్దుపోయాక సుప్రీంకోర్టు అప్‌లోడ్ చేసిన 25 పేజీల డాక్యుమెంట్‌లో రెండో పేజీలోనే ఈ విషయం స్పష్టంగా ఉంది. జస్టిస్ వర్మ ఇంటి ప్రాంగణంలోని స్టోర్‌రూమ్‌లో సగం తగలబడిపోయిన డబ్బు కట్టలున్న నాలుగైదు గోనెసంచులున్నట్టు ఢిల్లీ పోలీసు కమిషనర్ ఇచ్చిన నివేదిక, సీజేఐకి ఢిల్లీ హైకోర్టు సీజే జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ ఇచ్చిన నివేదిక, వారి మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలు, ప్రమాదం జరిగిన స్టోర్ రూమ్‌లో డబ్బుకట్టలున్న ఫొటోలు, వీడియో లింకుతో సహా.. మొత్తం 25 పేజీల పీడీఎఫ్‌ను సుప్రీంకోర్టు తన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసింది. ఇందులో జస్టిస్ ఉపాధ్యాయ సీజేఐకి ఇచ్చిన నివేదికలో పలు కీలక విషయాలు ఉన్నాయి. మార్చి 14వ తేదీన రాత్రి 11.30 గంటల సమయంలో జస్టిస్ వర్మ ఇంటి ప్రాంగణంలో జరిగిన అగ్ని ప్రమాదం, సగం కాలిన నోట్ల కట్టల గురించి ఢిల్లీ పోలీసు కమిషనర్ సంజయ్ అరోరా.. మార్చి 15 సాయంత్రం 4.50 గంటల సమయంలో లఖ్‌నవూలో ఉన్న తనకు వెల్లడించారని తెలిపారు. అదే రోజు తాను ఆ విషయాన్ని సీజేఐ దృష్టికి తీసుకువెళ్లిన విషయాన్నీ అందులో ప్రస్తావించారు. ప్రమాదం జరిగిన రోజు జస్టిస్ వర్మ వ్యక్తిగత కార్యదర్శి పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేశారని.. అగ్నిమాపక కేంద్రానికి ఫోన్

మిగతా 2వ పేజీలో...



రాష్ట్ర బీజేపీకి.. వారంలో
కొత్త దళపతి!

బీసీ వర్గానికి ఎక్కువ అవకాశాలు

రేసులో రాంచందర్‌రావు కూడా..

బండి పేరు మరోసారి పరిశీలన!

హుటాహుటిన ఢిల్లీకి కిషన్‌రెడ్డి

ఎంపికపై రాష్ట్ర నేతల్లో ఉత్కంఠ

హైదరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): బీజేపీ తెలంగాణ రాష్ట్ర శాఖకు వారంలోగా కొత్త అధ్యక్షుడి నియామకం జరగనుంది. ఉగాది పండుగలోపే నూతన అధ్యక్షుడిని ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. బీజేపీ జాతీయ నాయకత్వం చేపట్టిన కసరత్తు కొలిక్కి వచ్చిందని, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిని ఏ క్షణంలోనైనా ప్రకటించవచ్చని ముఖ్యనేతలు చెబుతున్నారు. బీసీ సామాజికవర్గానికి చెందిన ఎంపీకి గానీ, సైద్ధాంతిక నేపథ్యం ఉన్న నేతకు గానీ అధ్యక్ష పదవి దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పార్టీ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. రాష్ట్ర అధ్యక్షుడి

మిగతా 14వ పేజీలో...

కేసీఆర్ సన్నిహిత నేతకు బీదర్‌లో
దొంగ నోట్ల ప్రింటింగ్ ప్రెస్!

ఎన్నికల్లో బీఆర్ఎస్ పంచింది ఆ నోట్లే

కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపణలు

హామీల అమలు చేతగాక డీలిమిటేషన్‌పై విపక్షాల దుష్ప్రచారం: కిషన్‌రెడ్డి

14



నేను కేసీఆర్ అంత
మంచోణ్ణి కాదు

రాసి పెట్టండి.. ఏ ఒక్కర్నీ వదిలేది లేదు

మళ్లీ మన రాజ్యం వస్తుంది

డీలిమిటేషన్‌తో దక్షిణాదికి నష్టం

వరంగల్‌లో రజతోత్సవ సభతో సన్నాసుల నోళ్లు మూతపడాలి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

13

సన్నబియ్యం వచ్చేస్తున్నాయ్

గోదాముల నుంచి డిపోలకు బియ్యం తరలింపు ప్రక్రియ ప్రారంభం

29కల్లా అన్నిచోట్లకూ చేర్చే ప్రణాళిక.. ఏప్రిల్ కోటా 2 లక్షల టన్నులు

ఉగాది నుంచి సన్నబియ్యం.. సాగర్ ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరు


గత ప్రభుత్వం నీటి వాటాను సరిగా వినియోగించుకోలేదు

త్వరలో ఎస్ఎల్‌బీసీ పనులు తిరిగి ప్రారంభిస్తాం: మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఉగాది రోజు నుంచి రేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో.. రేషన్ డిపోలకు సన్నబియ్యం వచ్చేస్తున్నాయి. గోదాముల్లో(ఎంఎల్ఎస్ పాయింట్లు) నిల్వ ఉన్న సన్న బియ్యాన్ని చౌక డిపోలకు చేర్చే ప్రక్రియను రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆదివారం ప్రారంభించింది. సన్నబియ్యం పంపిణీ పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూర్యాపేట జిల్లాలోని మట్టపల్లిలో ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో తొలుత ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనే



మిగతా 13వ పేజీలో...



పరుగుల వరద

ఉప్పల్‌లో రికార్డు స్కోర్లు నమోదు

సన్‌రైజర్స్ 286/6.. రాజస్థాన్ రాయల్స్ 242/6

44 పరుగుల తేడాతో గెలిచిన హైదరాబాద్

ట్రావిస్ హెడ్ ధనాధన్.. ఇషాన్ తుఫాన్ సెంచరీ

మరోపోరులో ముంబైకి షాకిచ్చిన సీఎస్‌కే

11



మార్క్‌ఫెడ్ జొన్నలు
అగ్గువకు!

ఎమ్మెస్పీ కంటే తక్కువ ధరకు కొనేందుకు ఏజెన్సీల ప్రయత్నం

అమ్మేందుకూ మార్క్‌ఫెడ్ సిద్ధం!.. అలా అమ్మితే రూ.133 కోట్ల నష్టం

టెండర్ల నిర్వహణలోనూ జాప్యం.. ప్రభుత్వానికి పలువురి ఫిర్యాదు

రెండేళ్లుగా గోదాముల్లో ముక్కిపోతున్న తెల్ల జొన్నలు

హైదరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రెండేళ్ల క్రితం రైతుల నుంచి కనీస మద్దతు ధర(ఎమ్మెస్పీ)కు కొనుగోలు చేసిన తెల్ల జొన్నలను తక్కువ ధరకు కొట్టేసేందుకు కొందరు గుత్తేదారులు ప్రయత్నాలు చేస్తున్నారు. టెండరులో నమోదు చేసిన ధరకు పదో పరకో పెంచి.. అగ్గువ సగ్గువకు అప్పగించేందుకు మార్క్‌ఫెడ్ అధికారులు రంగం సిద్ధం చేసినట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. టెండరు ప్రక్రియలో తక్కువ ధరకు జొన్నలు విక్రయించటం ద్వారా మార్క్‌ఫెడ్‌కు తక్కువలో తక్కువగా రూ.133 కోట్ల నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని చర్చ

మిగతా 14వ పేజీలో...

ఎదురొచ్చిన మృత్యువు

ఆర్టీసీ బస్సు, కారు ఢీ

కారులో ఉన్న 11 మందిలో..

దంపతులు, వారి కుమార్తె మృతి

కుమారుడి పరిస్థితి విషమం

సూర్యాపేట జిల్లా చివ్వెంలలో ఘటన

3



ప్రాంతీయ భాషల్లో సుప్రీంకోర్టు తీర్పులు

కృత్రిమ మేధతో అనువాదం

2

చైనా ఉత్పత్తులపై భారత్ సుంకం

చవక సరుకుల నుంచి దేశీయ పరిశ్రమలను కాపాడేందుకు నిర్ణయం

ఫ్లాస్కులు, అల్యూమినియం ఫాయిల్స్‌తో సహా 5 రకాల ఉత్పత్తులకు వర్తింపు

సెర్ప్, మెప్మా విలీనం!

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం.. మహిళాభివృద్ధే లక్ష్యం

అధికారులు, సిబ్బంది విభజనపై త్వరలో విధివిధానాలు

15-18 ఏళ్ల బాలికలకు కిశోర బాలికల సంఘాలు

స్త్రీల ఆర్థిక స్వావలంబనకు 'ఇందిర మహిళా శక్తి మిషన్'

హైదరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం 'ఇందిర మహిళా శక్తి మిషన్-2025'ను ప్రారంభించింది. మహిళాభివృద్ధే లక్ష్యంగా చేపట్టిన ఈ పథకంలో భాగంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా స్వయం సహాయక సంఘాలను ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని నిర్ణయించింది. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)ను, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)లో విలీనం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటివరకు మహిళల కోసం చేపట్టే కార్యక్రమాలపై వేర్వేరుగా పనిచేసిన సెర్ప్, మెప్మా ఇకపై కలిసి పనిచేస్తాయని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్ ఆదివారం జారీచేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా, నిరుపేద మహిళలకు శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, బ్యాంక్ లింకేజీ, స్వయం

మిగతా 14వ పేజీలో...

వనపర్తి జిల్లా ఖిల్లాఘనపురంలో దెబ్బతిన్న మొక్కజొన్న



వడగళ్లు.. కడగండ్లు

రాష్ట్రంలో పలు జిల్లాలపై అకాల వర్షం ప్రభావం

నేల రాలిన మామిడి, దెబ్బతిన్న వరి, మొక్కజొన్న

మహబూబ్‌నగర్ జిల్లాలో 1,980 ఎకరాల్లో పంట నష్టం

రంగారెడ్డి, వనపర్తి జిల్లాల్లోనూ తీవ్రంగా దెబ్బతిన్న పంటలు

మహబూబ్‌నగర్, పాలమూరు, వికారాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షం ఎప్పట్లానే రైతులకు కడగండ్లు మిగిల్చింది. రైతన్నల చెమటతో నెలల తరబడి తడిచిన పొలంలో కురిసిన వడగళ్లు కన్నీటిధారలను మిగిల్చాయి. శనివారం రాత్రి భారీగా కురిసిన వడగండ్ల వానకు రాష్ట్రంలోని

మిగతా 3వ పేజీలో...

11 వేల ఎకరాల్లో నష్టం

అధికారులు నివేదికను పంపాలి

రుణమాఫీపై విమర్శించే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదు

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

13

వికాసం తిరస్కరణ

దరఖాస్తులు స్వీకరించని రాజీవ్ యువ వికాసం సైట్



ఆధార్ నమోదు చేయగానే 'ఆల్రెడీ అప్లైడ్' అంటూ మెసేజ్

గతంలో స్వయం ఉపాధికి దరఖాస్తు చేసుకున్నవారికీ సమస్య

అధికారులు పాత వివరాలను తొలగించనందునే!

దరఖాస్తుదారుల్లో అయోమయం.. నేడు పూర్తి మార్గదర్శకాలు!

హైదరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల్లో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన రాజీవ్ యువ వికాసం పథకానికి ఆదిలోనే సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ పథకం కింద లబ్ధి కోసం పలువురు చేసుకుంటున్న దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయి. గతంలో 2017-18లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి కోసం దరఖాస్తు చేసుకుని.. లబ్ధి పొందని వారికి ఈ సమస్య ఎదురవుతోంది. అప్పట్లో దరఖాస్తు చేసుకున్న వారిలో కొందరికి యూనిట్లు మంజూరై.. ఏర్పాటు చేసుకోగా, మరికొందరికి మంజూరైనా

మిగతా 13వ పేజీలో...

రచయిత్రి కమలాదేవి అరవిందన్‌కు
సింగపూర్ హాల్ఆఫ్ ఫేమ్ అవార్డు



చెన్నై, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): సింగపూర్‌లో వివిధ రంగాలలో ప్రతిభను కనబరిచిన మహిళలకు అందించే హాల్ ఆఫ్ ఫేమ్ అవార్డు ఈ ఏడాది భారత సంతతి రచయిత్రి కమలాదేవి అరవిందన్‌ని వరించింది. కమలాదేవి (75) తమిళం, మలయాళంలో రచనలు చేస్తున్నారు. ఆమె సాహితీకృషిని సింగపూర్ కౌన్సిల్ ఆఫ్ ఉమెన్స్ ఆర్గనైజేషన్స్ (ఎస్సీడబ్ల్యూ) గుర్తించి, ఈ అవార్డుకు ఎంపిక చేసింది. కమలాదేవి నాటక రచయిత్రిగా విశేష ప్రతిభ కనబరిచారు. నేషనల్ లైబ్రరీ, సింగపూర్ తమిళ రచయితల సంఘం సంయుక్తంగా వర్ధమాన రచయితల కోసం నిర్వహించిన వర్క్‌షాప్‌లను ఆమె నడిపించారు. ఆమె నవల 'సెంబవాంగ్' సింగపూర్‌లో విడుదలైన అత్యుత్తమ రచనలలో ఒకటి. ఆమె రచనలు సింగపూర్, మలేసియా, కెనడా, భారత్‌లో విడుదలై, విశేష ఆదరణ పొందాయి. ఇప్పటిదాకా ఆమె 160కి పైగా కథానికలు, వ్యాసాలు, 18 రంగస్థల నాటకాలు, 300 రేడియో నాటకాలను రచించారు.

బీజేపీ కేరళ శాఖ అధ్యక్షుడిగా రాజీవ్‌చంద్రశేఖర్

తిరువనంతపురం, మార్చి 23: బీజేపీ కేరళశాఖ అధ్యక్షుడిగా కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ (60) బాధ్యతలు స్వీకరించనున్నారు. పార్టీ రాష్ట్రశాఖ అధ్యక్ష పదవి ఎన్నికల్లో ఆయన ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారని బీజేపీ వర్గాలు తెలిపాయి. సోమవారం జరిగే బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో పార్టీ కేంద్ర పరిశీలకుడు - కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి అధికారికంగా రాజీవ్ చంద్రశేఖర్ ఎన్నిక విషయం ప్రకటిస్తారని ఆ వర్గాల కథనం. తిరువనంతపురంలోని బీజేపీ కార్యాలయంలో రాష్ట్రశాఖ అధ్యక్ష పదవికి జరుగుతున్న ఎన్నికల్లో ఆదివారం రాజీవ్ చంద్రశేఖర్ రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ప్రస్తుత బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా సుందరేశన్ ఐదేండ్ల పదవీ కాలం పూర్తి కావడంతో కొత్త అధ్యక్షుడి ఎన్నిక నిర్వహిస్తున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో తిరువనంతపురం లోక్‌సభాస్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శశిథరూర్ చేతిలో రాజీవ్ చంద్రశేఖర్ 16,077 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు.

పేపర్ లీక్‌తో అసోం 11వ తరగతి పరీక్షలు రద్దు

గువాహటి, మార్చి 23: అసోంలో జరుగుతున్న 11వ తరగతి పరీక్షలు రద్దు అయ్యాయి. పలుచోట్ల గణితం ప్రశ్నపత్రం లీక్ అవ్వడంతో సోమవారం నుంచి జరగాల్సిన మిగిలిన పరీక్షలను రద్దు చేసినట్లు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి రనోజ్ పేగు వెల్లడించారు. ఈనెల 6న ప్రారంభమైన 11వ తరగతి పరీక్షలు 29వ తేదీ వరకు కొనసాగాల్సి ఉంది. గణితం ప్రశ్నపత్రం ఒకరోజు ముందుగానే లీక్ అయ్యి సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవడంతో 21న జరగాల్సిన ఆ పరీక్షను రద్దు చేశారు. ఈ క్రమంలో మిగిలిన పరీక్షలను కూడా రద్దు చేశారు. సోమవారం జరగనున్న బోర్డు సమావేశంలో కొత్త షెడ్యూల్‌కు సంబంధించి నిర్ణయం తీసుకుంటామని అధికారులు తెలిపారు. పేపర్ లీక్‌కు సంబంధించి 15 ప్రైవేట్ విద్యాసంస్థల అఫిలియేషన్‌ను అధికారులు తాత్కాలికంగా రద్దు చేశారు.

సరిహద్దుల్లో ఏఐ రోబోలతో నిఘా

న్యూఢిల్లీ, మార్చి 23: భారత సరిహద్దులను పర్యవేక్షించడానికి ఐఐటీ గువాహటి పరిశోధకులు అధునాతన రోబోలను అభివృద్ధి చేశారు. కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో పనిచేసే ఈ రోబోలు బోర్డర్‌లో నిరంతరం కాపలా కాస్తుంటాయి. అలాగే సైన్యం కూడా వెళ్లలేని క్లిష్టమైన, సవాళ్లతో కూడిన భూభాగాల్లోనూ రియల్‌టైమ్‌లో పర్యవేక్షణ చేస్తాయి. ఐఐటీ గువాహటిలోని స్టార్టప్ డీఏ స్పాటియో రోబోటిక్ లేబొరేటరీ ప్రైవేట్ లిమిటెడ్ (డీఎస్ఆర్ఎల్) అభివృద్ధి చేసిన ఈ రోబోలను భారత రక్షణ వ్యవస్థలోకి తీసుకునేందుకు డీఆర్‌డీవో అనుమతి కూడా లభించింది. నిఘా వ్యవస్థ కోసం భారత సైన్యం ఇప్పటికే వీటికి క్షేత్రస్థాయి పరీక్షలు నిర్వహిస్తోంది. మానవ గస్తీపై ఆధారపడే సంప్రదాయ భద్రతా చర్యలకు భిన్నంగా ఈ రోబోలు ఎలాంటి భూభాగంలోనైనా, ఎలాంటి వాతావరణ పరిస్థితుల్లోనైనా సమర్థవంతంగా పనిచేస్తాయని డీఎస్ఆర్ఎల్ సీఈవో అర్నబ్ కుమార్ బర్మన్ తెలిపారు. దుండగులు అంతర్జాతీయ సరిహద్దుల్లో చొరబాట్లకు ప్రయత్నించినా, డ్రోన్లను పంపినా.. ఈ రోబోలకు ఉన్న సెన్సర్లు వెంటనే గుర్తించి అప్రమత్తం చేస్తాయన్నారు.

అమెరికాలో కాల్పులు..ఇద్దరు భారతీయుల మృతి

న్యూయార్క్, మార్చి 23: అమెరికాలో జరిగిన కాల్పుల్లో మరో ఇద్దరు భారతీయులు ప్రాణాలు కోల్పోయారు. వర్జీనియాలోని ఓ కన్వీనియన్స్ స్టోర్‌లో పని చేస్తున్న ప్రదీప్ కుమార్ పటేల్ (56), ఆయన కుమార్తె (24)పై ఓ దుండగుడు కాల్పులు జరపడంతో వారిద్దరూ ప్రాణాలు కోల్పోయారు. కాల్పులకు పాల్పడిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. అకోమాక్ కౌంటీలో లాంక్ ఫోర్డ్ హైవేలోని దుకాణంలో గురువారం ఉదయం తండ్రీ కుమార్తె పని చేస్తున్న సందర్భంగా దుండగుడు వీరిపై కాల్పులకు తెగబడినట్లు మీడియా కథనాల ద్వారా తెలుస్తోంది. గుజరాత్‌లోని మెహ్సానా జిల్లాకు చెందిన ప్రదీప్ పటేల్ ఆయన భార్య, కుమార్తె ఆరేళ్ల క్రితం అమెరికాకు వెళ్లినట్లు తెలుస్తోంది.

మత రిజర్వేషన్లు రాజ్యాంగ ఉల్లంఘనే: హోసబలే

బెంగళూరు, మార్చి 23: మతం ఆధారిత రిజర్వేషన్లను భారత రాజ్యాంగం అనుమతించబోదని ఆరెస్సెస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబలే అన్నారు. ప్రభుత్వ కాంట్రాక్టుల్లో ముస్లింలకు 4% రిజర్వేషన్లు కల్పిస్తూ కర్ణాటక ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఆయన స్పందించారు. ఆదివారం ఆయన బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ.. ముస్లింలకు మత ఆధారిత రిజర్వేషన్లు ప్రవేశపెట్టడానికి గతంలో ఉమ్మడి ఏపీ, మహారాష్ట్రల్లో చేసిన ప్రయత్నాలను హైకోర్టులు, సుప్రీంకోర్టులు కొట్టేశాయని గుర్తు చేశారు. ఆక్రమణ మనస్తత్వం ఉన్న వ్యక్తులు భారత్‌కు ముప్పుగా పరిణమించారన్నారు.భారతీయ సంస్కృతికి అండగా నిలిచేవారికి అందరూ మద్దతు పలకాలని కోరారు. మరోవైపు, ప్రపంచ శాంతి, శ్రేయస్సు కోసం సామరస్యపూర్వక, వ్యవస్థీకృత హిందూ సమాజాన్ని నిర్మించాలని ఆరెస్సెస్ తీర్మానించింది.

సంభల్ మసీదు కమిటీ అధ్యక్షుడి అరెస్టు

సంభల్, మార్చి 23: ఉత్తరప్రదేశ్ సంభల్‌లోని షాహీ జామా మసీదు కమిటీ అధ్యక్షుడు జాఫర్ అలీని ఆదివారం పోలీసులు అరెస్టు చేశారు. గత ఏడాది నవంబరు 24న మసీదు వద్ద జరిగిన అల్లర్లలో ఆయన ప్రమేయం ఉందన్న ఆరోపణల మేరకు అదుపులోకి తీసుకున్నారు. కోర్టు ఆదేశాల మేరకు మసీదు ప్రాంగణంలో సర్వే నిర్వహించేందుకు అధికార్లు రాగా వారిని అడ్డుకునే క్రమంలో ఘర్షణలు చోటుచేసుకున్నాయి. నలుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. ఆ సంఘటనపై ఆయన వాంగ్మూలం నమోదు చేసుకునేందుకు అదుపులోకి తీసుకున్నామని స్థానిక పోలీసులు తెలిపారు. మరోవైపు ఆ ఘర్షణలపై దర్యాప్తు జరిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన న్యాయ విచారణ సంఘం సోమవారం ఇక్కడికి రానుంది.

గబాన్‌లో చిక్కుకున్న కర్ణాటక నాటువైద్యులు

బెంగళూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): దావణగెరె జిల్లాలో సంచార జాతులకు చెందిన నాటు వైద్యులు మధ్య ఆఫ్రికా ప్రాంతం గబాన్ దేశంలో చిక్కుకున్నారు. 6నెలల క్రితం ఔషధ మొక్కల విక్రయానికి గబాన్ దేశ రాజధాని లెబ్రవిల్‌కు వెళ్లిన 21 మందిని అక్కడి పోలీసులు అరెస్టు చేశారు. గబాన్‌లో రాజకీయ మార్పులు చోటు చేసుకున్న తర్వాత 2023లో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం విదేశీయులందరూ దేశం విడిచి వెళ్లాలని ఆదేశించింది. కాగా, ఈ నాటువైద్యులు వ్యాపారాల కోసం ఉపయోగిస్తున్న వీసాలు నకిలీవని గుర్తించి లెబ్రవిల్ పోలీసులు అరెస్టు చేశారు.

మధ్యంతర ఎన్నికలకు కెనడా కొత్త ప్రధాని పిలుపు

ఒట్టావా, మార్చి23: కెనడాలో మధ్యంతర ఎన్నికలకు నూతన ప్రధాని మార్క్ కార్నీ పిలుపునిచ్చారు. ఏప్రిల్ 28న మొత్తం 343 పార్లమెంట్ స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. కెనడాపై విధిస్తున్న సుంకాల అంశమే ఈ సారి ఎన్నికల ప్రచారంలో కీలకం కానుంది. జస్టిన్ ట్రుడో స్థానంలో కొత్త ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన లిబరల్ నాయకుడు కార్నీ.. సుంకాల అంశాన్నే తొలి రోజు ఎన్నికల ప్రచారంలో లేవనెత్తారు. కెనడా ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దడమే తన ప్రధాన లక్ష్యమని చెప్పారు. ఐదు వారాల పాటు ఎన్నికల ప్రచారం జరగనుంది. లిబరల్స్, కన్జర్వేటివ్‌ల మధ్య ప్రధాన పోటీ నెలకొంది.

లోతైన దర్యాప్తు జరపాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

చేయలేదని జస్టిస్ ఉపాధ్యాయ స్పష్టం చేశారు. అగ్నిప్రమాదం జరిగిన స్టోర్ రూమ్‌లోకి ఎవరో బలవంతంగా ప్రవేశించిన ఆనవాళ్లేవీ లేవని.. జస్టిస్ వర్మ కుటుంబసభ్యులకు, పనివారికి మాత్రమే దాంట్లోకి ప్రవేశం ఉందని తేల్చిచెప్పారు. ఆ గదికి తాళం కూడా ఉందన్న విషయాన్ని.. 15వ తేదీ ఉదయం ఆ గది నుంచి సగం కాలిన వస్తువులు, ఇతర వ్యర్థాలను తొలగించిన విషయాన్ని.. అక్కడున్న సెక్యూరిటీ గార్డ్ ధ్రువీకరించాడని వెల్లడించారు. ఘటనాస్థలికి వెళ్లి వివరాలు తెలుసుకోవాల్సిందిగా తనకు కేటాయించిన రిజిస్ట్రార్ కమ్ సెక్రటరీని ఆదేశించానని.. లఖ్‌నవూ నుంచి వచ్చాక, 16వ తేదీన తాను స్వయంగా అక్కడికి వెళ్లి పరిశీలించానని చెప్పారు. అనంతరం సీజేఐని కలిసి వివరాలు సమర్పించినట్టు వెల్లడించారు. సీజేఐ ఆదేశాల మేరకు జస్టిస్ యశ్వంత్ వర్మతో ఫోన్‌లో మాట్లాడానని, 17వ తేదీన ఉదయం 8.30 గంటల సమయంలో ఆయన తనను కలిశారని చెప్పారు. "మంటలు చెలరేగిన స్టోర్ రూమ్‌లో పనికి రాని వస్తువులు, పాడైపోయిన గృహోపకరణాలు, పాత ఫర్నిచర్, పరుపుల వంటివాటిని పడేస్తాం. పనివారికి, తోటపని చేసేవారికి కొన్ని సందర్భాల్లో సీపీడబ్ల్యూడీ (కేంద్ర ప్రజాపనుల విభాగం) సిబ్బందికి కూడా ఆ గది అందుబాటులో ఉంటుంది" అని జస్టిస్ వర్మ తనకు చెప్పినట్టు వెల్లడించారు. ఢిల్లీ పోలీస్ కమిషనర్ తనకు వాట్సాప్ ద్వారా షేర్ చేసిన ఫొటోలు, వీడియోలను (సగం కాలిన నోట్ల కట్టల తాలూకు) చూపించగా.. అదంతా తనపై జరుగుతున్న కుట్రగా జస్టిస్ వర్మ పేర్కొన్నారని వివరించారు. 20వ తేదీన ఆ ఫొటోలు, వీడియోలను సీజేఐకి పంపినట్టు వెల్లడించారు. అదే రోజు సాయంత్రం.. జస్టిస్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలన్న ప్రతిపాదన గురించి తనకు సీజేఐ నుంచి సమాచారం వచ్చిందని, అందుకు తాను అంగీకరించానని పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న వివరాలు, జస్టిస్ వర్మ స్పందన, పోలీసు కమిషనర్ ఇచ్చిన నివేదిక, తాను జరిపిన విచారణ ప్రకారం.. ఆ గదిలోకి పనివారు, తోటపనివారు, కుటుంబసభ్యులు, సీపీడబ్ల్యూడీ సిబ్బందికి తప్ప బయటివారెవరికీ ప్రవేశం లేదని తేల్చిచెప్పారు. ప్రాథమిక ఆధారాలు ఉన్నందున ఈ కేసులో మరింత లోతైన దర్యాప్తు అవసరమని అభిప్రాయపడ్డారు.

ఈ ప్రశ్నలు అడగండి..

ఢిల్లీ హైకోర్టు సీజే జస్టిస్ ఉపాధ్యాయ ఇచ్చిన నివేదికను పరిశీలించిన సుప్రీం సీజే జస్టిస్ సంజీవ్ ఖన్నా..

- అసలు జస్టిస్ వర్మ ఇంటి ప్రాంగణంలో దొరికిన డబ్బుకు ఆయనకు సంబంధమేమిటి?
- స్టోర్ రూమ్‌లో కనిపించిన నగదు ఎక్కణ్నుంచీ వచ్చింది? దాని మూలమేమిటో వివరించాలి?
- మార్చి 15వ తేదీ ఉదయం.. సగం తగలబడిన నోట్లను ఎవరు తొలగించారు?



జస్టిస్ యశ్వంత్ వర్మ




ఇంటి ప్రాంగణంలో కాలిపోయి కనిపించిన కరెన్సీ నోట్లు

...అనే మూడు ప్రశ్నలూ జస్టిస్ వర్మను అడిగి, మార్చి 22 మధ్యాహ్నం 12 గంటల్లోగా ఆయన్నుంచి లిఖితపూర్వక సమాధానం తీసుకోవాలంటూ జస్టిస్ ఉపాధ్యాయకు లేఖ రాశారు. అలాగే, గత ఆరు నెలలుగా జస్టిస్ వర్మ వద్ద పనిచేస్తున్న వ్యక్తిగత భద్రతాధికారుల వివరాలను, ఆయన ఇంటివద్ద విధులు నిర్వర్తిస్తున్న భద్రతా సిబ్బంది వివరాలను పొందుపరచాలని పేర్కొన్నారు. జస్టిస్ వర్మ అధికారిక, వ్యక్తిగత ఫోన్ నంబర్లకు సంబంధించిన ఆరు నెల కాల్ రికార్డ్స్ వివరాలను ఇవ్వాల్సిందిగా సర్వీస్ ప్రొవైడర్లకు లేఖలు పంపాలని సూచించారు. అంతేకాదు.. తన మొబైల్ ఫోన్(ల)ను పారేయడం/అందులోని సంభాషణలను, మెసేజ్‌లను, డేటాను డిలీట్ చేయడం (లేదా) మార్చేయడం వంటివాటికి పాల్పడవద్దని జస్టిస్ వర్మకు సూచించాల్సిందిగా కూడా సీజేఐ ఆదేశించారు. జస్టిస్ వర్మ ఇచ్చిన లిఖిత పూర్వక సమాధానాన్ని వెంటనే తనకు సమర్పించాలని.. అప్పుడు తదుపరి చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు. ఈమేరకు.. జస్టిస్ ఉపాధ్యాయ జస్టిస్ వర్మకు ఆ మూడు ప్రశ్నలూ సంధించారు. వాటికి నిర్ణీతగడువు లోపు జస్టిస్ వర్మ సమాధానమిచ్చారు. ఆ గదిలో పనికిరాని వస్తువులే ఉంటాయని పునరుద్ఘాటించారు. ఆ గదిలోకి తన ఇంటి ముందువైపు గేటు నుంచి, వెనకవైపు స్టాఫ్ క్వార్టర్స్ నుంచి ప్రవేశించవచ్చని.. పైగా, అది ప్రధాన నివాసానికి దూరంగా ఉందని.. వివిధ పత్రికల్లో వచ్చినట్టుగా అది తన ఇంట్లో భాగం కాదని పేర్కొన్నారు. మంటలు ఆర్పే క్రమంలో అగ్నిమాపక సిబ్బంది తమ ఇంట్లో ఉన్న వారందరినీ అక్కణ్నుంచీ దూరంగా పంపించారని తెలిపారు. మంటలు ఆరిన తర్వాతే వారంతా అక్కడికి వచ్చారని.. అక్కడ డబ్బు ఆనవాళ్లేవీ లేవని వెల్లడించారు. "ఆ స్టోర్‌రూమ్‌లో నేనుగానీ, నా కుటుంబ సభ్యులుగానీ ఎలాంటి డబ్బూ పెట్టలేదని రూఢిగా చెప్తున్నాను. ఆ డబ్బు మాదేనన్న ఆరోపణను నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తున్నాను. అక్కడ మేము డబ్బు భద్రపరిచామన్న మాటే పూర్తిగా అసంబద్ధం. అందరూ ఉపయోగించే, స్వేచ్ఛగా వచ్చిపోగలిగే చోటు.. స్టాఫ్ క్వార్టర్స్‌కు సమీపంలో అందరూ ఉపయోగించే స్టోర్ రూమ్‌లో డబ్బును దాచిపెడతారన్న ఆలోచనే విడ్డూరమైనది, నమ్మశక్యం కానిది." అని పేర్కొన్నారు. మార్చి 15న తాను భోపాల్ నుంచి వచ్చాక అక్కడికి వెళ్లి చూశానని.. అక్కడ ఎలాంటి నగదు ఆనవాళ్లూ లేవని తెలిపారు. మార్చి 15న ఉదయం తమ సిబ్బందిలో ఎవరూ ఆ గదిలోంచి నగదును తొలగించలేదని చెప్పారు. "అవుట్‌హౌస్‌లోని స్టోర్‌రూమ్‌లో డబ్బు ఉన్న విషయం నాకుగానీ, నా కుటుంబసభ్యులకుగానీ తెలియదు. మాకు దాంతో ఏ సంబంధమూ లేదు. అందుచేత.. ఆ డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందో చెప్పాలనే ప్రశ్నే ఉత్పన్నం కాదు. ఆ గదిలో నుంచి మేం నగదును తొలగించామన్న ఆరోపణను నేను గట్టిగా, పూర్తిగా తిరస్కరిస్తున్నాను. తగలబడ్డట్టుగా చెబుతున్న నోట్లను మాకెవరూ చూపలేదు, అప్పగించనూ లేదు." అని వివరణ ఇచ్చారు. తన నివాసంలో నోట్ల కట్టలు బయటపడ్డాయన్న ఆరోపణలను.. తనను ఇరికించడానికి, తన పేరు ప్రతిష్ఠలను దెబ్బతీయడానికి జరుగుతున్న కుట్రగా అభివర్ణించారు. ఆయన ఇచ్చిన సమాధానాలతో జస్టిస్ డీకే ఉపాధ్యాయ.. సీజేఐకి మరో లేఖ రాశారు. దాంతోపాటు, ఆయన మొబైల్‌ఫోన్లకు సంబంధించిన ఆర్నెల్ల కాల్ డేటా రికార్డుల వివరాలనూ పెన్‌డ్రైవ్‌లో వేసి సమర్పించారు.



ఢిల్లీలోని జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసం వద్ద పోలీసులు



సగం కాలిన నోట్లను
మేం చూశాం
పారిశుధ్య కార్మికుల వెల్లడి

స్టోర్ రూమ్‌లో నోట్ల కట్టలను తానుగానీ, తన కుటుంబసభ్యులుగానీ చూడలేదని జస్టిస్ యశ్వంత్ వర్మ.. జడ్జి ఇంట్లో నోట్ల కట్టలే దొరకలేదని ఢిల్లీ ఫైర్ సర్వీసెస్ డీజీ.. చెబుతున్నప్పటికీ, ఆ ప్రాంతంలో వీధులను శుభ్రం చేసే పారిశుధ్య పనివారు మాత్రం నాలుగైదు రోజుల క్రితం జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసానికి సమీపంలో కాలిన రూ.500 నోట్లు తమకు కనిపించాయని చెప్పడం గమనార్హం. "జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసం ఉన్న సర్కిల్‌లో మేం పనిచేస్తాం. వీధుల్లో చెత్తను సేకరిస్తాం. నాలుగైదు రోజుల క్రితం ఈ ప్రాంతాన్ని శుభ్రం చేస్తుండగా.. (కాలిన) రూ.500 నోట్ల ముక్కలు కనిపించాయి. అయితే, అగ్ని ప్రమాదం ఎక్కడ జరిగిందో మాకు తెలియదు" అని ఇందర్‌జీత్ అనే పారిశుధ్య కార్మికుడు ఏఎన్ఐ వార్తా సంస్థకు తెలిపాడు. సురేందర్ అనే మరో పారిశుధ్య కార్మికుడు కూడా.. అక్కడ కాలిన రూ.500 నోట్లు దొరికినట్టు వెల్లడించాడు. "ఇప్పటికి కూడా మాకు కొన్ని నోట్లు కనిపిస్తున్నాయి" అని అతడు పేర్కొనడం గమనార్హం. కాగా.. ఈ వ్యవహారంపై త్రిసభ్య కమిటీని నియమించిన సుప్రీంకోర్టు కొన్నాళ్లపాటు జస్టిస్ యశ్వంత్‌వర్మకు ఎలాంటి జ్యుడీషియల్ వర్క్ అప్పగించొద్దని ఢిల్లీ హైకోర్టు సీజే జస్టిస్ ఉపాధ్యాయకు సూచించింది.

ప్రాంతీయ భాషల్లో సుప్రీంకోర్టు తీర్పులు

- కృత్రిమ మేధతో అనువాదం
- కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ వెల్లడి



న్యూఢిల్లీ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు తీర్పులను ప్రాంతీయ భాషల్లో అందుబాటులోకి తీసుకొస్తున్నట్టు కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ తెలిపారు. కృత్రిమ మేధ(ఏఐ) సాంకేతికతో అనువదించే ప్రక్రియ జరుగుతోందని చెప్పారు. కృత్రిమ మేధ (ఏఐ), మెషీన్ లెర్నింగ్ (ఎంఎల్)ల సహకారంతో కోర్టులో జరిగే వాదనలు, తీర్పులను ప్రాంతీయ భాషల్లోకి అనువదించే ప్రక్రియ జరుగుతోందని తెలిపారు. నేషనల్ ఇన్‌ఫర్మటిక్ సెంటర్ (ఎన్ఐసీ) ఇందులో కీలకపాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. పార్లమెంటులో ఇటీవల మాట్లాడుతూ ఈ విషయాలను వెల్లడించారు. తెలుగుతోపాటు అస్సామీ, బెంగాలీ, గారో, గుజరాతీ, హిందీ, కన్నడ, కశ్మీరీ, ఖాసీ, కొంకణి, మలయాళం, మరాఠీ, నేపాలీ, ఒడియా, పంజాబీ, సంథాలీ, తమిళం, ఉర్దూల్లోకి అనువదిస్తున్నట్టు వివరించారు. ఇందుకోసం సుప్రీంకోర్టు రిజిస్ట్రీ.. ఐఐటీ-మద్రాసు సహకారం తీసుకుంటోందని తెలిపారు. అనువాదాలకు సంబంధించిన నమూనాలను 200 మంది అడ్వకేట్ ఆన్ రికార్డు(ఏవోఆర్)లకు అందించామని పేర్కొన్నారు. వాటిపై వారి అభిప్రాయాలను కోరామని తెలిపారు. ఏఐ సాంకేతికతను కేవలం కోర్టులోని వాదనలు, తీర్పుల అనువాదానికి మాత్రమే పరిమితం చేస్తున్నామని, న్యాయ నిర్ణయంలో ఎటువంటి పాత్ర ఉండబోదని స్పష్టం చేశారు.

చైనా ఉత్పత్తులపై భారత్ సుంకం

- చవక సరుకుల నుంచి దేశీయ పరిశ్రమలను కాపాడటానికే నిర్ణయం
- ప్లాస్కులు, అల్యూమినియం ఫాయిల్స్ సహా ఐదు రకాల ఉత్పత్తులకు వర్తింపు



న్యూఢిల్లీ, మార్చి 23: ప్లాస్కులు, పలచటి అల్యూమినియం రేకులు (ఫాయిల్స్) సహా మొత్తం ఐదు రకాల చైనా ఉత్పత్తులపై భారత్ యాంటీ డంపింగ్ సుంకాన్ని విధించింది. చైనా నుంచి దిగుమతి అయ్యే చవక ఉత్పత్తుల నుంచి దేశీయ పరిశ్రమలను రక్షించే లక్ష్యంతో కేంద్రం ఈ చర్య తీసుకుంది. వీటిలో సాఫ్ట్ ఫెర్రైట్ కోర్స్, వాక్యూమ్‌తో కూడిన ప్లాస్కులు, అల్యూమినియం ఫాయిల్స్, ట్రైక్లోరో ఐసోసైనారిక్ యాసిడ్, పాలీవినైల్ క్లోరైడ్ పేస్ట్ రెజిన్ ఉన్నాయి. వీటి మీద సుంకాలను టన్నుకు 276 డాలర్ల నుంచి అత్యధికంగా 1732 డాలర్ల వరకూ విధించారు. ఈ మేరకు కేంద్ర ఆర్థికశాఖకు చెందిన 'పరోక్ష పన్నులు, కస్టమ్స్ సుంకాల సెంట్రల్ బోర్డు' వేర్వేరు నోటిఫికేషన్లను జారీ చేసింది. తాజా సుంకాలు అల్యూమినియం ఫాయిల్స్‌పై ఆర్నెళ్ల పాటు, మిగిలిన ఉత్పత్తుల మీద ఐదేళ్లపాటు అమల్లో ఉంటాయని పేర్కొంది. పాలీవినైల్ క్లోరైడ్ పేస్ట్ రెజిన్ విషయంలో మాత్రం చైనాతోపాటు కొరియా, మలేషియా, నార్వే, తైవాన్, థాయ్‌లాండ్ దేశాలకు చెందిన వాటి మీద కూడా ఐదేళ్లపాటు నిషేధం ఉంటుందని తెలిపింది.

ఆహారం వద్దు.. గంజాయి కావాలి!

- జైలులో ముస్కాన్, ఆమె ప్రియుడి రచ్చ

న్యూఢిల్లీ, మార్చి 23: మేరఠ్‌లో మర్చంట్ నేవీ అధికారి సౌరభ్ రాజ్‌పుత్ హత్య కేసులో అరెస్టయిన సౌరభ్ భార్య ముస్కాన్ రస్తోగి, ఆమె ప్రియుడు సాహిల్ జైలులో రచ్చరచ్చ చేస్తున్నారు. మాదకద్రవ్యాలకు బానిసలైన ముస్కాన్, సాహిల్.. తమకు ఆహారం వద్దని, మత్తు కావాలని జైలులో నానాయాగీ చేస్తున్నారు. జైలుకు వచ్చిన రోజు రాత్రి సాహిల్.. గంజాయి ఇవ్వండంటూ రచ్చరచ్చ చేశాడని పోలీసులు వెల్లడించారు. అలాగే, ముస్కాన్ కూడా మత్తు ఇంజక్షన్ల కోసం గొడవ చేసిందని తెలిపారు. మాదకద్రవ్యాలకు బానిసలైన వీరిద్దరికీ జైలు అధికారులు వైద్య సాయం అందిస్తున్నారు. ఇద్దరూ సాధారణ స్థితికి రావడానికి కనీసం 10 రోజులు పడుతుందని వైద్యులు చెబుతున్నారు. ఇక, తనకు న్యాయవాదిని కేటాయించాలని ముస్కాన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

కొడుకు గొంతు కోసిన తల్లి

అమెరికాలో భారత సంతతి మహిళ అరెస్టు

న్యూయార్క్, మార్చి 23: అమెరికాలో ఓ భారత సంతతి మహిళ కన్నప్రేమను మరిచి అమానుషంగా ప్రవర్తించింది. విడాకులు తీసుకుని భర్తకు దూరంగా ఉంటున్న ఆమె.. 11 ఏళ్ల వయస్సు ఉన్న తన కొడుకుని మాజీ భర్తకు అప్పగించడం ఇష్టం లేక ఆ బాలుడి గొంతు కోసి ప్రాణం తీసింది. అమెరికాలోని కాలిఫోర్నియాలో మార్చి 19న జరిగిన ఈ హత్యకు సంబంధించి సరిత(48) అనే మహిళ అరెస్టైంది. సరిత 2018 జనవరిలో తన భర్త ప్రకాశ్‌కు విడాకులు ఇచ్చింది. అయితే, వారి కొడుకు యతిన్(11) బాధ్యతను కోర్టు ప్రకాశ్‌కు అప్పగించింది. ఐదు రోజుల పాటు యతిన్‌ను తన వద్ద ఉంచుకునేలా కోర్టు అనుమతి పొందిన సరిత మార్చి 14న తనతో తీసుకువెళ్లింది. మార్చి 19న తిరిగి ప్రకాశ్ దగ్గరకు పంపాల్సి ఉండగా.. అది ఇష్టం లేక యతిన్ గొంతుకోసింది.

వక్ఫ్ బిల్లు.. రాజ్యాంగంపై దాడి!

- మత సామరస్యాన్ని దెబ్బతీసే బీజేపీ వ్యూహంలో భాగమే: జైరాం రమేశ్



న్యూఢిల్లీ, మార్చి 23: కేంద్రం తీసుకొచ్చిన వక్ఫ్ (సవరణ) బిల్లును రాజ్యాంగంపై దాడిగా కాంగ్రెస్ పేర్కొంది. శతాబ్దాల కాలం నుంచి బలంగా ఉన్న మన దేశ బహుళ మత సమాజ సామరస్యాన్ని దెబ్బతీసేందుకు బీజేపీ నిరంతరంగా చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా దీన్ని తీసుకొచ్చారని ఆరోపించింది. తప్పుడు ప్రచారం చేయడం, దురభిప్రాయాలను సృష్టించడం ద్వారా మైనారిటీ వర్గాలను బూచిగా చూపేందుకు బీజేపీ యత్నిస్తోందని విమర్శించింది. వక్ఫ్ బిల్లు పూర్తిగా లోపభూయిష్టమని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వక్ఫ్‌లను నిర్వహించేందుకు గత చట్టాల ద్వారా ఏర్పాటు చేసిన సంస్థల స్థాయి, అధికారాన్ని తగ్గించేందుకు యత్నిస్తున్నారని పేర్కొన్నారు. వక్ఫ్ ప్రయోజనాల కోసం భూమిని ఎవరు దానం చేయవచ్చో నిర్ణయించడంపై ఉద్దేశపూర్వకంగా అస్పష్టత ఇచ్చారని, వక్ఫ్ నిర్వచనాన్నే మార్చారని రమేశ్ ఆరోపించారు. వక్ఫ్ పాలనను బలహీనం చేసేందుకు ప్రస్తుతం ఉన్న చట్టంలోని నిబంధనలు తొలగించారని, వక్ఫ్ భూములను ఆక్రమించిన వారికి రక్షణ కల్పించేలా మార్పులు చేశారని ఆరోపించారు. వక్ఫ్ ఆస్తులపై వివాదాలు, వాటి రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన అంశాలపై కలెక్టర్లు, నియమించిన ఇతర రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు విశేష అధికారాలు కల్పించడాన్ని ఆయన తప్పుబట్టారు.

బిల్లుకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఆందోళన

వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా దేశ వ్యాప్త ఆందోళన చేపట్టనున్నట్టు ఆదివారం ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ప్రకటించింది. ఈ నెల 17న ఢిల్లీలో నిర్వహించిన నిరసన ప్రదర్శన విజయవంతం కావడంతో జాతీయస్థాయి ఆందోళన జరపాలని కార్యాచరణ రూపొందించినట్టు తెలిపింది. ఇందుకోసం 31 మందితో యాక్షన్ కమిటీని ఏర్పాటు చేసింది. మొదట దశలో భాగంగా ఈ నెల 26న పట్నాలోని అసెంబ్లీ ఎదుట, 29న విజయవాడ (అమరావతి)లోని అసెంబ్లీ ఎదుట ధర్నాలు చేయనున్నట్టు తెలిపింది. 'వక్ఫ్ బిల్లుకు మద్దతు ఉపసంహరించండి...లేకుంటే మా మద్దతును కోల్పోతారు' అన్న సందేశాన్ని బీజేపీ మిత్ర పక్షాలకు పంపించడమే ఈ ధర్నాల ఉద్దేశమని పేర్కొన్నారు. అన్ని రాష్ట్రాల రాజధానుల్లో ప్రదర్శనలను జరుపుతామని, ముఖ్యంగా హైదరాబాద్, ముంబయి. కోల్‌కతా, బెంగళూరు, మలేర్‌కోట్లా (పంజాబ్), రాంచీల్లో భారీ ఊరేగింపులు ఉంటాయని వివరించారు.

ఎన్నికల సంఘం ఓ విఫల సంస్థ

- డీలిమిటేషన్‌తో దేశ రాజకీయాలపై తీవ్ర ప్రభావం: కపిల్ సిబ్బల్

న్యూఢిల్లీ, మార్చి 23: "ఎన్నికల సంఘం ఓ విఫల సంస్థ" అని సీనియర్ న్యాయవాది, రాజ్యసభ ఎంపీ కపిల్ సిబ్బల్ ఆరోపించారు. రాజ్యాంగంలో పేర్కొన్నట్లు ఆ సంస్థ తన విధులను నిర్వర్తించడం లేదని, సమాజంలో అత్యధిక శాతం ప్రజలు దానిపై నమ్మకం కోల్పోయారని చెప్పారు. ఈ సమస్యను తక్షణం పరిష్కరించడం ద్వారానే ప్రజాస్వామ్యాన్ని కాపాడగలమన్నారు. డీలిమిటేషన్ అంశం దేశ రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. పీటీఐకి ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. దేశ న్యాయ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం తగ్గుతోందన్నారు. జడ్జిల నియామకంతోపాటు ప్రస్తుతం ఉన్న వ్యవస్థ సరిగ్గా పనిచేయడం లేదని.. ఈ సమస్యను ప్రభుత్వం, న్యాయ వ్యవస్థ గుర్తించినప్పుడే ఇందులో మార్పు వస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. 'ఇండియా' కూటమి గురించి మాట్లాడుతూ.. అందులోని పార్టీలు కూటమిగానే వ్యవహరించాలన్నారు. వాటికి ఒకే విధానం, సిద్ధాంతం, భవిష్యత్ కార్యాచరణ ఉండాలన్నారు. ఇటీవల కొన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో అవి వ్యవహరించిన తీరు సరికాదని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, దేశంలో జనాభా గణన ఇంకా జరగనందున ఇప్పటికిప్పుడు డీలిమిటేషన్ సాధ్యం కాదని సిబ్బల్ అన్నారు.

నిందితుల ఇళ్ల కూల్చివేత రాజ్యాంగంపై బుల్డోజర్ నడపడమే

- సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ భుయాన్ వ్యాఖ్యలు

పుణె, మార్చి 23: 'బుల్డోజర్ న్యాయాన్ని' సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ తీవ్రంగా వ్యతిరేకించారు. నిందితుల ఇళ్లను బుల్డోజర్లతో కూల్చివేయడమంటే చట్టబద్ధమైన పాలనను కాదనడమేనని అన్నారు. ఇది రాజ్యాంగంపై బుల్డోజర్‌ను నడిపించడంలాంటిదేనని వ్యాఖ్యానించారు. ఆదివారం ఇక్కడి భారతి విద్యాపీఠ్ న్యూ లా కాలేజీలో జరిగిన 13వ పి.ఎన్.భగవతి అంతర్జాతీయ మూట్ కోర్టు పోటీల్లో ఆయన ప్రసంగించారు. మొదట ఇల్లును కూల్చివేసి, అనంతరం దాన్ని అక్రమ కట్టడమని చెప్పి సమర్థించుకోవడం ఆందోళనకరమని చెప్పారు.

50 వేలు దాటిన పాలస్తీనా మృతుల సంఖ్య

టెల్ అవీవ్ మార్చి23: ఇజ్రాయెల్ ఆదివారం జరిపిన తాజా వైమానిక దాడుల్లో 26 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో హమాస్ సీనియర్ రాజకీయ నేత సలా బర్దావిల్, ఆయన భార్య కూడా ఉన్నారు. దీంతో మొత్తం మృతుల సంఖ్య 50 వేలకు చేరింది. హమాస్ బందీలుగా చేసుకున్న వారిని విడిచిపెట్టకపోతే దాడులు మరింత ఉధృతం చేస్తామని ఇజ్రాయెల్ హెచ్చరించింది. తాజాగా ఇజ్రాయెల్ యుద్ధ ట్యాంకులు రఫా పట్టణంలోకి దూసుకుపోయాయి.

సైకిల్‌పై బస్టాండ్‌కు మెదక్ కలెక్టర్

బస్సులో తిరుగు పయనం.. ప్రయాణికులతో ముచ్చట

రామాయంపేట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మూడు రోజుల క్రితం పంట పొలాలను పరిశీలించిన మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ నేడు సైకిల్‌పై బస్టాండ్‌కు వచ్చి అందరినీ ఆశ్చర్యపరిచారు. కలెక్టర్ రాహుల్ ఆదివారం ఉదయం భార్య శ్రీజతో కలిసి సైకిల్ తొక్కుకుంటూ మెదక్ నుంచి 20 కి.మీల దూరంలోని రామాయంపేట బస్టాండ్‌కు వచ్చారు. బస్టాండ్‌లోని సౌకర్యాలను పరిశీలించారు. కలెక్టర్ వచ్చిన విషయం తెలిసిన వెంటనే డిపో మేనేజర్ సురేఖ బస్టాండ్‌కు వచ్చారు. ప్రయాణికులకు తాగు నీటి సమస్య లేకుండా చూడాలని, పరిసరాల్లో చెత్తచెదారం లేకుండా చూడాలని ఆమెను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం భార్యతో కలిసి ఆర్టీసీ బస్సులో టికెట్ తీసుకుని సామాన్యుడిలా మెదక్‌కు తిరుగు ప్రయాణం అయ్యారు. ఆ సమయంలో ప్రయాణికులతో ముచ్చటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మెదక్‌కు చేరుకున్నాక అక్కడి బస్టాండ్‌ను తనిఖీ చేశారు. వసతులను కల్పించాలని అధికారులకు రాహుల్ రాజ్ సూచించారు.



సైకిల్ తొక్కుతున్న కలెక్టర్ దంపతులు

ఆడపిల్ల పుడితే స్వీట్‌బాక్స్

- దివ్యాంగులకు ఉచితభోజనం
- వినూత్న కార్యక్రమాలతో జనంలోకి
- ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ శైలే విభిన్నం

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్ల పుట్టిన కుటుంబానికి స్వీట్‌బాక్స్ అందించాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఆడపిల్ల పుట్టిన కుటుంబం ఇంటికి అధికారులు వెళ్లి శుభాకాంక్షలు తెలిపి, స్వీట్‌బాక్స్ అందించాలని సూచించారు. ఇంట్లో అమ్మాయి పుడితే అదృష్టం అనే భావన కల్పించడంతోపాటు తద్వారా ఆడ పిల్లల జననాల శాతం పెంచడమే లక్ష్యంగా 'గర్ల్‌ప్రైడ్' కార్యక్రమానికి కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ శ్రీకారం చుడుతున్నారు. ఇదొక్కటే కాదు.. జిల్లా కలెక్టర్‌గా ముజమ్మిల్ ఖాన్ గతంలోనూ పలు వినూత్న కార్యక్రమాలతో సామాన్యులకు చేరువయ్యారు. కలెక్టరేట్‌లోని వేర్వేరు విభాగాల్లో పనుల కోసం జిల్లా నలుమూలల నుంచి వచ్చే సామాన్యుల్లో దివ్యాంగులు కూడా ఉంటారు. వారి ఆకలి తీర్చేందుకు ముజమ్మిల్ ఖాన్ చర్యలు చేపట్టా రు. దివ్యాంగులకు ఒక టోకెన్ ఇస్తారు. ఆ టోకెన్ ఇచ్చిన దివ్యాంగులకు ఉచితంగా భోజనం పెడతారు. ఇక మహిళా సాధికారతను ప్రోత్సహించడానికి ముజమ్మిల్‌ఖాన్ చర్యలు చేపట్టారు. వారి అభివృద్ధికి కలెక్టరేట్ క్యాంటిన్‌తోపాటు జిల్లా లో 19 చోట్ల మహిళలతో టీ-క్యాంటిన్లు ఏర్పాటు చేయించారు. ఏ అధికారికి ఆలోచన రాని విధంగా థర్డ్ జెండర్ల ఆరోగ్యం కోసం జిల్లా ఆసుపత్రిలో ప్రత్యేక కేర్ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. ఆర్థిక చేయూత కోసం వారితో స్వయం సహాయ సంఘాలు ఏర్పాటు చేయించారు. థర్డ్ జెండర్ల స్వయం సహాయ సంఘాలకు రుణాలందించి ప్రోత్సహించారు. భార్యాభర్తలు ఉద్యోగులైతే వారి పిల్లల ఆలనాపాలన కోసం కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా డేకేర్ సెంటర్ ఏర్పాటు చేయించడంతోపాటు దాని నిర్వహణకు సిబ్బందినీ నియమించారు.



దివ్యాంగులకు భోజనాన్ని వడ్డిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్(ఫైల్)

కత్తులతో పొడిచి, గొడ్డలితో నరికి...

- ఎల్‌బీనగర్‌లో వ్యక్తి దారుణ హత్య
- పాత కక్షల నేపథ్యంలో చంపిన ప్రత్యర్థులు
- హతుడిపై హత్యాయత్నం సహా పలు కేసులు

కొత్తపేట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్ ప్రాంతంలో ఆదివారం తెల్లవారుజామున దారుణ హత్య జరిగింది. పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న ఓ వ్యక్తిని పాత కక్షల నేపథ్యంలో అతని ప్రత్యర్థులు కత్తులతో పొడిచి, గొడ్డలితో నరికి నడిరోడ్డుపై అతి కిరాతకంగా చంపారు. ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధి శివగంగ కాలనీలో జరిగిన ఈ ఘటనలో బొడ్డు మహేష్ (31) అనే పాత నేరస్థుడు హత్యకు గురయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం.. సూర్యాపేట జిల్లా తిమ్మాపురానికి చెందిన బొడ్డు మహేష్ (31) బతుకుదెరువు కోసం హైదరాబాద్ వచ్చి నేరాలు, గొడవలకు అలవాటు పడ్డాడు. తన ప్రత్యర్థులపై దాడులకు పాల్పడుతూ హయత్‌నగర్, చైతన్యపురి, ఎల్‌బీనగర్ పీఎస్‌లలో నమోదైన పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. ఈ క్రమంలో పురుషోత్తం అనే తన ప్రత్యర్థిపై మహేష్ 2023లో దాడి చేశాడు. అప్పట్నించి కక్ష పెంచుకున్న పురుషోత్తం.. గతేడాది ఓసారి మహేష్‌పై దాడి చేశాడు. ఆ దాడి నుంచి తప్పించుకున్న మహేష్.. ఓ హత్యాయత్నం కేసులో జైలుకు వెళ్లి 20 రోజుల క్రితమే విడుదలయ్యాడు. మరోపక్క, అవకాశం కోసం ఎదురుచూస్తున్న పురుషోత్తం.. శనివారం అర్ధరాత్రి తర్వాత దాడి చేశాడు. మద్యం తాగి స్నేహితుడితో కలిసి ద్విచక్రవాహనంపై వెళుతున్న మహేశ్‌ను.. కారుతో వెంబడించిన పురుషోత్తం శివగంగ కాలనీ వద్ద ఢీకొట్టాడు. ద్విచక్రవాహనంపై నుంచి రోడ్డు మీద పడ్డ మహేశ్‌పై.. పురుషోత్తం, అతని స్నేహితులు నాగార్జున, సందీప్, రాము తదితరులు కత్తులు, గొడ్డలితో విచక్షణారహితంగా దాడి చేసి పారిపోయారు. విషయం తెలిసి ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు రక్తపు మడుగులో పడి ఉన్న మహేష్‌ను ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది.

వడగళ్లు.. కడగండ్లు

(మొదటి పేజీ తరువాయి)

మహబూబ్‌నగర్, రంగారెడ్డి, వనపర్తి జిల్లాల్లో పెద్ద ఎత్తున పంటనష్టం వాటిల్లింది. వందల ఎకరాల మామిడి తోటల్లో కాయలు నేలరాలగా.. వరి, మొక్కజొన్న పంటలు నేలకొరిగాయి. పలుచోట్ల వరి పైరు దెబ్బతిని ధాన్యం నేల రాలి బురదలో కలిసిపోయింది. మహబూబ్‌నగర్ జిల్లాలో శనివారం రాత్రి ఈదురుగాలులు, వడగళ్ల వానకు 1,980 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా వేసినట్లు జిల్లా వ్యవసాయాధికారి బి.వెంకటేశ్ తెలిపారు. హన్వాడ మండలంలోని 2 గ్రామాలు, మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని 5 గ్రామాలు, మూసాపేట మండలంలోని 6 గ్రామాల్లో పంట నష్టం జరిగిందని తెలిపారు. మొత్తం 13 గ్రామాల్లో 1,492 మంది రైతులకు సంబంధించిన 1,980 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు గుర్తించామన్నారు. అందులోనే ఐదుగురికి చెందిన 13 ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నట్లు తెలిపారు. సోమవారం నుంచి క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని పరిశీలిస్తామని తెలిపారు.



వనపర్తి జిల్లా కానాయపల్లిలో నేలకొరిగిన వరి



వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని అమడబాకుల శివారులో నేలరాలిన మామిడి

33 శాతం కంటే అధికంగా నష్టం జరిగినట్లు నిర్ధారణ అయితే ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. ఒక్క మహబూబ్‌నగర్ మండలంలోని ఆరు గ్రామాల్లోనే 1,525 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని రైతులు చెబుతున్నారు. కాగా, మహబూబ్‌నగర్ జిల్లా బొక్కలోనిపల్లిలో పర్యటించిన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వర్షానికి దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులను పరామర్శించారు. ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా చూస్తామని భరోసా ఇచ్చారు. ఇక, శనివారం రాత్రి కురిసిన వడగండ్ల వాన దెబ్బకు వనపర్తి జిల్లా, కొత్తకోట మండలంలోని పలు గ్రామాల్లో వరిపైర్లు దెబ్బతిన్నాయి. మామిడి తోటల్లో కాయలు రాలిపోయాయి. ఖిల్లాఘనపురం శివారులో మొక్కజొన్న పంట పూర్తిగా ఒరిగిపోయింది. మరోపక్క, వికారాబాద్ జిల్లాలో మూడు రోజులుగా వడగళ్ల వానలు పడుతున్నాయి. దీంతో జిల్లాలోని మర్పల్లి, నవాబ్‌పేట్, మోమిన్‌పేట్, కోట్‌పల్లి, పూడూరు తదితర మండలాల్లో 500 ఎకరాల్లో పంటనష్టం వాటిల్లింది.

చల్లబడిన రాజధాని

హైదరాబాద్ సిటీ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రైతులతో ఓ పక్క కన్నీరు పెట్టిస్తున్న అకాల వర్షాలు మరోపక్క రాష్ట్ర రాజధాని హైదరాబాద్ ప్రజలకు మాత్రం ఎండల నుంచి ఉపశమనం ఇచ్చాయి. శుక్రవారం రాత్రి దంచికొట్టిన వానతో వాతావరణం మారిపోయింది. హైదరాబాద్ ఒక్కసారిగా చల్లబడింది. మూడు రోజుల క్రితం 40 డిగ్రీల దాకా నమోదైన ఉష్ణోగ్రతలు శని, ఆదివారాల్లో పడిపోయాయి. పగటి ఉష్ణోగ్రతలతో పాటు రాత్రి ఉష్ణోగ్రతలు కూడా బాగా తగ్గాయి. హైదరాబాద్ జిల్లాలో ఆదివారం గరిష్ఠంగా 34.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఇక, హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో సోమవారం తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం పేర్కొంది.

ఈతకు వెళ్లి ఇద్దరి మృతి.. చిట్యాలలో ఘటన

చిట్యాల రూరల్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఈత సరదా ఇద్దరి ప్రాణం తీసింది. ఈతకు వెళ్లి నీటిలో మునిగి ఇద్దరు మృతి చెందారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం ఏపూర్ గ్రామశివారులో ఈ ఘటన జరిగింది. మృతులను నల్లగొండ మండలం వెలుగుపల్లి గ్రామానికి చెందిన నలపరాజు నవీన్ (20), రసూల్‌పురకు చెందిన చింతపల్లి రాఘవేంద్ర (23)గా గుర్తించారు. ఈతకు దిగిన మరో యువకుడు కడెం తరుణ్‌కు నీటిలో ఉన్న ప్లాస్టిక్ పట్టా చేతికి అందడంతో మెల్లగా బయటకు వచ్చి ప్రాణాలు కాపాడుకున్నాడు. మృతదేహాలను నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దర్యాప్తు కొనసాగుతోంది.

ఎదురొచ్చిన మృత్యువు

సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలో రోడ్డు ప్రమాదం.. ముగ్గురి మృతి

- బైక్‌ను ఢీ కొట్టిన టిప్పర్
- హన్మకొండ జిల్లాలో ఇద్దరి మృతి



గడ్డం రవీందర్ రేణుక రితిక

సూర్యాపేటక్రైం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలో ఆదివారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అతివేగంతో ప్రయాణిస్తున్న ఓ కారు, ఆర్టీసీ బస్సు ఎదురెదురుగా ఒకదానిని మరొకటి ఢీకొన్నాయి. ఈ ఘటనలో కారులో ఉన్న 11 మందిలో భార్యభర్తలు, వారి కుమార్తె సహా ముగ్గురు అక్కడికక్కడే మరణించారు. ఆ దంపతుల కుమారుడి పరిస్థితి విషమంగా ఉండగా.. మిగిలిన వారికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి.. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం కంటాయపాలెం గ్రామానికి చెందిన గడ్డం రవీందర్(34) తన భార్య రేణుక(29), కుమార్తె రితిక(7), కుమారు రిషికృష్ణతో కలిసి హైదరాబాద్‌లో నివసిస్తున్నాడు. భార్య తరఫున బంధువుల ఇంట్లో నిర్వహించిన ఉప్పలమ్మ పండుగ కోసం రవీందర్ కుటుంబసమేతంగా సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలం కోటపహాడ్ గ్రామానికి తన కారులో వచ్చాడు. బంధువులతో సరదాగా గడిపి మధ్యాహ్న భోజనం చేసిన తర్వాత రవీందర్ కుటుంబం హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమైంది. అయితే, వారితోపాటు బంధువులైన కడారి కరుణాకర్, ఆయన భార్య పుష్ప, గంధం మధు, సాత్విక దంపతులు, వారి పిల్లలు గంధం గగన్‌చందర్, గంధం మల్లికార్జున్, కడారి జస్విన్ అనే మరో బాలుడు కలిపి మొత్తం 11మంది ఆ కారులో బయలుదేరారు. అయితే, సాయంత్రం ఐదు గంటల సమయంలో చివ్వెంల మండలం బీబీగూడెం సమీపంలోకి రాగానే కారు.. సూర్యాపేట నుంచి ఖమ్మం వెళ్తున్న పల్లెవెలుగు బస్సు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు అవ్వగా.. రవీందర్, రేణుక, రితిక అక్కడికక్కడే మృతి చెందారు. రవీందర్ కుమారుడు రిషికృష్ణ పరిస్థితి విషమంగా ఉంది. అతడిని మెరుగైన చికిత్సకోసం హైదరాబాద్‌కు తరలించారు. మిగిలిన వారికి గాయాలయ్యాయి.

హనుమకొండ జిల్లాలో ..

హసన్‌పర్తి: హనుమకొండ జిల్లా హసన్‌పర్తిలో టిప్పర్ ఓ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టడంతో ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు మృతి చెందారు. హసన్‌పర్తి మండలం సీతంపేటకు చెందిన స్నేహితులు దుర్గం పవన్‌కల్యాణ్ (22), బొౌతు మహేశ్ (20) ఆదివారం బైక్‌పై హసన్‌పర్తికి వెళ్లి సీతంపేటకు తిరిగి వస్తున్నారు. మార్గమధ్యలో ఓ మూల మలుపు వద్ద నేషనల్ హైవేకు మట్టి తరలిస్తున్న ఓ టిప్పర్ వారి బైక్‌ను అతి వేగంగా ఢీకొట్టింది. దీంతో పవన్ కల్యాణ్, మహేశ్ అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనా స్థలంలో ఇద్దరు యువకుల మృతదేహాలను చూసిన టిప్పర్ డ్రైవర్ అక్కడి నుంచి పారిపోయినట్లు స్థానికులు చెప్పారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాలను మార్చురీకి తరలించారు. పవన్ కల్యాణ్ మెకానిక్‌గా పనిచేస్తూ, మహేశ్ కూలీ పనులకెళుతూ కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నారు. చేతికందొచ్చిన కుమారులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.



సూర్యాపేట జిల్లా చివ్వెంలలో జరిగిన ప్రమాదంలో ధ్వంసమైన కారు

ఔటర్‌పై రెండు కార్లు ఢీ

- ఒకరి మృతి, ఐదుగురికి గాయాలు

నార్సింగ్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): డ్రైవర్ నిద్రమత్తో లేదా అతి వేగం కారణంగానో ఔటర్‌పై ఓ కారు డివైడర్‌ను ఢీకొట్టి ఎగిరి రోడ్డుకి అవతలివైపు వస్తున్న మరో కారుపై పడింది. హైదరాబాద్ నార్సింగ్ సమీపంలో ఔటర్ రింగ్ రోడ్డుపై శనివారం అర్ధరాత్రి జరిగిన ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. అప్పా నుంచి నార్సింగ్ వైపు వస్తున్న కారు నార్సింగ్ టోల్ గేట్ సమీపంలో డివైడర్‌ను ఢీ కొట్టి గాల్లోకి ఎగిరి అటు పక్క శంషాబాద్ వెళ్తున్న మరో కారుపై పడింది. ఈ ప్రమాదంలో డివైడర్‌ను ఢీ కొట్టిన కారు డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందగా, శంషాబాద్ వైపు వెళ్తున్న కారులోని ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన కారు డ్రైవర్‌ను శివరాంపల్లికి చెందిన ఆనంద్ కామ్లేగా గుర్తించారు. ప్రమాదం నిద్రమత్తుతోనా లేదా అధిక వేగం కారణంగా జరిగిందా అని విచారిస్తున్నారు.

గెరిల్లా స్థావరంగా కర్రెగుట్ట..?

కొండపై అడుగడుగునా ప్రెషర్ బాంబులు.. వరుస పేలుళ్లతో గిరిజనుల్లో భయం


హైదరాబాద్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో మావోయిస్టుల ఉనికి నామమాత్రమనేది రాష్ట్ర పోలీసుల మాట. కానీ, ములుగు జిల్లాలో పరిస్థితి వేరుగా ఉంది. అక్కడ జరుగుతున్న వరుస ఘటనలను గమనిస్తే జిల్లాలో గెరిల్లా బేస్ క్యాంప్ కోసం మావోయిస్టులు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అందుకోసం కర్రెగుట్టను ఎంపిక చేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కర్రెగుట్ట పరిసర ప్రాంతాల్లో సుమారు 5 కి.మీ వరకు మావోయిస్టులు ప్రెషర్ మైన్స్ ఏర్పాటు చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. రెండు రోజుల క్రితం కర్రెగుట్టలోని ముత్యాలధార జలపాతం వద్ద అటవీ ఉత్పత్తుల సేకరణకు వెళ్లిన ఇప్పగూడెం గ్రామానికి చెందిన కృష్ణమూర్తి మందుపాతర పేలి తీవ్రంగా గాయపడ్డాడు. గత ఏడాది చెలిమెల గ్రామానికి వెళ్తున్న అంకన్నగూడెం ఆదివాసీ నవీన్ కర్రెగుట్ట సమీపంలో మందుపాతర పేలి తీవ్ర గాయాలపాలయ్యాడు. చొక్కాల గ్రామానికి చెందిన డర్ర సునీత కర్రెగుట్ట వద్ద మందుపాతర పేలడంతో తీవ్రంగా గాయపడింది. ఇది జరిగిన కొద్ది రోజులకే జగన్నాథపురం గ్రామానికి చెందిన ఏసు.. మందుపాతర పేలి చనిపోయాడు. దీంతో కర్రెగుట్ట ప్రాంతాన్ని జల్లెడ పట్టాలని, మందు పాతరలను నిర్వీర్యం చేయాలని జిల్లా పోలీసులకు డీజీపీ కార్యాలయం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో మందుపాతరలను గుర్తించడానికి స్నిఫర్ డాగ్స్‌ను రంగంలోకి దించారు. ములుగు జిల్లాలో మావోయిస్టుల కదలికలు అడపాదడపా కనిపిస్తూనే ఉన్నాయి. గత ఏడాది జరిగిన పలు ఎన్‌కౌంటర్లలో ములుగు జిల్లాలోనే 17 మంది మావోయిస్టులు మరణించారు. చల్పాక వద్ద డిసెంబరు 1న జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు చనిపోయారు. గత సెప్టెంబర్‌లో కొత్తగూడెం, ములుగు జిల్లాల సరిహద్దుల్లో దామెరతోగు వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టులు మరణించారు. జూలైలో తాడ్వాయి వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒక మావోయిస్టు.. ఏప్రిల్‌లో ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని పూజారి కాంకేర్ కర్రెగుట్ట వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మరణించారు.

ప్రముఖ గాంధేయవాది కృష్ణభారతి కన్నుమూత



కృష్ణభారతి (ఫైల్)

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ గాంధేయవాది పసల కృష్ణభారతి (92) కన్నుమూశారు. ఆదివారం హైదరాబాద్‌లోని స్నేహపురి కాలనీలోని సోదరి నివాసంలో ఆమె తుదిశ్వాస విడిచారు. వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న కృష్ణభారతి.. తన సోదరి నివాసంలో ఉంటున్నారు. ఆమెకు నలుగురు అన్నదమ్ములు, ముగ్గురు అక్కచెల్లెళ్లు ఉన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పెంటపాడు మండలం పడమర విప్పర్రుకు చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు పసల కృష్ణమూర్తి, అంజలక్ష్మి దంపతుల రెండో కుమార్తె కృష్ణభారతి. సమాజంలోని చివరి వ్యక్తివరకు విద్యను తీసుకెళ్లడంకోసం సేవాభావంతో కృష్ణభారతి చేసిన కృషి దేశాన్ని ఆకర్షించింది. తాడేపల్లిగూడెం కేంద్రంగా అనేక సాంఘిక సంస్కరణలను ఆమె చేపట్టారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో 2022 జూలైలో జరిగిన అల్లూరి సీతారామరాజు విగ్రహ ఆవిష్కరణ సభలో కృష్ణభారతికి ప్రధాని పాదాభివందనం చేసి సత్కరించారు. ఆమె మృతి పట్ల ఏపీ సీఎం చంద్రబాబు సంతాపం ప్రకటించారు.



నిద్రించేవాళ్లు

నిద్రించేవాళ్ళను చూసినప్పుడు
వారి కన్నులు ప్రసరించే వెలుతురులో
నేను మరింత మేల్కొంటాను
నిద్రించేవాళ్లు,
నేల మీద పరిచిన శిలువల మీద
పడుకున్న నీడల్లాంటి వాళ్ళు
వారిని చూసినప్పుడు
నిద్రకీ మెలకువకీ మధ్య
రెప్పవేయని కనురెప్పలా కదులుతూ ఉంటాను

నిద్రించేవారి చుట్టూ నిలువెత్తు పక్షిలా తిరుగుతూ
ప్రార్థనలాంటి గీతాలు పాడుతాను
వారి కన్నుల మీద కదిలే
కాంతి చీకట్లతో ఆడుకుంటాను
వారి కలలతో కలిసి
వారి ఆత్మల పలకల మీద
కవిత్వాలు రాస్తాను
నిద్రించేవారు
తమ చుట్టూ పేర్చుకున్న
నిశ్శబ్ద సరస్సులలో
నా నీడకు స్నానం చేయిస్తాను

సత్యాన్ని వెలికి తీసే పనిలో
నిద్రించేవాళ్లు,
తమ మీద సముద్రాలను కప్పుకుంటారు
వారి పెదాల మీద దోబూచులాడే
పసిపిల్లల్లాంటి పక్షుల్లా విచ్చుకునే పువ్వుల్ని చూసి
మనసారా నవ్వుకుంటాను
నిద్రించే వాళ్ళు
తమ ఆనవాళ్లను మరిచిపోయి
కొత్తగా ఉదయించబోతున్న కొత్త మనిషి
స్వాగతం కోసం
తమను పువ్వుల్లా పరుచుకుంటారు
గడిచిపోయిన కాలాల నెరవేరని
స్వప్నాలను దీపాలుగా వెలిగించి
తమకు కాపలా పెట్టుకుంటారు

వారిని చూస్తుంటే
అంతరిక్షంలో అప్పుడే కళ్ళు తెరిచిన నక్షత్రాలేవో
నా ఊహల్లో ఊగుతుంటాయి
నిద్రించేవాళ్ళను చూడడమంటే
ఉదయించే గోళాలకు తలను ఆన్చి
మెలకువలో నిద్రపోవడమే

నిద్రించేవాళ్లు,
నీటినీ మనిషినీ జో కొడుతూ
తీరంలో జోగుతున్న పడవలు
ఆరిన కాంతిలో తడిసిన ఆత్మల
మైమరపు మత్తులో తూగుతున్న ప్రమిదలు
నిద్రించేవాళ్లు,
ముక్కు మూసుకుని తపస్సు చేసుకునే
మునీశ్వరులు కాదు
దేహంలోని తూటాలకు తమ ప్రాణాలను
పాటలుగా దానం చేస్తున్న
అజ్ఞాత వీరులు
నిద్రించేవారు,
నిద్రలో మానవ స్పృహ కోల్పోయి
ఏవో శూన్య జలాల మీద
అపూర్వ అనుభవానందంలో
తేలుతూ ఉంటారు

చెట్లతో పక్షుల సంభాషణ లాగా
నిద్రించేవాళ్లు,
సుఖదుఃఖాలకు అతీతమైన
మంత్రం ఏదో పఠిస్తూ ఉంటారు
నిద్రపోయే వాళ్లంతా పసిపాపలే
నిద్రించేవాళ్లని చేతకాని వాళ్ళని నిందించకండి
మన మెలకువను వేకువగా వెలిగించడానికి
వాళ్లు కలల్లో కాలిపోతుంటారు
వారిని నేను చూసినప్పుడల్లా
అప్పుడే మళ్ళీ జన్మిస్తాను
నీషే చెప్పిన బాలుడిలా.

■ ప్రసాదమూర్తి
✆ 84998 66699

సోమవారం 24 మార్చి 2025

వివిధ

vividha@andhrajyothy.com
సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్



కొన్ని సాహిత్యంతో బతికిన క్షణాలు

కాసిని రూకల సంపాదనకు, ఆకలి శత్రువును మచ్చిక చేసుకొనేందుకు బ్రతుకు కట్టుకొయ్యకు బందీలమే అందరం. అరుదుగా అది వదులయే అవకాశం వస్తుంది. అప్పుడప్పుడు ప్రయాణాల రూపంలో. నిత్యజీవన సంగ్రామంలో ఒక ఆటవిడుపు ప్రయాణం. బంధిత తూనీగను 'ఎగిరిపో' అని అగ్గిపెట్టె తెరిచిన అద్భుతం. ఇటీవల అలా వచ్చిన అవకాశం సాహిత్య అకాడమీ వారి ఆహ్వానం.



వరుసగా: సిద్ధార్థ శంకర్ కలిత (అస్సామీ), రంగకిబాక్ (ఖాసీ), టి. కె. సంతోష్ కుమార్ (మళయాళం), తిరు ప్రసాద్ (నేపాలీ), ఎన్. కిరణ్‌కుమార్ సింగ్ (సభాధ్యక్షుడు), మందరపు హైమవతి (తెలుగు), అక్షత రాజ్ (తుళు)

మార్చిలో 7 నుంచి 12 వరకు జరిగే 'సాహిత్యోత్సవ్'లో పాల్గొనమని వచ్చిన పిలుపుతో మబ్బుల రాదారిపై పయనించి ఢిల్లీలోని సాహిత్య అకాడమీ కార్యాలయం ఆవరణలో అడుగుపెట్టాను. అడుగుపెట్టానో లేదో పుస్తకాల చిత్రాలతో ఏర్పాటు చేసిన అపురూపమైన స్వాగతద్వారాలు. అన్ని భాషల అక్షరాలను ఒకేచోట కొలువు తీర్చిన డిజైన్లు. కళ్ళెత్తి చూస్తే కనకాభిషేకాలు అన్నట్లు గోడల మీద కనిపించే వివిధ భాషల రచయితలు, కవుల ఫొటోలు. ఓ పక్కన కార్యక్రమంలో పాల్గొన డానికి వస్తున్న రచయితలు.

సాహిత్యంలో కథ, నవల, వ్యాసం, విమర్శ ఎన్ని ప్రక్రియలున్నా కవిత్వం ఎక్కువగా భావోద్వేగాల ప్రవాహం. అందుకే దానికి ఆకర్షణ అధికం. ఈ ఆరు రోజుల సమావేశంలో మొత్తం 24 కవి సమ్మేళనాలు నిర్వహించారు. బహుభాషా కవి సమ్మేళనాలు, దళిత కవి సమ్మేళనం, అస్మిత, నారీ చేతన మొదలైన మహిళల కవి సమ్మేళనాలు ఈశాన్య, దక్షిణ భాషా కవి సమ్మేళనం శ్రోతల కవిత్వ దాహాన్ని తీర్చాయి.

11న కావేరీ సంభాగరలో ఎస్. కిరణ్ కుమార్ సింగ్ అధ్యక్షతన 'టేస్టీ సౌండ్' కవి సమ్మేళనంలో సిద్ధార్థ శంకర్ కలిత (అస్సామీ), రగకి బాక్ (కాశీ), టి.కె. సంతోష్ కుమార్ (మలయాళం), తిరు ప్రసాద్ (నేపాలీ), అక్షత రాజ్ (తుళు)లతో పాటు నేను 'ఈ దేహం ఎవరిది', 'కూరగాయలమ్మాయి', 'వంటింటి సూర్యోదయాలు' ఈ మూడు కవితలూ చదివాను. వీటిని కల్లూరి శ్యామల అనువదించారు.

ఈ ఆరు రోజుల కార్యక్రమంలో రెండు తెలుగు రాష్ట్రాల నుండి శ్రీయుతులు ఖాదర్ మొహియుద్దీన్, ముకుంద రామారావు, రెంటాల జయదేవ్, ఎ. కృష్ణారావు, వేంపల్లి షరీఫ్, పి. జ్యోతి, తోట సుభాషిణి, ఓల్గా, రాగిళ్ళ రమేష్, స్వర్ణ కిలారి, పెండ్యాల గాయత్రి, కోడూరి విజయకుమార్, కొలకలూరి ఇనాక్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాలన్నీ ఒకేసారి వేరు వేరు చోట్ల జరగడం వలన అన్నీ వినటం కుదరలేదు.

ఈ సాహిత్య కార్యక్రమంలో 'కథా సంధి', 'రచయితతో ముఖాముఖి', 'సంవత్సర లెక్చర్ ఈవెంట్స్ జరిగాయి. ముఖ్యంగా ఎనిమిదో తారీకున సాహిత్య అకాడమీ బహుమతి గ్రహీతలకు సన్మాన కార్యక్రమం కూడా జరిగింది. ఈ సంవత్సరం విమర్శకు పెనుగొండ లక్ష్మీనారాయణ గారు బహుమతి గ్రహీత.

ఢిల్లీ 'సాహిత్యోత్సవ్' నుంచి వచ్చి పది రోజులు దాటినా ఇంకా అక్కడే తారట్లాడుతున్న ఆత్మ. ఇంకా చెవుల్లో వినిపిస్తున్న కవి సమ్మేళనం కవితలు, ప్రసంగాల పరంపరలు. బుద్ధుడికి రావిచెట్టు కింద జ్ఞానోదయమైనట్టు ఈ విశాల విశ్వ కవితా సాగరంలో నేనొక అతి చిన్న బొట్టునే అన్నది ఈ ఉత్సవాల్లో నేను గ్రహించిన నిజం.

చివరిరోజు ప్రఖ్యాత బెంగాలీ కవి సుబోధ్ సర్కార్‌తో ముఖాముఖి చాలా అద్భుతమైన కార్యక్రమం. లెక్కకు మించి పుస్తకాలు రాసిన సుబోధ్ సర్కార్ తన ప్రసంగంలో ఎన్నో ఆసక్తికర విషయాలు చెప్పారు. బాల్యంలో ఒకసారి టికెట్ లేకుండానే రైలు ఎక్కారట. టీసీ వచ్చి పట్టుకొని ఫైన్ కట్టమంటే డబ్బులు లేవని చెప్తే పోలీస్ స్టేషన్‌కి తీసుకు వెళ్లారట. "నా దగ్గర టికెట్ లేదు. నా బుర్రలో కవిత్వం ఉన్నది" అని కవితలు చదివారట. అప్పుడు పంపించేశారట. ఆయన రాసిన కవితా సంపుటి గురించి- ఇది చదివితే 30ఏళ్ళ భారత దేశ చరిత్ర తెలుస్తుందన్నారు. ఇటీవల జరిగిన మణిపూర్ సంఘటన గురించి "hacked my mothers of Manipur, she is burning" అని కవిత చదువుతున్నప్పుడు కన్నీటి నది ఐపోయింది మనసు. నేనూ కూడా మణిపూర్ సంఘటన మీద రాసిన 'ఖబడ్దార్' కవిత గుర్తుకు వచ్చింది. ఎంతో ప్రభావితం చేసిన ఆయన ముఖాముఖీ విన్నాక- "మంచి కవిత్వమే ఉంది, రాజ్యమెందుకు" (సుకవితాయద్యస్తి రాజ్యేనకిమ్) అనే మాట గుర్తుకు వచ్చింది.

టీ విరామ సమయాలలో అనేక భాషా కవులతో సంభాషణలు. తమిళ కవి రమేష్ మాటల సందర్భంలో తనకి కుప్పం యూనివర్సిటీ, బి. తిరుపతిరావు గారు తెలుసని చెప్పారు. తన కవితలను ఆ యూనివర్సిటీలో వారు అనువదించారని చెప్పారు. కన్నడ కవయిత్రి పూర్ణిమ, తమిళ కవయిత్రి అక్షతల స్నేహ సంభాషణలతో కవిత్వానికి ఎల్లలు లేవనిపించింది. ఈ సభలు చూడడానికి వచ్చిన మలయాళ కవి గణేష్ పుత్తూర్ తాను సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీతనని, తెలుగు కవి రమేష్ కార్తీక్ తెలుసని చెప్పారు.

ఈ రెండు రోజులు అందరూ కలిసి మాట్లాడుకోవడం, కలిసి సమయం గడపడం, ఒక సాహిత్య వాతావరణంలో జీవించడం... నిజంగా ఇవే కదా బ్రతికిన క్షణాలంటే అనిపించింది. నాకు ఈ అవకాశమిచ్చిన సాహిత్య అకాడమీ కార్యదర్శి శ్రీనివాస్ రావుగారికీ, ప్రసేన్ గారికీ హృదయపూర్వక ధన్యవాదాలు.

ఊగి ఊగి దిగినా ఇంకా కాసేపటి వరకు ఊగుతూనే ఉంటుంది ఉయ్యాల. అలాగే ఢిల్లీ 'సాహిత్యోత్సవ్' నుంచి వచ్చి పది రోజులు దాటినా ఇంకా అక్కడే తారట్లాడుతున్న ఆత్మ. ఇంకా చెవుల్లో వినిపిస్తున్న కవి సమ్మేళనం కవితలు, ప్రసంగాల పరంపరలు. విశాలమైన ఢిల్లీ వీధులు, ఇరుపక్కలా చెట్లు, అతిథులను సేద తీర్చే ఆత్మీయమైన దీవెనలు. అద్భుతమైన వాతావరణం. బుద్ధుడికి రావి చెట్టు కింద జ్ఞానోదయమైనట్టు ఈ విశాల విశ్వ కవితా సాగరంలో నేనొక అతి చిన్న బొట్టునే అన్నది ఈ ఉత్సవాల్లో నేను గ్రహించిన నిజం.

■ మందరపు హైమవతి
✆ 94410 62732



వాక్యాల్లేని ప్రపంచంలో...

నీతో కలిసి నీ నీడల్లోకి నడిచే పాదాలుండవు. నీ ఒంటరితనం మరింత చిక్కబడుతుంది. నీ ఉదయాలకు సాయంత్రాలకు రంగులద్దే చిత్రకారుడు లేక దృశ్యాల చుట్టూ చీకటి. వాక్యం తోడులేని వెన్నెల రాత్రులు పండవు. పిట్టల పాటల్ని శిశిరాలు ఎత్తుకుపోతాయి. ఒక్క ఎలిజీ కూడా తోడులేక నీ శోభాయాత్ర వెలవెలబోతుంది.

నిన్ను ప్రకృతితో కలిపే దారం తెగిపోయి నీ ప్రేమ ప్రకటనలో ప్రాణం లోపిస్తుంది. నీ మాటల్లోకి నదులు ప్రవహించవు. పువ్వుల భాషలో నీతో సంభాషించే వాళ్లుండరు. చలికి వణికే ఎడారుల లిపి నీకు అర్థం కాదు. కమ్ముకున్న పొగమంచులో గొంతును ఎలా పెగుల్చుకోవాలో తెలియదు. ఒక ఉద్వేగాన్ని పండించడంలో కవికి ఉన్నంత నేర్పు నీకుండదు. నీ కలలకు అనువాదాలు దొరకవు.

నీ జెండా కర్ర మీద పిట్టలు వాలవు. లోయల గొంతు నీకు వినిపించదు. అడవి తుడుం మోత నీ గదిలో మోగదు. ఒక్కో అవయవమూ రాలి నువ్వు శిథిలమవుతూ రాజు భుజం మీదే మిగిలిపోతావు. చెట్టుకొమ్మకు ప్రశ్నలా వేలాడ్డం నీవల్ల కాదు.

నీతో కలిసి నీకోసం ఏడ్చే వాళ్లుండరు. పొదల్లో నక్కిన తోడేలుగుట్టు ఆఖరు వరకూ పిల్లాడికి తెలీదు. నీ ఊపిరి మీద కాలేసి తొక్కుతుంటే నీ తరుపున అడిగే గొంతుండదు. అండా సెల్‌లలోకి జీవనదులు ప్రవహించకపోతే, రెక్కలపై వేలాడుతున్న సంకెళ్ళలోంచి అక్షరాలై కురవకపోతే కాలం తప్పొప్పులు చరిత్ర రక్తం లోకి ఇంకవు. రాజ్యం జన్యువుల్లో వచ్చే ఉత్పరివర్తనాల గురించి ఎప్పటి కప్పుడు నిన్ను హెచ్చరించే వారుండరు. బుల్డోజర్ కింద నలిగే కన్నీళ్ళు పిడికిళ్లు కాలేవు. చివరికి నువ్వు మరణించిన సంగతి నీకే తెలీదు.

■ సాంబమూర్తి లండ
✆ 96427 32008

పతంజలి పురస్కార ప్రదానం

స్వర్గీయ కె.ఎన్.వై. పతంజలి 73వ జయంతి సందర్భంగా పతంజలి సాంస్కృతిక వేదిక అందించే పురస్కారాన్ని 2025 సంవత్సరానికి గాను పాత్రికేయుడు, రచయిత తాడి ప్రకాష్ స్వీకరిస్తారు. మార్చి 29 సాయంత్రం విజయనగరం లోని గురజాడ గ్రంథాలయంలో ఈ పురస్కార ప్రదానం జరుగుతుంది.

భీశెట్టి బాబ్జి

కథల పోటీ

వాసా ప్రభావతి స్మారక కథల పోటీకి ఏదైనా సామాజిక అంశానికి సంబంధించిన కథలు పంపాలి. రాతప్రతిలో ఎ4 సైజులో నాలుగు పేజీలకు, డిటిపి రెండు పేజీలకు మించరాదు. ప్రథమ, ద్వితీయ బహుమతులు వరుసగా: రూ.5000, రూ.2500. ఐదు ప్రత్యేక బహుమతులు రూ.1000. కథలు పోస్ట్/ కొరియర్ ద్వారా మాత్రమే ఏప్రిల్ 30 లోగా పంపాలి. చిరునామా: సాహితీ కిరణం, ఇం.నెం.11-13-154, అలకాపురి, రోడ్‌నెం.3, హైదరాబాద్-500102. మరిన్ని వివరాలకు: 94907 51681.

పొత్తూరి సుబ్బారావు

దళిత కవితకు తార్కిక పదును

దిశానిర్దేశం లేని అర్థరహిత జీవితాన్ని, కల యొక్క ప్రాధాన్యతను వివరిస్తూ ప్రసిద్ధ అమెరికన్ బ్లాక్ పొయెట్ లాంగ్‌స్టన్ హ్యూస్ "కలలు లేని జీవితం, ఎగరలేని రెక్కలు విరిగిన పక్షి" వంటిదంటాడు. కలలు భవిష్యత్తు కోసం ప్రేరణనిచ్చి, పోరాడే శక్తినిస్తాయి. ఇక్కడ కల అంటే గమ్యాన్ని నిర్దేశించుకోవడంలో హేతువాద ఆలోచన కలిగిన తాత్వికత. భారతీయ సమాజంలో సామాజిక అసమానతలు ఇంకా ఒక ప్రధాన సమస్యే! రాజ్యాంగం చట్టపరంగా సమానత్వాన్ని నెలకొల్పినప్పటికీ, సామాజిక స్థాయిలో మార్పును తీసుకురావడానికి కవిత్వమే శక్తివంతమైన సాధనం కాగలదు.

బ్లాక్ పోయెట్రీలా భారతీయ కులవివక్షకు వ్యతిరేకంగా వచ్చిన నిరసన కవిత్వమే దళితకవిత్వం.



ఇది బౌద్ధం, అంబేద్కర్ రాజ్యాంగం, మార్క్సిజం తాత్వికతను ఆపాదించుకున్నాక కవిత్వోద్యమస్థాయిని దాటి పరిణత దళిత సాహిత్యంగా మార్పు చెందింది. వేముల ఎల్లయ్య 'క్రీనీడ – తార్కిక కవిత్వం' కవితా సంపుటి దళిత తాత్వికతతో, విశ్వజనీన విశాల దృక్పథంతో తర్కించుకుంటూ పరిణామం చెందినట్టుగా కనిపిస్తుంది. దీనిలో కేవలం అనుభవాలను వ్యక్తీకరించడమే కాకుండా, పరిష్కారం కనబడుతుంది.

వెలుతురులో జీవించలేని జీవితాల పట్ల వివక్షకు నీడ ప్రతీక. 'క్రీనీడ' అంటే కింది నీడని అర్థం. ఈ పదబంధం తీవ్ర అణిచివేత, పరాధీనతను సూచించినా, ఈ 'క్రీనీడ' కవిత్వం హేతువాదంతో పరిష్కారం దిశగా ఆధిపత్యాన్ని సవాలు చేస్తుంది. ఈ కవిత్వంలో సొంత భాష, స్వీయ అనుభవాలు, భావోద్వేగాలు కవికి మాత్రమే పరిమితం కాలేదు. సార్వజనీనమైనవి. ఆ విధంగా 'క్రీనీడ' అంతర్జాతీయస్థాయి కవిత్వం.

వేముల ఎల్లయ్య కవిత్వంలో శైలి, అభివ్యక్తి, వస్తుపరంగా పరిణామం చెందుతున్నా, భాష స్థిరంగా ఉంది. వచనంలో, కవిత్వంలో భాషాపరంగా బలమైన దళిత జీవిత ఇమేజరీ ఉంటుంది. మొనదేలిన వడపోతలేని భాష ఉంటుంది. నిండైన నిరసనతో కూడిన ఆవేదన ధ్వనిస్తుంది. కవిత్వానికి తీసుకున్న వస్తువును దేశీయ పదాలలో కుదించి, సరళంగా చెప్పడం కన్పిస్తుంది.

రెక్కలు లేని పక్షి ఎగరలేదు. తాత్వికత లేని కవి స్వతంత్రంగా ఆలోచించలేదు. తర్కించలేదు. అలాంటి లిల్లీపుట్ కవుల గురించి వేముల ఎల్లయ్య 'గతి' కవితలో రాశాడు. "మొగవేశ్య కవీ మొఖం కప్పిన పట్టుచీర/... ఏ దేశం దేవ్లాడినా మీలాంటి సంస్కృతి తస్కరీ కవులు దొరుకున?/ఏం! లగాయించిన లత్కోర్సాప్ కూలిపోయే పాలకుని నిల్పే కైతా!" అని రాజకీయనాయకుల అధికారాన్ని నిలబెట్టడానికి కవిత్వాన్ని రాసే వెన్నులేని కవులను కవిత్వబోనులో దోషిగా నిలదీస్తాడు.

ఇందులోని కవితలు ఎక్కువగా సామాన్యుల విజయాలు. వారి సామాజిక బలిదానాలను, త్యాగాలను కీర్తించడం; మహిళ, దళిత, బహుజన కవులు, కళాకారుల స్మృతి కవితలు; సమకాలీన ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ రాజకీయ అంశాలు; యుద్ధోన్మాదం; దళిత రాజకీయాలపై ఆక్రోశం, దళితజాతి సంస్కృతి గొప్పదనం, దళితకవుల తాత్వికభూమికను చర్చిస్తాయి.

ఉద్యమాలను నిర్మించే సాహిత్య ప్రక్రియ కవిత్వం. అయినా పిడికిలి ఎత్తినదే కవిత్వమనే పిడివాదాన్ని కవిగా ఎల్లయ్య వ్యతిరేకిస్తాడు. దళిత కవుల జీవితంలో ఒత్తిడి, అవమానం ఉంటాయి కాబట్టి, వారి కవిత్వంలో ఎక్కువగా నిరసన ఉంటుందని కొందరు అపోహ పడుతుంటారు. కానీ వారు ప్రబంధ వర్ణనను మించి రాయగలరని 'ఉదయ పుంత' తెలియజేస్తుంది. ఈ కవితలో ప్రకృతి తాత్వికత, దళితజీవన సౌందర్యం కనిపిస్తుంది. "వెన్నెల వెదజల్లిన మొగులు కొప్పెర కప్పి/ తారలు పొదిగిన కంటిపొరల కింది కనుపాపల్లే/ నెమలి పురులిప్పిన భూమి బొంగురంజాల విప్పే/ ఆకాశపు కొప్పు దులిపిన గర్భం మొగులొల్లే/ బాలింత వాసన మబ్బు దిగిన వర్షం కురిసిన తలం/ పంటకు దూప పొదు మల్లి ఇగురుపొర పొద్దునద్దే/ పండు ఉదయపుంత కిరణం పానిపై లోకమల్లెచ్చే.../ అడవికొసరు పరుసు కున్న మనిషి యంత్రం పిప్పి" అంటాడు.

'క్రీనీడ' సంపుటి లోని కవిత్వం హేతువాదంతో పరిష్కారం దిశగా ఆధిపత్యాన్ని సవాలు చేస్తుంది. కేవలం అనుభవాలను వ్యక్తీకరించడమే కాకుండా, పరిష్కారం కనబడుతుంది. దళిత, బహుజన స్పృహను మేల్కొలిపే గొప్ప తాత్విక తార్కిక కవిత్వం 'క్రీనీడ' కవిత్వం.

పై కవితలో మబ్బులు వర్షానికి తడవకుండా వెన్నెలకు కొప్పెరను కప్పి, తారలను కంటిపాపలా కాచి, కొప్పెర పట్టిన వర్షపు బిందువులను భూమిపై దులిపితే, అది బాలింత వాసనతో నిండుగర్భిణిలా మారుతుంది. పంటకు పాదుగా నీటినిచ్చి, తిరిగి మాయమై కొత్తచిగురు కాసేలా పొద్దును ఆహ్వానిస్తాయి. కవి దళిత ప్రకృతి ప్రేమకు ప్రతీకగా నల్లని మబ్బును తీసుకున్నాడు. భూమిపై తన చెమటను చిందించడం, తోటి మనిషి యంత్రం చేతిలో పిప్పిలా మారి ప్రకృతిని దెబ్బతీసే తత్వాన్ని ఈ కవితలో వ్యక్తం చేశాడు.

వేముల ఎల్లయ్య ఈ సంపుటిలో ఒకచోట "లేనితనమే మనిషి మేనిఫెస్టో" అంటాడు. ఎక్కువగా సఫాయికార్మికులు సామాజికంగా వెనుకబడినవారే ఉంటారు. 'సఫాయి' కవితలో వారి చెమట రుచిని, వారి మురికి జీవితాలలో గట్టుతెగిన కష్టాలను పట్టించుకోని నిర్లక్ష్యాన్ని తెలియజేస్తూ "చెమట అద్దిన నాలికే మైలవగరు రుచి.../ పారతిప్పిన మోరి తట్టుతెగిన ము రుగు.../కులం దూర్చిన పనిగడియ ఏ కార్మిక మేనిఫెస్టో లిఖితం?/ ...గీ దేశం మురికి కులవీలునామే! ఏర్కుందా?" అని సమాజానికి ప్రశ్నను, మేలుకొలుపును ఒకేసారి సంధిస్తాడు. కవిత్వంలో కనిపించే ఆవేశం, ఆవేదన కవి జీవితంలోనూ చాలా సహజంగా కనిపిస్తుంది. ఇది కవి నిబద్ధతను అర్థం చేసుకోవడానికి ఉపయోగపడేదే కానీ, బలహీనత కాదు.

వ్యవసాయచట్టాలకు వ్యతిరేకంగా రైతుల నిరసనతో దేశం అట్టుడికిపోయింది. కానీ తెలంగాణ రైతు కదలకపోవడానికి కారణాన్ని 'యుద్ధరైతు' కవితలో కారణాన్ని కళ్ళముందుపెట్టాడు. "రైతుబంధు నోట్లకట్టలు నోరు మూయించే/ సరిహద్దు దేశాన యుద్ధరైతు గెలుపుదారై/ మట్టి విత్తుపాదై మొలక గొడుగెత్తిన ఆకాశం/ ప్రపంచ చిత్రపటంలో వీరులు రైతులైంద్రూ" అంటాడు.

పుస్తకంలోని కవితలన్నీ ఒకచోట తాత్వీకరించటం కవితాసంపుటి శీర్షిక కవిత 'క్రీనీడ'లో కనిపిస్తుంది. "నిజంనీడ... ఛాయా దొరకని వినికిడి/... మూఢవిశ్వాసి శ్వాస దేవగత్తే ఊదుపొగ యంత్రదెయ్యం/ శాస్త్రీయ జ్ఞానదోపిడీ రాజకీయ లూటి పదవిపగ్గం/ బంధువులు బంధుపథకం ఓట్ల ఖరీదు ముద్దెర రొక్కం/ గింత రక్తం ఎరుపు గడ్డగట్టిన నోట్ల ముడుపులు యాగబలి/ మత కౌగిలి రాజ్యాంగ ఎచ్చిడీ/ మణిపూర్ మంటలు.../మనువాది మతశిక్ష/ భూమి తిరిగిన క్రీనీడ బుగులైతుంద్ర". నిజం కనుగొనలేని సంస్కృతినీడలో దళితులు, మతం ముసుగులో మతపెద్దలు, జ్ఞానం పేరుతో, రాజకీయం పేరుతో దోపిడీలు, బలహీనులపై అన్యాయాలు... ఇవన్నీ కవిని గుబులు కలిగించేవే. తాత్వికతతో బాటు కుల, మత, సంస్కృతీ భావనల వలన అట్టడుగుప్రజలు పడే బాధల పట్ల కవికి తార్కికత అవసరమని ఈ కవిత్వం ద్వారా నిరూపించాడు. కిందనీడ దళిత అణిచివేతకు ప్రతీకయితే, దానిపైన నీడ బహుజన జీవితాల అణచివేతకు ప్రతీక కావొచ్చు. దళిత, బహుజన స్పృహను మేల్కొలిపే గొప్ప తాత్విక తార్కిక కవిత్వం 'క్రీనీడ' కవిత్వం.

ఆమెకో జీవితముంది

రొటీన్ నుంచి కొంచెం కొత్తగా కనిపించిన కవిత ఇది. వ్యక్తిగత జీవితంలో, వృత్తి జీవితాల్లో ఆమెల చుట్టూ సమాజం అల్లే అలుసు మాటలు చులకన భావజాలం సుపరిచితం. ఆధునిక జీవితాల్లో అలాంటి భావజాలం గురించి ఈ



కవితలో మాట్లాడారు కవి రాజేశ్వరి రామాయణం. వినోద రంగం లోని స్త్రీ అప్రాధాన్య వ్యాఖ్యలకు లోనవటం ఇతివృత్తంగా తీసుకున్నారు. సినిమాల్లో హీరోకి ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది. కానీ హీరోయిన్ లేకుండా వెండితెరను ఊహించలేరు. ఎన్నో రకాల పాత్రల్లో ఆమె ఒదిగిపోతుంది. కథ చివరిలోనైనా తనను తాను ప్రూవ్ చేసుకునే అవకాశం ఉండకపోదా అని ఎదురుచూస్తుంది. ఏదో అరుదుగా మినహాయింపు ఉంటుందేమో కానీ, అలనాటి నుండి నేటి వరకూ చాలాసార్లు తెరపై ఆమె ఒక ఆటబొమ్మ. నలుగురు తీరిగ్గా కూర్చుని చెప్పుకునే కబుర్లలో ఆమె కాలక్షేపపు బఠాణీ. సినిమా బయట ఎక్కడ ఏ వ్యక్తిగత సందర్భం లోనైనా "ఫలానా వాడి నాయిక"గా వదంతులు సృష్టిస్తుంటారు. వెండితెర మీద కనిపించే ఆమెకు అది వృత్తి అని, వ్యక్తిగతంగా ఆమెకూ ఒక జీవితం ఉంటుంది అని ప్రపంచం గుర్తించదు. పుట్ట గొడుగుల్లా పుట్టుకొస్తున్న యూట్యూబ్ ఛానెల్స్ ఒక డుగు ముందుకేసి సంబంధం లేని థంబ్ నెయిల్స్‌తో కృత్రిమ ఆసక్తిని కలిగిస్తుంటాయి. వేలి గోటి వెర్రి రాతల్లారా అని రాజేశ్వరి ఈ థంబ్ నెయిల్స్‌ను ఉద్దేశించి మాట్లాడింది. వృత్తి ఉద్యోగ విధులు నిర్వర్తించే వారంతా దాని తాలుకా వాసనల్ని తమ ఇంట్లోకో బెడ్రూమ్ లోకో ఎలా తీసుకురారో అలాగే ఆమె పాత్ర కూడా ఆమె పనిలో భాగంగా మాత్రమే చూడాలని చెప్తోంది. పని చోట సంబంధాలను వ్యక్తిగతంతో ముడిపెట్టటాన్ని ప్రతిఘటిస్తోంది. కవిత టైటిల్‌లో 'ఫలానా' ముందు ఎట్ ది రేట్ ఆఫ్ సింబల్ (@) పెట్టటం ద్వారా ఆమె ఒకరి కేరాఫ్ కాదు అని చెప్పేసింది కవి. ఎవరెవరి పేర్లతోనో జత చేసి ఆమెకో పేరుపెట్టటాన్ని నిరసిస్తోంది. ఆమె అపరిచిత కాదు. అనామకురాలు అంతకన్నా కాదు. వెండితెర కోసం పెట్టుకున్నదో తల్లితండ్రులు పెట్టినదో ఆమెకో సొంత పేరుంది. ఆమెదైన సొంత బతుకుంది అని చెప్పటం రాజేశ్వరి ఉద్దేశం.

■ ఫణి మాధవి కన్నోజు



ప్రియ పద్యం

@ ఫలానా... కాదు

నాలుగైదు తీరిక దేహాల
పోసుకోలు కబుర్లలో
పచ్చని పైరు పొలంలో
మెరిసే పరికిణీ సయ్యాటలో
పొద్దెక్కినా లేవని మొద్దు నిద్రలో
మెరుపు రేఖంటి నృత్యంలో
మెలిక ముగ్గులో
మోగే కుక్కర్ విజిల్‌లో
మురిపెంపు ప్రేమలో
మూర్తీభవించిన విజయరేఖలో
కథ చివర్లోనైనా తానుగా నిలిచే నమ్మకంలో
నిన్న నేడు రేపులలో అరుదుగా తప్ప
బోలెడన్ని సార్లు ఆటబొమ్మ ఐనా
కంటికింపుగానో
కంటగింపుగానో
తనది కాని తాత్కాలిక ఔట్‌ఫిట్‌లో
ఒదిగిపోయే ఆమె లేనిదే అతనుండడాన్ని
ఊహించలేని వెండితెర మాయాలోకం

అదేం చిత్రమో కానీ
వృత్తి జీవితానికావల
ప్రతి వ్యక్తిగత సందర్భంలో
లోకానికి ఆమె
ఫలానా వాడి నాయికనే

అరె
వేలి గోటి వెర్రి రాతల్లారా
ఇంట్లోకి బెడ్రూంలోకి
నువ్వు తీసుకురానివ్వని
నీ ఆఫీస్ ఔట్‌ఫిట్ లాంటిదే
ఆమె రోల్ అండ్ వర్క్ రిలేషన్

వీటన్నిటికావల
ఇల్లలుకుతూ పేరు మరచిపోయిన
ఈగ కాదు
ఆమె గుమ్నామీ కాదు
అంజానీ కూడా కాదు
పేరు లేని పిల్ల అంతకన్నా కాదు
తనదైనదో తెర కోసం పెట్టుకున్నదో
ఆమె కూడా నామవాచకమే!

■ రాజేశ్వరి రామాయణం

"బంతి బంతికీ ఉత్కంఠ..! మ్యాచ్ మ్యాచ్‌కీ టెన్షన్.. ఈ బాల్ ఫోర్ పోతుందా..? సిక్స్ పోతుందా..? బ్యాట్స్‌మెన్ ఔట్ అవుతాడా..?.. అలాగే ఫలానా బ్యాట్స్‌మెన్ సెంచరీ కొడతాడా..? లేక ఇన్ని పరుగులకే ఔట్ అవుతాడా?. ఈ మ్యాచ్‌లో ఏ జట్టు ఎన్ని పరుగులు చేస్తుంది..? ఏ జట్టు గెలుస్తుంది..?" లాంటి బెట్టింగ్‌లు ఉమ్మడి జిల్లాలో జోరుగా సాగనున్నాయి.

ఐపీఎల్ క్రికెట్ 18వ సీజన్ ప్రారంభం కావడంతో బెట్టింగ్ భూతం జడలు విప్పుతోంది. బుకీలు ఒళ్లు విదుల్చుతున్నారు. క్రికెట్ అభిమానులు, అమాయకులే లక్ష్యంగా వేలు, లక్షల్లో పందాలు కాస్తున్నారు. ఇందుకు ఇళ్లు, హోటళ్లనే కేంద్రాలుగా మార్చుకుంటున్నారు. ఆన్‌లైన్‌ద్వారా, ఫోన్‌లలో బెట్టింగ్‌లకు తెరలేపుతున్నారు. కొన్నేళ్లుగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఈ దందా జోరుగా సాగుతోంది. సులభంగా డబ్బులు సంపాదించుకోవచ్చనే భ్రమలో కొందరు అమాయకులు ఈ రొంపిలోకి దిగుతున్నారు. అప్పులు చేసి, నగలు, వస్తువులు తాకట్టు పెట్టి పందాలు కాస్తున్నారు. చివరికి డబ్బులు పోగొట్టుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఆవేదనతో, అవమానంతో బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఇలా.. బెట్టింగ్ భూతానికి ఉమ్మడి జిల్లాలో ఎందరో బలవుతున్నారు. అరికట్టాల్సిన పోలీసులు దృష్టి సారించకపోవడంతో బెట్టింగ్ రాయుళ్ల దందా విచ్చలవిడిగా సాగుతోంది.

- హనుమకొండ (ఆంధ్రజ్యోతి)



క్యాచ్ రాజా క్యాచ్!

ఐపీఎల్ క్రికెట్ సీజన్ వేళ జోరుగా బెట్టింగ్స్

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో మళ్లీ మొదలైన దందా
- అద్దె ఇళ్లు, హోటళ్లే కేంద్రాలుగా రూ.లక్షల్లో బెట్టింగ్‌లు
- ఇతర రాష్ట్రాల నుంచి బుకింగ్‌లు
- ఏజెంట్ల ద్వారా సాగుతున్న వైనం
- పల్లెలకు సైతం పాకిన బెట్టింగ్ జాడ్యం
- అరెస్టైనా మళ్లీ దందాలకు పాల్పడుతున్న బుకీలు
- పోలీసుల నామమాత్రపు చర్యలతో సాగుతున్న బాగోతం

7



ప్రమాదంలో మృతి చెందిన ఒకే కుటుంబానికి చెందిన గడ్డం రవీందర్, రితిక, రేణుక (ఫైల్), విషమంగా రిషి ఆరోగ్యం

పండుగకు వచ్చి పరలోకానికి..

- ఎదురెదురుగా ఢీకొన్న ఆర్టీసీ బస్సు, కారు
- ముగ్గురు మృతి, మరొకరి పరిస్థితి విషమం
- మరో ఎనిమిది మందికి గాయాలు
- మృతుల్లో భార్యాభర్తలు, కుమార్తె
- సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలో ఘటన
- స్వగ్రామం కంతాయపాలెంలో విషాదం

6



దేవన్నపేట పంప్‌హౌస్‌లో మోటార్లను పరిశీలిస్తూ అధికారులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి, తాటికొండ రాజయ్య, రాకేష్‌రెడ్డి

దేవాదుల ప్రాజెక్టు పనులపై కాంగ్రెస్ నిర్లక్ష్యం

- వందల ఎకరాల్లో ఎండిపోయిన పంటలు
- ఎకరానికి రూ.25వేల పరిహారం ఇవ్వాలి
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- బీఆర్ఎస్ నాయకులతో కలిసి దేవాదుల పంప్‌హౌస్ సందర్శన

6





ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థి సమ్మేళనంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ నాగేశ్వర్

మతం పేరిట జరుగుతున్న దౌర్జన్యాలను అడ్డుకోవాలి..

- సమాఖ్య స్ఫూర్తిపై డీలిమిటేషన్ దాడి
- ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, మాజీ ఎమ్మెల్సీ కె.నాగేశ్వర్
- ఘనంగా ఉమ్మడి జిల్లా ఎస్ఎఫ్ఐ సమ్మేళనం
- పాల్గొన్న పూర్వ నాయకులు, ప్రముఖులు

6

రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేస్తున్న బీజేపీ

- ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి
- డీసీసీ భవన్‌లో 'జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్' సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తదితరులు

హనుమకొండ సిటీ, మార్చి 23(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేసే కుట్రలకు బీజేపీ పాల్పడుతోందని వరంగల్ ప శ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏఐసీసీ పిలుపు మేరకు తలపెట్టిన 'జై బాపు - జై భీమ్ - జై సంవిధాన్' సన్నాహక సమావేశం జరిగింది. హనుమకొండ, వరంగల్ జిల్లాల కాంగ్రెస్ అధ్యక్షులు నాయిని రాజేందర్‌రెడ్డి, ఎర్రబెల్లి స్వర్ణ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డితో పాటు పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ పాలనలో దేశ ఐకమత్యానికి ఆందోళన కలిగిస్తూ మతం పేరిట మంటలు రేపుతోందన్నారు. ప్రజ లను భయందోళనలకు గురిచేస్తూ హింసను సృష్టిస్తోందని ఆరోపిం చారు. కేంద్ర మంత్రి అమిత్ షా బాధ్యతారహితంగా వ్యవహరిసున్నారని విమర్శించారు. పార్లమెంట్ వేదికగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానిస్తూ వ్యాఖ్యలు చేశారన్నారు. బీజేపీ కుట్రలను దేశ ప్రజలంతా సంఘటితంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. బీజేపీ కుట్రలను కాంగ్రెస్ శ్రేణులు ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ మేరకు గ్రామ, మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో పాదయాత్రలు, తదితర కార్యక్రమాల నిర్వహణ ఉంటుందన్నారు. బీజేపీ తీరు మారకుంటే ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. దేశ పరిరక్షణ కోసం ఏ త్యాగానికైనా కాంగ్రెస్ నాయకులు వెనుకాడరని రాజేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. బీజేపీ దేశాన్ని విచ్ఛిన్నం చేసే చర్యలకు పాల్పడుతుంటే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రతో ప్రజలను చైతన్యవంతులను చేశారన్నారు.

భిన్నత్వంలో ఏకత్వం కాంగ్రెస్‌తోనే సాధ్యం

భిన్నత్వంలో ఏకత్వం కాంగ్రెస్‌తోనే సాధ్యమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పేర్కొన్నారు. బీజేపీ పాలన రోజు రోజుకూ ఆందోళన కలిగిస్తోందన్నారు. ప్రజాభిప్రాయానికి విరుద్ధంగా పాలన సాగిస్తోందన్నారు. ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాలు ప్రజలు సుఖ, సంతోషాలతో జీవించేలా ఉండాలన్నారు. కానీ బీజేపీ హయాంలోని కేంద్ర ప్రభుత్వ తీరు దేశ ప్రజలను భయకంపితులను చేస్తోందన్నారు. వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ.. హింస లేని దేశంగా భారత్‌ను నిర్మించడమే కాంగ్రెస్ లక్ష్యమని అన్నారు. రాజ్యాంగాన్ని, డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానించేలా బీజేపీ వ్యవహరించడం శోచనీయమన్నారు.

ఇంకా సమావేశంలో బీజేపీ పాలనా వైఫల్యాల ఘట్టాలను డిజిటల్ స్క్రీన్‌పై ప్రదర్శించారు. అనంతరం కాంగ్రెస్ శ్రేణులంతా 'జై బాపు - జైభీమ్ - జై సంవిధాన్' పేరిట రూపొందించిన ప్రతిజ్ఞ చేశారు. సమావేశంలో మేయర్ గుండు సుధారాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళాదేవి, ఎస్సీ, బీసీ సెల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ పెరుమాండ్ల రామక్రిష్ణ, బొమ్మతి విక్రమ్, జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న, కార్పొరేటర్లు శ్రీమాన్, జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీతో పాటు బ్లాక్ కాంగ్రెస్, మండల, డివిజన్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

కొండా హయాంలోనే అజంజాహి భూముల్లో అక్రమాలు

- కార్మికులకు ఇచ్చిన హామీని రేవంత్‌రెడ్డి నిలబెట్టుకోవాలి
- మేడే రోజున కార్మికులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి
- మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

హనుమకొండ టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కొండా సురేఖ హయాంలోనే ఆజంజాహిమిల్లులో అక్రమాలు జరిగాయని, రూ.కోట్ల విలువ చేసే భూములను అమ్ముకున్నారని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నేత నన్నపునేని నరేందర్ ఆరోపించారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆజంజాహిమిల్లు కార్మికులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులకు ఇళ్ల పట్టాలు ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక మాట నిలబెట్టుకోలేదన్నారు. 2014లో కొండా సురేఖ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే కార్మిక భవన్ భూమి మ్యుటేషన్ జరిగిందని, ఆ సమయంలోనే అక్రమాలు చోటు చేసుకున్నాయన్నారు. కొంతమంది అధికారులు తప్పుడు సర్వే నెంబర్లతో భూములను ఇతర వ్యక్తులకు కట్టబెట్టారని విమర్శించారు. ఆ జంజాహిమిల్లు కార్మికులకు ఇచ్చిన మాటను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని ధ్వజమెత్తారు. కార్మిక భవన్‌ను అర్ధరాత్రి కూల్చివేసి మరుసటి రోజు కొండా మురళి కొబ్బరి కాయ కొట్టింది నిజంకాదా? అని ప్రశ్నించారు. 451 మంది కార్మికులుంటే 318 మంది కార్మికులకు అన్యాయం చేసి 131 మంది కార్మికులకు స్థలాలు ఇచ్చారని అన్నారు. మిగతా 318 మంది కార్మికులకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు వచ్చినప్పటికీ మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య కార్మికులకు న్యాయం చేయడం లేదని మండిపడ్డారు. 23 ఏళ్లుగా కా ర్మికులు ఇళ్ల స్థలాల కోసం పోరాటం చేస్తుంటే.. కొండా సురేఖ మా త్రం కార్మికులకు ఇచ్చిన భూములను అమ్ముకున్నారని ఆరోపించారు. 318 మంది కార్మికులలో 100 మంది కార్మికులు మృతిచెందారని, వారి కుటుంబసభ్యులకు ఒక్కొక్కరికి 200 గజాల చొప్పున మే 1న కార్మికుల దినోత్సవం రోజున ఇళ్లస్థలాలు అందజేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే కార్మికుల పక్షాన ఉద్యమాలను ఉధృతం చేస్తామని మాజీ ఎమ్మెల్యే నరేందర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు, కార్మికుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



7

పులకింపజేసిన 'పెద్ద పట్నం'

ఐనవోలులో ఘనంగా స్వామివారి కల్యాణం

పెద్ద పట్నం వద్ద భక్తులు పులకించిపోయారు. వారాంతపు జాతరల్లో చివరి వారమైన ఆదివారం ఐనవోలు మల్లన్న కల్యాణం, పెద్ద పట్నం కన్నుల పండుగగా జరిగింది. శ్రీ బలిజే మేడమ్మ, గొల్లకేతమ్మ అమ్మవార్ల సమేత మల్లికార్జునస్వామి కల్యాణాన్ని వేద మంత్రోచ్ఛరణల నడుమ అంగరంగ వైభవంగా అర్చకులు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని కాకతీయుల నృత్యమండపం వద్ద 50 అడుగుల వెడల్పు, పొడవుతో పెద్దపట్నాన్ని ఒగ్గు పూజారులు అందంగా తీర్చిదిద్దారు. వేలాదిగా భక్తులు దర్శించుకుని తాండవం చేశారు. - ఐనవోలు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

మత సామరస్యానికి ప్రతీక రంజాన్

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ చౌరస్తా, మార్చి23(ఆంధ్రజ్యోతి): మత సామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగ అని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం హనుమకొండ 10వ డివిజన్ అలంకార్ జంక్షన్ సమీపంలోని జక్రియా ఫంక్షన్‌హాల్లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే నాయిని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం మతపెద్దలతో కలిసి ముందుగా ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య, రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ మహ్మద్ రియాజ్, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రుపాషా, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ అజీజ్‌ఖాన్, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, పీసీసీ మెంబర్లు బి.శ్రీనివాస్, ఈవీ శ్రీనివాస్, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు అజీజ్, కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

మృత్యువులోనూ వీడని స్నేహం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మిత్రుల మృతి

- హసన్‌పర్తిలో ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న టిప్పర్
- స్వగ్రామం సీతంపేటలో మిన్నంటిన విషాదం

6



పవన్‌కళ్యాణ్, మహేష్ (ఫైల్)



దేవన్నపేట పంప్‌హౌస్‌లో అధికారులతో మాట్లాడుతున్న దయాకర్‌రావు, రాజేశ్వర్‌రెడ్డి, టి.రాజయ్య, దాస్యం వినయ్‌భాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి

దేవాదుల ప్రాజెక్టు పనులపై కాంగ్రెస్ నిర్లక్ష్యం

- ఎండిపోయిన పంటలు
- రూ.25 వేల పరిహారం ఇవ్వాలి
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- దేవాదుల పంప్‌హౌస్‌ను సందర్శించిన బీఆర్ఎస్ నాయకులు

హనుమకొండ టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లా రైతులకు సాగు నీరందించేందుకు బీఆర్ఎస్ హయాంలో పూర్తయిన దేవాదుల ప్రాజెక్టు పనులను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ధ్వజమెత్తారు. ఆదివారం హనుమకొండ జిల్లా దేవన్నపేటలోని దేవాదుల పంప్‌హౌస్ ఫేస్-3 మోటార్లను బీఆర్ఎస్ నేతలతో కలిసి ఆయన సందర్శించారు. అనంతరం పంప్‌హౌస్ పనులను పరిశీలించి అక్కడి అధికారులతో మాట్లాడారు.

ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్‌రావు విలేకరులతో మాట్లాడుతూ.. ప్రాజెక్టుపై నిర్లక్ష్యంతో రైతుల పంటలు ఎండిపోయాయని అన్నారు. పంట ఎండిపోయిన రైతులకు ఎకరానికి రూ.25వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని కోరారు. దేవాదుల మూడో దశ కింద వరంగల్, హనుమకొండ, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, జనగామ, సిద్ధిపేట, సూర్యాపేట, యాదాద్రి, భువనగిరి జిల్లాల్లో సుమారు 5 లక్షల 57 వేల ఎకరాలకు రెండు పంటలకు సాగునీరు ఇచ్చేలా బీఆర్ఎస్ ప్రభుత్వంలో రూపకల్పన చేశామన్నారు. దేవాదుల మూడో దశ కింద రూ.1,494కోట్లతో రామప్ప చెరువు నుంచి ఉనికిచర్లకు టన్నెల్, దేవన్నపేట వద్ద పంప్‌హౌస్ పనులను అప్పటి సీఎం కేసీఆర్ పూర్తి చేశారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 15 నెలలుగా పెండింగ్ పనులు ముందుకు సాగక మోటార్ల బిల్లులు పెండింగ్ పెట్టి నిర్లక్ష్యం చేశారని ఎర్రబెల్లి విమర్శించారు. పంటలు వేల ఎకరాల్లో ఎండిపోవడంతో రైతుల ఒత్తిడితో వారం నుంచి మోటార్ల పనులు చేపడుతున్నట్లు తెలిపారు. వెంటనే అధికారులతో మాట్లాడి రైతులకు తక్షణమే మోటార్లను ఆన్‌చేసి సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. అయితే సోమవారం నుంచి సాగునీరు అందుతుందని అధికారులు చెప్పారని దయాకర్‌రావు వెల్లడించారు. కార్యక్రమంలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్‌రెడ్డి, రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగూర్ల వెంకటేశ్వర్లు, నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, చింతల యాదగిరి, రాజు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ఇఫ్తార్ ప్రతీక

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి

జనగామ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసంలో ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందులు ఆత్మీయతకు, మతసామరస్యానికి ప్రతీక అని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొని మాట్లాడారు. మనుషులంతా సోదరభావంతో ఉండాలని, అన్ని మతాల సారం మనుషులంతా ఒక్కటేనని చెప్పారు. పవిత్రతకు, త్యాగానికి రంజాన్ పండగ చిహ్నమని, ముస్లింలంతా పండగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు. ముస్లింలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని పథకాలను కొట్లాడి తీసుకువస్తానని అన్నారు. తన వద్దకు వచ్చే ప్రతి పేదవాడికి కచ్చితంగా సాయం చేస్తానని స్పష్టం చేశారు. జనగామ పట్టణంలో ఇళ్లు లేని పేదలకు ఇళ్లను ఇప్పించే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఇఫ్తార్ విందులో బీఆర్ఎస్ నాయకులు, ముస్లింలు పాల్గొన్నారు.

మతం పేరిట జరుగుతున్న దౌర్జన్యాలను అడ్డుకోవాలి

- ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, మాజీ ఎమ్మెల్సీ నాగేశ్వర్
- ఘనంగా ఉమ్మడి జిల్లా ఎస్ఎఫ్ఐ సమ్మేళనం



మాట్లాడుతున్న సుద్దాల అశోక్‌తేజ



సమ్మేళనానికి హాజరైన ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థి నాయకులు

హనుమకొండ చౌరస్తా, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మతం పేరుతో జరుగుతున్న దౌర్జన్యాలను అడ్డుకోవాలని, ప్రపంచంలో ఏ మతంలో, మనుషుల మధ్య అసమానతలు లేవని, కేవలం మనువాదంలోనే అసమానతలున్నాయని వాగ్గేయకారుడు, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న అన్నారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో ఎస్ఎఫ్ఐ ఉమ్మడి వరంగల్ జిల్లా పూర్వ విద్యార్థి నాయకులు సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సమ్మేళనానికి ఎస్ఎఫ్ఐ నాయకులు డాక్టర్ రంగారావు, సారంపెల్లి వాసుదేవరెడ్డి, ఈసంపెల్లి బాబు, అరుణశ్రీలు అధ్యక్ష వర్గంగా వ్యవహరించగా, గోరేటి వెంకన్న ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మనువాదాన్ని ఓడించడానికి ఎస్సీలు, బీసీలు మాత్రమే కాకుండా అగ్రవర్ణాల్లోని ప్రగతిశీల భావాలున్న వారందరినీ కలుపుకుపోవాలని పిలుపునిచ్చారు. సాధారణంగా బతకడం కూడా విలువైనదని, అది ఎస్ఎఫ్ఐ నేర్పించిందన్నారు. ప్రస్తుతం కుల పిచ్చి పెరిగిందని, కుల రహిత సమాజాన్ని కోరుకోవాలన్నారు. త్యాగ ధనులను ప్రపంచం మరిచిపోదని, దుర్మార్గం అనేది తాత్కాలికంగానే భయపెడుతోందన్నారు. శ్రామిక ప్రజలతో నడవడమే చైతన్యమన్నారు. వారంలో ఒక్క రోజైనా మీ బిడ్డల్ని పని చేయమని చెప్పాలని ఆయన కోరారు. మనిషి సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించాలని వెంకన్న సూచించారు.

మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ నాగేశ్వర్ మాట్లాడుతూ.. కేంద్రం చేయాలనుకుంటున్న డీలిమిటేషన్ భారత సమాఖ్య స్ఫూర్తిపై దాడే అని ఆవేదన వ్యక్తం చేశారు. భిన్నత్వంలో ఏకత్వం అనేది భారతదేశ ఔన్నత్యాన్ని చాటిందని, అలాంటి దేశంలో నేడు ఒకే జాతి, ఒకే మతం, ఒకే ఎన్నికలు అంటూ కొత్త విధానాలను ప్రవేశపెడుతున్నారని మండిపడ్డారు. మతాన్ని వ్యతిరేకించడం కాదని, మత ఉన్మాదాన్ని వ్యతిరేకించాలని, దేశంలో లౌకికవాదం, స్వేచ్ఛపై దాడి జరుగుతోందని వాపోయారు. దేశంలో 22కోట్ల మంది ప్రజలు రూ.375 దినసరి వేతనం తీసుకోగా, గౌతం ఆదానీ మాత్రం రూ. 1,600 కోట్ల వేతనం తీసుకుంటున్నాడని, ఈ అసమానతలకు కారణం ఎవరని ఆయన విమర్శించారు. సమాజంలో అసమానతలను ప్రశ్నించడాన్ని ఎస్ఎఫ్ఐ నేర్పిందని, ఆలోచనల సంగ్రామంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆధిపత్యాన్ని ప్రశ్నించడం విద్యార్థి ఉద్యమం నేర్పిందన్నారు. ఎస్ఎఫ్ఐలో ఉన్నప్పుడు మనం ఎలా ఉన్నామో బయటకు వచ్చాక ఎలా ఉన్నామనేది ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమ్మేళనంలో ఒక కార్యాచరణ నిర్దేశించుకొని ముందుకు కదలాలన్నారు.

సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ మాట్లాడుతూ.. పాట, పల్లవి.. గెరిల్లాలాగా ఉండాలని తన తండ్రి చిన్నతనంలో తనకు చెప్పారని, ఆనాడు అందుకున్న మాటా-పాటా ఈ రోజు వరకు కొనసాగుతోందన్నారు. సొంతంగా కవులు, కళాకారులుగా ఎదిగిన వాళ్లు తనకంటే గొప్పవాళ్లన్నారు. తనకు పాటలు రాయడానికి విద్యార్థి ఉద్యమం, కమ్యూనిస్టుపార్టీలు, ఎర్రజెండాలే ప్రేరణ అని అన్నారు. గుండెలను రగిలించే మాట నుంచే మంచి పాట పుడుతుందన్నారు. ఎస్ఎఫ్ఐ ఉమ్మడి వరంగల్ జిల్లా పూర్వపు అధ్యక్షుడు జి.రాములు మాట్లాడుతూ.. 1960-70 మధ్య కాలంలో విద్యార్థి ఉద్యమాలు అంతర్జాతీయ స్థాయిలో జరిగాయని, ఫ్రాన్స్, వియత్నాం, కంపూచియాలో ఉద్యమాలు పతాకస్థాయిలో జరిగాయని గుర్తు చేశారు. విద్యార్థి ఉద్యమాలే వ్యక్తిత్వ వికాసాన్ని కలిగిస్తాయన్నారు. నాడు హనుమకొండలోని కుమార్‌పల్లి వామపక్ష కేంద్రంగా ఉండేదని, అక్కడే ఎస్ఎఫ్ఐలో చేరి హాస్టళ్లు, ఆర్ట్స్ కళాశాల, కేయూసీలోని విద్యార్థి ఉద్యమాన్ని పటిష్టం చేశామన్నారు. ఇలాంటి సమ్మేళనాలు మరిన్ని కొనసాగాలని సూచించారు.

ఈ సమ్మేళనం ప్రారంభానికి ముందు ఎస్ఎఫ్ఐ పతాకాన్ని రాములు ఆవిష్కరించారు. సమ్మేళనంలో తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ రియాజ్, ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వీరయ్య, కేయూ మాజీ వీసీ డాక్టర్ రమేష్, సభ్యులు ఎ.నర్సింహారెడ్డి, డాక్టర్ పసునూరి రవీందర్, తాళ్ల నాగరాజు, కె.సారయ్య, జి.ప్రభాకర్‌రెడ్డి, సీహెచ్. రంగయ్య, టి.ఉప్పలయ్య, కె.వెంకటేశ్వర్లు, శేషగిరిరావు, రాగుల రమేష్, బండి పర్వతాలు, మేరుగు అశోక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ సీతారాంనాయక్

పోస్టల్ ఎంప్లాయీస్ సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్తా..

మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్

హనుమకొండ టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): భారతీయ తపాలా ఉద్యోగుల సంఘం పోస్టల్ ఎంప్లాయీస్ సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్ అన్నారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని హెడ్ పోస్టాఫీస్ ఆవరణలో బీఎంఎస్ అనుబంధ సంఘం భారతీయ తపాలా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో హెచ్‌వో పవన్‌కుమార్ సమక్షంలో పోస్టల్ డిపార్ట్‌మెంట్ ఎంప్లాయీస్ బీజీడీకేఎస్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా వి.అశోక్‌గౌడ్, సెక్రటరిగా కె.మనోజ్, ట్రెజరర్ ఎం.డి. షారూఫ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు హెచ్‌వో పవన్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎంపీ సీతారాంనాయక్ హాజరై నూతన కమిటీ సభ్యులను అభినందించారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని, ఉద్యోగులకు అండగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీ- 3 డివిజన్ అధ్యక్షుడు ఎం.శంకర్, సెక్రటరీ ఎ.సత్యనారాయణ, ట్రెజరర్ కె.నరేష్, పీ-4 అండ్ ఎంపీఎస్ డివిజన్ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, సెక్రటరి బత్తుల శ్రీనివాస్, ట్రెజరర్ ఎం. చంద్రశేఖర్‌లకు నూతన కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ముగ్గురికి డాక్టరేట్



సాయిచరణ్

కేయూ క్యాంపస్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ హిస్టరీ విభాగం పరిశోధకుడు వడ్డెపల్లి సాయిచరణ్ డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు శనివారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ డాక్టరేట్ ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సాయిచరణ్ 'మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ ఇన్ హైదరాబాద్ స్టేట్ (1853-1948)' అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించినందుకు డాక్టరేట్ ప్రకటించారు. కేయూ హిస్టరీ అండ్ టూరిజం విభాగం ప్రొఫెసర్, డీన్, ప్రిన్సిపాల్ తాళ్ళపల్లి మనోహర్ పర్యవేక్షణలో పరిశోధన పూర్తిచేశారు. హుజూరాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రభుత్వ లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. ఖమ్మం జిల్లా బల్లేపల్లికి చెందిన సాయిచరణ్ ఖమ్మం, కోదాడలో ప్రాథమిక విద్యతోపాటు ఇంటర్, డిగ్రీ పూర్తి చేశారు. కేయూలో హిస్టరీలో ఎంఏ పూర్తి చేసి డాక్టరేట్ పొందారు.

జియాలజీలో సందీప్‌కుమార్‌కు..



సందీప్‌కుమార్

కాకతీయ యూనివర్సిటీ జియాలజీ విభాగం పరిశోధకుడు కందకట్ల సందీప్‌కుమార్ డాక్టరేట్ సాధించారు. సందీప్‌కుమార్ 'పెట్రోలాజికల్ అండ్ జియోకెమికల్ స్టడీ ఆఫ్ కింబర్లైట్ మాగ్మాటిసమ్ ఇన్ ద ఈస్టర్న్ ధార్వార్ క్రేటాన్ ఆఫ్ పెనిన్సులార్ ఇండియా విత్ స్పెషల్ రెఫరెన్స్ టూ రాయచూర్ కింబర్లైట్ ఫీల్డ్ స్ప్రెడ్ ఎక్రాస్ కర్ణాటక అండ్ తెలంగాణ స్టేట్స్' అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించినందుకు డాక్టరేట్ ప్రకటించారు. కేయూ జియాలజీ విభాగం ప్రొఫెసర్ రాగి మల్లికార్జున్‌రెడ్డి పర్యవేక్షణలో పరిశోధన పూర్తిచేశారు. నల్లబెల్లి మండలం నందిగామకు చెందిన సందీప్ కుమార్ పలు సదస్సుల్లో విలువైన పరిశోధన పత్రాలను ప్రచురించారు.

కెమిస్ట్రీలో మొహమ్మద్ ముఖీద్‌కు..



మొహమ్మద్ ముఖీద్

చైతన్య డీమ్డ్ టూ బీ యూనివర్సిటీ కెమిస్ట్రీ విభాగం పరిశోధకుడు మొహమ్మద్ ముఖీద్ డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు ఆదివారం చైతన్య డీమ్డ్ టై బీ వర్సిటీ 13వ స్నాతకోత్సవంలో అస్సాం ఎన్ఐఈ ఈ ఆర్ (నైపర్) డైరెక్టర్ డాక్టర్ యూఎస్ఎన్ మూర్తి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి చేతుల మీదుగా మొహమ్మద్ ముఖీద్ పట్టాను అందచేశారు. మొహమ్మద్ ముఖీద్ 'న్యూ కాటలిటిక్ సిస్టమ్ ఫర్ సీ-సీ అండ్ సీ హెటిరో ఆటమ్ బాండ్ ఫార్మేషన్' అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించినందుకు డాక్టరే ట్ ప్రకటించారు. హనుమకొండ వడ్డేపల్లి ప్రాంతానికి చెందిన మొహ మ్మద్ ముఖీద్ హైదరాబాద్ దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. మొహమ్మద్ ముఖీద్ పలు సదస్సుల్లో విలువైన 6 పరిశోధన పత్రాలు, పెటేంట్‌ను కల్గి ఉన్నారు. సౌత్ అరేబియాలోని కింగ్ సౌద్ వర్సిటీ, అమెరికాలోని టెక్సాస్ డల్లాస్ వర్సిటీ సహకరంతో పరిశోధన పూర్తి చేశారు. డాక్టరేట్ సాధించిన మొహమ్మద్ ముఖీద్ తల్లి దండ్రులు మొహమ్మద్ సాధిక్, గౌసియా బేగంతో పాటు వీసీ శంకర్‌లింగం, స్వాతిక రెడ్డి, రవీందర్, డీన్లు, ఇతర అధికారులు అభినందించారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య



మహేశ్ (ఫైల్)

లింగాలఘణపురం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాణిక్యాపురం గ్రామానికి చెందిన చిన్నం మహేశ్ (26) అనే యువకుడు ఆదివారం చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సెంట్రింగ్ పనిచేస్తూ ఉపాధి పొందుతున్న యువకుడు మహేశ్ ఉదయం లేవగానే తన మోటార్ సైకిల్‌పై వ్యవసాయబావి వద్దకు వెళ్లాడు. అక్కడ ఎవరు లేని సమయంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే అవివాహితుడైన మహేశ్ ఆత్మహత్యకు గల కారణాలు మాత్రం తెలియరాలేదు. తల్లి సిద్ధమ్మ ఫిర్యాదు మేరకు లింగాలఘణపురం ఎస్సై శ్రవణ్‌కుమార్ కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నారు.

మృత్యువులోనూ వీడని స్నేహం

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మిత్రులు మృతి
- హసన్‌పర్తిలో బైక్‌ను ఢీకొట్టిన టిప్పర్
- సీతంపేటలో విషాదఛాయలు



ప్రమాదంలో ధ్వంసమైన బైక్, ఘటన స్థలంలో పవన్‌కల్యాణ్, మహేష్ మృతదేహాలు

హసన్‌పర్తి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలంలోని హసన్‌పర్తి పెద్ద చెరువు మలుపు వద్ద ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. హసన్‌పర్తి నుంచి సీతంపేటకు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని టిప్పర్ ఢీకొట్టడంతో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. ఇన్‌స్పెక్టర్ వట్టే చేరాలు, స్థానికుల కథనం ప్రకారం..

సీతంపేటకు చెందిన దుర్గం సారయ్య-సారమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. వీరిలో పెద్ద కుమారుడు ప్రశాంత్, రెండో కుమారుడు ప్రవీణ్, చిన్నోడు దుర్గం పవన్‌కల్యాణ్ (22). తండ్రి సారయ్య చిన్నప్పుడే ఆత్మహత్య చేసుకొని మృతి చెందగా తల్లి సారమ్మ తన ముగ్గురు పిల్లలను పోషించుకుంటూ ప్రయోజకులను చేసింది. వీరిలో చిన్న కుమారుడు పవన్ కల్యాణ్ కారు మెకానిక్ పనులు చేస్తూ కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నాడు. అలాగే బొౌతు శ్రీనివాస్-అరుణకు ఇద్దరు సంతానం. పెద్దవాడు బొౌతు రాకేష్, చిన్నోడు బొౌతు మహేష్ (20) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నారు. ఆదివారం బొౌతు మహేష్ తన ద్విచక్రవాహనంపై తన మిత్రుడు దుర్గం పవన్‌కల్యాణ్‌ను తీసుకొని హసన్‌పర్తికి వెళ్లి సీతంపేటకు తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో హసన్‌పర్తి పెద్ద చెరువు కట్ట మలుపు వద్ద నేషనల్ హైవేకు మట్టి తరలిస్తున్న టిప్పర్ అతివేగంగా ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. టిప్పర్ డ్రైవర్ ఘటన స్థలం నుంచి పారిపోయినట్లు స్థానికులు చెప్పారు.

కాగా, చేతికి అందివచ్చిన తమ పిల్లలు తమ కళ్ల ముందే విగత జీవులు కావడంతో ఘటనాస్థలంలో మృతుల కుటుంబ సభ్యుల రోదనలు విన్నంటాయి. విషయం తెలిసిన ఇన్‌స్పెక్టర్ వట్టె చేరాలు, ఎస్సైలు దేవేందర్, శీలం రవిలతో పాటు పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకొని మృతదేహాలను ఎంజీఎం మార్చురీకి తరలించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వట్టె చేరాలు తెలిపారు.

నీటి తొట్టిలో పడి చిన్నారి మృతి



మృతి చెందిన చిన్నారి

సంగెం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): నీటి తొట్టిలో పడి చిన్నారి మృతి చెందిన సంఘటన మండలంలోని ఆశాలపల్లిలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన రాజు మహకూర్ తన కుటుంబంతో కలిసి మూడు నెలలుగా ఆశాలపల్లి శివారులోని ఇటుక బట్టీల్లో పని చేస్తున్నాడు. ఈ నెల 22న తన కుటుంబం ఇటుకల తయారీలో నిమగ్నమై ఉండగా, కుమార్తె బబితా మహకూర్ (2) ఆడుకుంటూ వెళ్లి అక్కడే ఉన్న నీటితో పడిపోయింది. కాసేపటికి అక్కడే ఉన్న యువతి చూసి వెంటనే కుటుంబ సభ్యులకు చెప్పడంతో హుటాహుటిన వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పాప మృతి చెందింది. ఆదివారం బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మూల్యాంకన కేంద్రం పరిశీలన

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లోని లాల్ బహదూర్ జూనియర్ కళాశాలలో ప్రారంభమైన మూల్యాంకన కేంద్రాన్ని ఇంటర్ బోర్డు అధికారి వెంకటేశ్వర్‌రావు ఆదివారం సందర్శించారు. ఈ నెల 10వ తేదీ నుంచి సంస్కృతం సబ్జెక్టుతో మూల్యాంకనం ప్రారంభమైందన్నారు. ఈ నెల 24వ తేదీ నుంచి రెండో స్పెల్‌లో ఫిజిక్స్, ఎకనామిక్స్, 26 నుంచి మూడో స్పెల్‌లో కెమిస్ట్రీ, కామర్స్, 28 నుంచి నాలుగో స్పెల్‌లో హిస్టరీ, బాటనీ, జువాలజీ సబ్జెక్టులు ప్రారంభించనున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి డాక్టర్ శ్రీధర్ సుమన్ తెలిపారు.

పండుగకు వచ్చి పరలోకానికి..

- ఎదురెదురుగా ఢీకొన్న ఆర్టీసీ బస్సు, కారు
- ముగ్గురు మృతి, ఒకరి పరిస్థితి విషమం
- మరో ఎనిమిది మందికి గాయాలు
- సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలో ఘటన
- స్వగ్రామం కంతాయపాలెంలో విషాదం



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న సూర్యాపేట జిల్లా ఎస్పీ నర్సింహ

సూర్యాపేట క్రైం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): బంధువుల ఇంట్లో జరిగిన పండుగకు వచ్చి బంధుమిత్రులతో సరదాగా గడిపి తిరిగి ఇంటికి వెళ్తున్న సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉండగా, మరో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా చివ్వెంల మండల పరిధిలోని బీబీగూడెం సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగింది. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం కంతాయపాలెం గ్రామానికి చెందిన గడ్డం రవీందర్(34) హైదరాబాద్‌లో కుటుంబంతో నివసిస్తూ తన కారును సాఫ్ట్‌వేర్ కంపెనీకి అద్దెకు నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. కాగా, ఆదివారం సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలం కోటపహాడ్ గ్రామంలో రవీందర్ భార్య రేణుక(29) తరపు బంధువులైన కోతి జనార్దన్ నివాసంలో నిర్వహించిన ఉప్పలమ్మ పండుగకు హైదరాబాద్ నుంచి కుటుంబంతో కలిసి వారి కారులో వచ్చారు. పండుగ సందర్భంగా బంధువులతో సరదాగా గడిపి భోజనం చేసిన అనంతరం తిరిగి హైదరాబాద్‌కు బయలుదేరారు.

రవీందర్‌తో పాటు భార్య రేణుక, కుమార్తె రితిక(7), కుమారుడు రిషి కృష్ణతోపాటు వారి బంధువులైన కడారి కరుణాకర్, ఆయన భార్య పుష్ప, గంధం మధు, గంధం సాత్విక, గంధం గగన్‌చందర్, గంధం మల్లికార్జున్, కడారి జస్విన్‌తో కలిపి మొత్తం 11మంది కలిసి కారులో బయలుదేరారు. కారు చివ్వెంల మండలం బీబీగూడెం సమీపంలోకి రాగానే సూర్యాపేట నుంచి ఖమ్మం వెళ్తున్న సూర్యాపేట డిపోకు చెందిన పల్లెవెలుగు బస్సు సాయంత్రం ఐదు గంటల సమయంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి.

ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న గడ్డం రవీందర్, అతడి భార్య రేణుక, కుమార్తె రితిక అక్కడికక్కడే మృతి చెందారు. కారులో ప్రయాణిస్తున్న రవీందర్ కుమారుడు రిషికృష్ణ పరిస్థితి విషమంగా ఉంది. అతడిని మెరుగైన చికిత్సకోసం హైదరాబాద్‌కు తరలించారు. మిగిలిన వారికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్పీ కొత్తపల్లి నర్సింహ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును పోలీస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదానికి కారణమైన బస్సును పరిశీలించారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని అధికారులకు సూచించారు. డీఎస్పీ రవి, సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్, చివ్వెంల ఎస్ఐ మహేశ్వర్ సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి కారణమైన వాహనాలను పక్కకు తీయించారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

మహబూబాబాద్ జిల్లాలోని కంతాయపాలెంలో విషాదం

తొర్రూరు రూరల్ : సూర్యాపేట జిల్లా ఆత్మకూరు మండలంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం కంతాయపాలెంలోని ఒకే కుటుంబానికి చెందిన భార్యాభర్తలతో పాటు.. వారి ఎనిమిదేళ్ల కూతురు దుర్మరణం చెందడంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గడ్డం రవీందర్ కంతాయపాలెం గ్రామస్థుడైనప్పటికీ ప్రేమవివాహం కావడంతో భార్య రేణుకతో కలిసి హైదరాబాద్‌లోనే నివాసముంటూ కారు నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. రవీందర్ చిన్న వయస్సులోనే తండ్రి మృతి చెందడంతో తల్లి లక్ష్మి ఒక్కరే స్వగ్రామంలో ఉంటోంది. సూర్యాపేట ప్రమాదంలో కొడుకు, కోడలు, మనువరాలు మృతి చెందినట్లు తెలియగానే కన్నీరుపర్యంతమైంది. మృతుడి తల్లి కూడా ఉప్పలమ్మ పండుగకు కోటపహాడ్‌కు వెళ్లి, అక్కడే బంధువుల ఇంట్లో ఉన్నట్లు సమాచారం.




కంతాయపాలెంలోని మృతుడు రవీందర్ ఇల్లు

క్షయను జయించొచ్చు..

- అందుబాటులో అధునాతన చికిత్స
- రోగులకు ఉచితంగా మందులు, పోషకాహారం
- ఆరు నెలల పాటు నెలకు రూ. 1000 సాయం

నేడు ప్రపంచ క్షయ దినోత్సవం



హనుమకొండ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : చిన్నదగ్గే కదా అని వదిలేస్తే అది క్షయగా మారి ప్రాణాలు తీస్తుంది. క్షయను దేశం నుంచి తరిమేయాలన్నది కేంద్ర ప్రభుత్వ లక్ష్యం. ప్రాథమిక దశలోనే దీన్ని గుర్తించే కార్యక్రమాన్ని ఉమ్మడి వరంగల్ జిల్లాలో చేపట్టారు. 2025 నాటికి ఈ వ్యాధిని దేశం నుంచి దూరం చేయాలన్న భారత ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకోవడానికి జిల్లా క్షయ నిర్మూలన శాఖ ఆధ్వర్యంలో అత్యాధునిక నిర్ధారణ పరీక్షలు, లక్షల విలువైన మందులు రోగులకు ఉచితంగా అందిస్తున్నారు. సోమవారం ప్రపంచ క్షయ నిర్మూలన దినం సందర్భంగా ప్రత్యేక కథనం.

క్షయ అంటే..

క్షయ (ట్యుబర్క్యులోసిస్) అంటువ్యాధి. ఇది పురుషులకు ఏ వయసులోనైనా ఎవరికైనా సోకవచ్చు. ఇది శరీరంలో ఏ భాగానికైనా రావచ్చు. ఎక్కువగా ఊపిరితిత్తులకు సోకుతుంది. దీనినే శ్వాసకోశ క్షయ అంటారు. క్షయ వ్యాధి సూక్ష్మక్రిముల ద్వారా సంక్రమిస్తుంది. క్షయరోగి దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు సూక్ష్మక్రిములు గాలిలోకి సన్నని తుంపర్లుగా వెళ్తాయి. ఈ తుంపర్లు ఆరోగ్యవంతులు పీల్చినప్పుడు వారికి క్షయ వ్యాధి వచ్చే అవకాశం ఉంది. ఎయిడ్స్ వ్యాధి సోకిన వారికి క్షయ వ్యాధి వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

ఈసారి థీమ్.. 'అవును.. మనం టీబీని అంతం చేయగలం'

జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ప్రతీ సంవత్సరం మార్చి 24న ప్రపంచ క్షయ వ్యాధి దినాన్ని జరుపుతున్నారు. 'అవును.. మనం టీబీని అంతం చేయగలం' అనేది ఈ సంవత్సరం థీమ్. క్షయ వ్యాధి నిర్మూలనకు అందరూ సంఘటితంగా కృషి చేసినప్పుడు ఈ మహమ్మారిని భూమి నుంచి శాశ్వతంగా తొలగించగలం.

హనుమకొండ జిల్లాలో 2024లో క్షయ కేసులు

మండలం	బాధితులు సంఖ్య
హసన్‌పర్తి	96
ఐనవోలు	25
కాజీపేట	454
ధర్మసాగర్	37
హనుమకొండ	564
వేలేరు	11
భీమదేవరపల్లి	27
ఎల్కతుర్తి	36
ఆత్మకూరు	35
కమలాపూర్	58
శాయంపేట	33
నడికూడ	43
పరకాల	27
దామెర	17
మొత్తం	1,463

క్షయ నివారణకు చర్యలు

క్షయ నివారణకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామీణ, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో తెమడ పరీక్షలు నిర్వహిస్తున్నారు. హనుమకొండ, ముల్కనూరు, పరకాలలో ట్రీట్‌మెంట్ యూనిట్లు, వ్యాధి నిర్ధారణ, ఫాలోఅప్ సేవల కోసం జిల్లాలో ఆరు డిజిగ్నేటెడ్ మైక్రోస్కోపిక్ కేంద్రాలు, జిల్లా క్షయ నివారణ కేంద్రంలో సిబినాట్, ట్రూనాట్ మిషన్స్ వ్యాధి నిర్ధారణ కోసం కాకతీయ వైద్య కళాశాలలో టీబీ కల్చర్ డీఎస్టీ ల్యాబొరేటరీ పని చేస్తున్నాయి. శాంపిళ్లను జిల్లా క్షయ నిర్మూలనా కేంద్రానికి పంపి నిర్ధారణ చేస్తున్నారు. అక్కడ నిర్ధారణ కాకుంటే సిబినెట్ అనే యంత్ర సాయంతో 48 గంటల్లో వ్యాధి నిర్ధారణ చేసి నివేదిక ఇస్తున్నారు. ఊపిరితిత్తుల్లో క్షయ ఉంటే ఎక్స్‌రే తీస్తారు. అందులోనూ నిర్ధారణ కాకపోతే ఎల్‌పీఏ, ఎంజీఐటీ, లిక్విడ్‌కల్చర్ పరీక్షలను హైదరాబాద్‌లో చేయిస్తున్నారు. హనుమకొండలోని 20 పడకల టీబీ ఆసుపత్రి క్షయ రోగులకు సేవలందిస్తోంది.

తగ్గిన క్షయ కేసులు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో క్షయ కేసులు క్రమంగా తగ్గుతున్నాయి. గతంలో పోలిస్తే టీబీ కేసులు తగ్గినందుకు 2022లో హనుమకొండ జిల్లాకు రజత పతకం లభించింది. గత సంవత్సరం టీబీ లక్షణాలు ఉన్న 22,770 మందికిగాను 20,956 (92 శాతం) మందికి పరీక్షలు నిర్వహించారు. టీబీ వ్యాధి నిర్ధారణ అయిన 1,848 మందికి చికిత్స అందించారు. హనుమకొండ ట్రీట్‌మెంట్ యూనిట్ పరిధిలో 1,088, పరకాల ట్రీట్‌మెంట్ యూనిట్ పరిధిలో 237, ముల్కనూరు పరిధిలో 208 మందికి చికిత్స అందించారు. 774 మందికి నిక్షయ పోషణ ద్వారా చికిత్స కాలానికి రూ.1000 చొప్పున వారి ఖాతాలో జమ చేశారు. ఈ సంవత్సరం ఇప్పటి వరకు 363 కేసులను గుర్తించారు.

క్షయ లక్షణాలు

రెండు వారాలకు మించి ఎడతెరిపిలేని దగ్గు వస్తుంది. సాయంత్రం జ్వరం వస్తుంది. ఆకలి తగ్గుతుంది. ఛాతినొప్పి, బరువు తగ్గడం, కఫం (తెమడ)లో రక్తం పడడం ఉంటుంది. క్షయవాధిని నివారించవచ్చు. రెండు సార్లు కఫం పరీక్ష చేయించాలి. ఒకవేళ రెండు సార్లు పరీక్షలు నెగెటివ్ అయితే రోగి ఎక్స్‌రే తీయించుకోవడం అవసరం.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పుట్టిన వెంటనే పసిబిడ్డలకు బీసీజీ సూది మందు ఇప్పించాలి. దగ్గు వచ్చినప్పుడు గుడ్డ నోటికి అడ్డు పెట్టుకోవాలి. క్షయ రోగి ఎక్కడ పడితే అక్కడ ఉమ్మివేయరాదు. మందులు వాడే సమయంలో రియాక్షన్ వస్తే భయపడకుండా డాక్టర్‌ను సంప్రదించాలి. మందులు క్రమంగా వాడడం అతి ముఖ్యం. వ్యాధి లక్షణాలు తగ్గినా వైద్యం మధ్యలో ఆపరాదు. క్షయ వ్యాధిగ్రస్తులు ఉన్న ఇంట్లో ఆరు సంవత్సరాల లోపు వయసుగల పిల్లలకు డాక్టర్ సలహా మేరకు మందులు ఇప్పించాలి. చికిత్సకు సంబంధించిన మాత్రలు రోగులు క్రమం తప్పకుండా వాడాలి. రోగికి సంబంధించిన కుటుంబ సభ్యులకూ టీబీ పరీక్ష జరపాలి. రోగి మంచి పోషక విలువలు ఉన్న ఆహారాన్ని క్రమం తప్పకుండా తినాలి. మద్యం సేవించడం, పొగ తాగడం, ఇతర చెడు అలవాట్లను ఆపివేయాలి. ముందు జాగ్రత్తగా నోటికి ఒక రుమాలును ధరించడం వల్ల దగ్గినప్పుడు టీబీ ఇతరులకు వ్యాపించకుండా నిరోధించవచ్చు. వ్యాయామం, యోగ ఆశావహ దృక్పథం మొదలైన మంచి ఆరోగ్య పద్ధతులు పాటించాలి.

నయమవుతుంది..

ప్రత్యక్ష పర్యవేక్షణ స్వల్పకాలిక చికిత్స (డీవోటీఎస్) ద్వారా క్రమం తప్పకుండా మందులు వాడాలి. ఈ మందులు చికిత్స అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా అందుబాటులో ఉంది. కొత్తగా గుర్తించిన రోగుల చికిత్స కాలం ఆరు, ఏడు నెలలు. సరిగ్గా మందులు వాడక పోవడం వల్ల వ్యాధి ముదిరిన వారికి ఒకసారి నయమై మళ్లీ వ్యాధి తిరగబెట్టిన వారికి చికిత్స కాలం 8, 9 మాసాలు పడుతుంది. డీబీటీ పథకం ద్వారా ప్రభుత్వం టీబీ చికిత్స తీసుకునేవారికి పోషకాహారం కోసం ప్రతీ నెల రూ.1000 ఆరు నెలలు ఇస్తుంది. క్షయ నిర్ధారణ పరీక్షలు, కావాల్సిన మందులు, పోషకాహారం, భత్యం ఉచితంగా లభిస్తుంది. మరింత సమాచారం కోసం దగ్గరలోని ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిని సంప్రదించవచ్చు.

క్షయపై అవగాహన ర్యాలీ

డాక్టర్ హిమబిందు, హనుమకొండ జిల్లా క్షయ నియంత్రణ అధికారి

క్షయ వ్యాధి గురించి విద్యార్థులు, స్వయం సహాయక సంఘాలు, కార్మికులు, గ్రామీణులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. చికిత్సా విధానంలో వస్తున్న మార్పులు, ఇతర అంశాలపై ప్రభుత్వ, ప్రైవేటు డాక్టర్లు, ఎంబీబీఎస్ విద్యార్థులు, సిబ్బందికి సెమినార్లు నిర్వహి స్తున్నాం. ప్రపంచ క్షయ వ్యాధి దినాన్ని పురస్కరించుకొని ఈనెల 24న ఉదయం 10 గంటలకు భద్రకాళి గుడి ఆర్చి నుంచి కేఎంసీ వరకు ర్యాలీ తీస్తున్నాం. అనంతరం కాన్ఫరెన్స్ హాల్‌లో సమావేశం ఏర్పాటు చేశాం. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో ఏ అప్పయ్య తదితరులు టీబీపై అవగాహన కల్పిస్తారు.

అక్రమార్కుడిపై చర్యలేవి ?

నకిలీ సర్టిఫికెట్ల సూత్రధారిపై చర్యలకు ఆర్జేడీ వెనుకంజ
నేడు ఆర్జేడీ కార్యాలయం వద్ద టీటీయూ ఆధ్వర్యంలో ధర్నా



వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): నకిలీ సర్టిఫికెట్ల (డూప్లికేట్ మెమోలు) కుంభకోణం, అవినీతి అక్రమాలకు పాల్పడుతూ మహిళా ఉపాధ్యాయులను వేధిస్తున్న ఓ ప్రధానోపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవడంలో వరంగల్ పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ మీనమేషాలు లెక్కపెడుతున్నారని తెలంగాణ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఆరోపణలు చేస్తున్నారు. కావాలనే ఆర్జేడీ హెడ్మాస్టర్‌ను కాపాడుతున్నారని విమర్శిస్తున్నారు. సదరు హెడ్మాస్టర్‌పై వచ్చిన ఆరోపణలన్నీ వాస్తవమేనని జయశంకర్ భూపాలపల్లి జిల్లా డీఈవో ఇచ్చిన నివేదికను ఆర్జేడీ బుట్టదాఖలు చేసి ఎలాంటి శిక్ష లేని సెన్సూర్ ఇచ్చి తన బాధ్యతలను విస్మరించినట్లు వారు చెబుతున్నారు. ఆరోపణలు రుజువైన వెంటనే సస్పెండ్ చేయాల్సిన ఆర్జేడీ.. అందుకు భిన్నంగా న్యాయపరమైన అంశాలున్నాయంటూ దాటవేత ధోరణి ప్రదర్శించడం అనుమానాలకు తావిస్తోందని వారు అంటున్నారు. అయితే నిబంధనల మేరకు శాస్త్రీయంగా విచారణ జరుగలేదని, అలాంటి నివేదికపై చర్యలు తీసుకోవడం సబబు కాదని ఆర్జేడీ స్పష్టం చేశారు.

ఆర్జేడీ కార్యాలయం వద్ద నేడు టీటీయూ ధర్నా

ఆర్జేడీ వ్యవహారశైలికి నిరసనగా సోమవారం వరంగల్ ఆర్జేడీ కార్యాలయంలో ధర్నా చేస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎల్.నరేందర్‌నాయక్, జి.శ్రీనివాస్‌లు పేర్కొన్నారు. సదరు హెడ్మాస్టర్ అక్రమాలు, వేధింపులు రుజువైన నేపథ్యంలో వెంటనే విధుల నుంచి తొలగించి పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని ట్యాంపరింగ్‌లు, నకిలీ మెమోలకు బాధ్యుడైన సదరు హెడ్మాస్టర్‌పై క్రిమినల్ కేసులు పెట్టించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

విచారణలో రుజువైన ఆరోపణలు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం జడ్పీహెచ్ఎస్‌లో 1997లో పదో తరగతి పూర్తి చేసిన గంధం రమేష్ అనే వ్యక్తి టెన్త్ మెమో ఆధారంగా గుర్రాల రమేష్ అనే వ్యక్తికి డూప్లికేట్ పదో తరగతి మెమోను అందజేసిన విషయంలో సదరు హెడ్మాస్టర్ అక్రమం రుజువైంది.

- మహాముత్తారం జడ్పీహెచ్ఎస్‌లో 2015 నుంచి 2018 వరకు హెడ్మాస్టర్‌గా పనిచేసిన సదరు హెచ్ఎం అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడటంతోనే రికార్డుల ట్యాంపరింగ్‌కు పాల్పడిన సంఘటనలు రుజువు అయ్యాయి. అదే పాఠశాలలో 2017-18 విద్యా సంవత్సరంలో మొత్తం కేవలం 45 రోజులు మాత్రమే బడికి హాజరైన విషయం రుజువైంది.
- అదే పాఠశాలలో పనిచేస్తున్న ఒక ఆదివాసీ మహిళా ఉపాధ్యాయురాలిని వేధింపులకు గురిచేసిన సంఘటన, మరో ఉపాధ్యాయుడికి ఈఎల్స్ ఇవ్వకుండా వేధింపులు, ఆర్ట్‌క్రాఫ్ట్ టీచర్‌కు సంబంధించిన అటెండెన్స్ రిజిస్టర్ మాయంతో పాటు ఇతర ఉపాధ్యాయులను వివిధ రకాలుగా వేధింపులకు గురిచేసిన సంఘటనలు రుజువయ్యాయి.
- 2015 వరకు సదరు హెడ్మాస్టర్‌కు సదరమ్ అంగవైకల్య ధ్రువీకరణ పత్రం లేనప్పటికీ పదోన్నతి పొందాడని టీటీయూ నేతలు ఆరోపణలు చేస్తున్నారు.

ఎంజీఎం ఇన్‌చార్జ్ ఆర్ఎంవోలుగా ఇద్దరికి బాధ్యతలు

వరంగల్ మెడికల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి సివిల్ సర్జన్ ఆర్ఎంవోగా డాక్టర్ అంబి శ్రీనివాస్, డిప్యూటీ సివిల్ సర్జన్ ఆర్ఎంవోగా డాక్టర్ శశికుమార్‌లకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు రాష్ట్ర వైద్య విద్యా సంచాలకుడు ఆర్‌సీ నెంబర్ 4022ను 2025 విడుదల చేశారు. ప్రస్తుతం ఎంజీఎం ఆస్పత్రిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ హోదాలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ అంబి శ్రీనివాస్‌కు సివిల్ సర్జన్ ఆర్ఎంవోగా, సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా పనిచేస్తున్న డాక్టర్ శశికుమార్‌కు డిప్యూటీ సివిల్ సర్జన్ ఆర్ఎంవోగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.



డిప్యూటీ సివిల్ సర్జన్ శశికుమార్



డాక్టర్ అంబి శ్రీనివాస్

కొమ్మాల జాతరకు పోటెత్తిన భక్తులు



దర్శనం కోసం క్యూలో వెళ్తున్న భక్తులు

గీసుగొండ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కొమ్మాల లక్ష్మీనరసింహస్వామి జాతరకు ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. సుమారు 50వేల మంది భక్తులు ఒక్క రోజే స్వామివారిని దర్శించుకున్నట్లు ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు తెలిపారు. ఆదివారం సెలవు దినం కావటంతో ఉదయం నుంచే ఆలయానికి భక్తుల తాకిడి పెరిగి క్యూ లైన్‌లో కిక్కిరిసి పోయాయి. ప్రత్యేక, శీఘ్ర దర్శనాల క్యూ లైన్‌లు కూడా భక్తులతో నిండిపోయాయి. గంటల తరబడి భక్తులు క్యూ లైన్‌లో నిలబడి స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ప్రత్యేక, శీఘ్రదర్శనాల కోసం గర్భగుడి వెనుక భాగం నుంచి ఉన్న క్యూలైన్‌లు ఇరుకుగా ఉండడంతో ఉక్కపోతతో ఇబ్బంది పడ్డారు. కనీసం ఫ్యాన్‌లను కూడా ఏర్పాటు చేయలేదని భక్తులు మండిపడ్డారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు, రామాచార్యులు, విష్ణు, ఫణీంద్ర, ఉత్సవ కమిటి చైర్మన్ కడారి రాజు పాల్గొన్నారు.

వైభవంగా ఐనవోలు మల్లన్న కల్యాణం

ఆలయ ప్రాంగణం.. పసుపుమయం » ఆకట్టుకున్న 50 అడుగుల పెద్దపట్నం » తరలివచ్చిన భక్తులు

ఐనవోలు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఐనవోలు మల్లికార్జునస్వామి వారాంతపు జాతరలో చివరి ఆదివారం మల్లన్నస్వామి కల్యాణం, పెద్దపట్నం వైభవంగా నిర్వహించారు. శివరాత్రి ఉత్సవాలు ముగిశాక ఉగాదికి ముందు వైదిక పద్ధతిలో స్వామి వారి కల్యాణం జరుపుతూ జానపదుల తంతులో పెద్ద పట్నం వేయడం ప్రత్యేక తంతుగా నిలుస్తోంది. అందులో భాగంగా బలిజే మేడమ్మ, గొల్లకేతమ్మ అమ్మవార్ల సమేత మల్లికార్జునస్వామి కల్యాణం కనుల పండువగా కనువిందు చేసింది. వేద మంత్రోచ్చరణల నడుమ వైదిక పద్ధతిలో శాస్త్రోక్తముగా ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్ ఆధ్వర్యంలో ముఖ్య అర్చకులు పాతర్లపాటి శ్రీనివాస్, ఐనవోలు మధుకర్‌శర్మ, వేద పండితులు గట్టు పురుషోత్తంశర్మ, విక్రాంత్ వినాయక్ జోషి, అర్చకులు నందనం భాను ప్రసాద్, మధుశర్మ, నరేష్‌శర్మ, దేవేందర్, శ్రీనివాస్‌లు కల్యాణాన్ని నిర్వహించారు. ఒగ్గు పెద్ద పూజారులు మజ్జిగ మహేందర్, మజ్జిగ రాజయ్య, మజ్జిగ అశోక్‌ల ఆధ్వర్యంలో 60 మంది ఒగ్గుపూజారులు 7 గంటలు శ్రమించి 50 అడుగుల పెద్ద పట్నం'ను అద్భుతంగా వేశారు.

పెద్దపట్నంపై భక్తుల శివతాండవం

మల్లన్న స్వామికి అత్యంత ప్రీతికరమైన పెద్దపట్నాన్ని ఆలయ ప్రాంగణంలోని కాకతీయుల నృత్య మండపానికి ఉత్తరం వైపున 50 అడుగుల వెడల్పు, పొడవుతో వివిధ రకాల చూర్ణములు (పిండి) ముగ్గులతో ఒగ్గు పూజారులు అందంగా పట్నం వేశారు. కల్యాణం తదుపరి ఉత్సవ విగ్రహాలతో ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు, అర్చకులు పట్నం చుట్టూ ప్రదక్షిణ చేశారు. పట్నంపైన శ్రీగొల్లకేతమ్మ, బలిజె మేడలమ్మ అమ్మవార్ల సమేత మల్లన్న స్వామి ఉత్సవ విగ్రహాలను ఆవాహనం చేసి ఒగ్గు కథ ద్వారా కల్యాణం గాథను పఠించారు. భక్తులు భక్తి పారవశ్యంతో పట్నంపై మండుటెండలో మైమరిచి నృత్యం, శివతాండవం చేయడం కనువిందుగా నిలిచింది. పోలీసులు పెద్దపట్నం వద్ద బందోబస్తు నిర్వహించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో దేవస్థానం ప్రాంగణం కిటకిటలాడింది. శనివారం సాయంత్రం నుంచి ఆదివారం రాత్రి వరకు సుమారు లక్ష మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. కాగా, ఉదయం స్వామి వారి మేలుకొలుపు సుప్రభాత ప్రాతఃకాల పూజలు నిర్వహించారు. మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, విశేష అభిషేకాలు కొనసాగాయి. భక్తులు మొక్కులు చెల్లించి స్వామివారిని దర్శించుకున్నారు. ధర్మదర్శనానికి సుమారు 5 గంటల సమయం పట్టగా శీఘ్రదర్శనానికి 2 గంటలు పట్టింది. క్యూ వద్ద పోలీసులు, వాగ్దేవి కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు బందోబస్తును నిర్వహించారు. దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.



స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



పెద్దపట్నాన్ని తొక్కుతూ బండారి(పసుపు)ని తీసుకెళ్తున్న భక్తులు

కాయ్ రాజా.. కాయ్..

- ఐపీఎల్ క్రికెట్ సీజన్ వేళ జోరుగా బెట్టింగ్
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో మళ్లీ మొదలైన దందా
- పోలీసుల నామమాత్రపు చర్యలతో సాగుతున్న బాగోతం

హనుమకొండ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) సీజన్ ప్రారంభం కావడంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో బెట్టింగ్ దందా మళ్లీ మొదలైంది. బంతి బంతికి ఉత్కంఠ, క్షణాల్లో మారే ఫలితం. చూస్తున్నంత సేపు క్రికెట్ అభిమానులు పిచ్చెక్కిపోతుంటారు. దీనినే అవకాశంగా తీసుకొని కొందరు బుకీలుగా అవతారమెత్తి బెట్టింగ్‌లకు తెరలేపుతున్నారు. క్రికెట్ అంటే పడి చచ్చే యువతనే లక్ష్యంగా చేసుకొని వారిని ముగ్గులోకి దించి బెట్టింగ్‌లు కాయిస్తున్నారు. సులభంగా డబ్బు సంపాదించేందుకు అలవాటు పడ్డవారు పెద్ద ఎత్తున క్రికెట్ బెట్టింగ్‌లకు దిగుతున్నారు.

అద్దె ఇళ్లే అడ్డాలు

బెట్టింగ్ కోసం బుకీలు అద్దె ఇళ్లనే అడ్డాలుగా మార్చుకుంటున్నారు. అపార్టుమెంట్లు, ఇంటర్నెట్ సెంటర్లను సైతం బెట్టింగ్‌లకు వేదికలుగా మార్చుకుంటున్నారు. ఊరికి దూరంగా, నిర్మానుష్యంగా ఉన్న రహస్య ప్రదేశాల్లో ఇళ్లను అద్దెకు తీసుకొని అందులో టీవీతో పాటు మద్యం, ఇతర సదుపాయాలను కల్పిస్తున్నారు. ఒక్కోసారి హోటళ్లను కేంద్రంగా చేసుకొని వ్యవహారాలు నడిపిస్తున్నారు. ల్యాప్‌టాప్‌లు, ఫోన్లద్వారా బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. యువకులు, విద్యార్థులను ఆకర్షిస్తున్నారు. వారిలో లేనిపోని ఆశలు రేకెత్తించి పెద్దఎత్తున బెట్టింగ్‌లు కట్టేట్టు ప్రోత్సహిస్తున్నారు. బెట్టింగ్‌లు కట్టడానికి ముందు గతంలో జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లు, ఏ ఆటగాడు ఎన్ని పరుగులు.. ఎన్ని వికెట్లు తీసింది.. ప్రస్తుత ఐపీఎల్‌లో ఏ క్రికెటర్ ఎలా ఆడే అవకాశం ఉంది.. ఎన్ని రన్‌లు, వికెట్లు తీయగలడో బేరీజులు వేసి యువతను ఊరిస్తున్నారు. బెట్టింగ్‌లు కడితే వచ్చే సొమ్ము గురించి అరచేతిలో స్వర్గం చేపిస్తున్నారు. ఇదంతా నిజమేనని నమ్మి అమాయకులు బెట్టింగ్‌లు కట్టి లక్షల రూపాయలు నష్టపోతున్నారు. గెలిచిన వారు కొందరైతే ఓడిపోయి సర్వం కోల్పోయినవారు వేలల్లో ఉంటున్నారు. ఓడిపోయిన తర్వాత కోల్పోయింది ఎంతో తెలుసుకొని నైరాశ్యంతో చివరకు ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటనలు ఉమ్మడి జిల్లాలో అనేకం జరిగాయి. వీరిలో చాలా మంది అప్పుల బాధ తట్టుకోలేక, లేక ఇతరత్రా కారణాల వల్ల బలవన్మరణాలకు పాల్పడినట్టు మాత్రమే పోలీసు రికార్డుల్లో నమోదు అవుతున్నాయి కానీ, లోతుగా వెళితే వాటిలో ఎక్కువగా బెట్టింగ్ దందా వల్లనే అనే విషయం స్పష్టమవుతోంది.

ఎల్లలు దాటి బుకింగ్

ఉమ్మడి జిల్లాకు చెందిన బుకీల్లో కొందరు స్థానికంగా ఉండి బెట్టింగ్‌లు సాగిస్తుండగా మరికొందరు హైదరాబాద్, కర్నాటక, చెన్నై తదితర నగరాల్లో ఉంటూ స్థానికంగా చక్రం తిప్పుతున్నారు. తెలంగాణనే కాకుండా ఏపీ, రాజస్థాన్, మహారాష్ట్ర, గుజరాత్, కర్నాటక తదితర రాష్ట్రాలకు చెందిన నిర్వాహకులు కూడా ఇక్కడ ఏజెంట్లను నియమించుకొని యథేచ్ఛగా దందా సాగిస్తున్నారు. పట్టణ, మండల కేంద్రాల్లో ఏజెంట్లను నియమించుకొని వారి ద్వారా దందా సాగిస్తున్నారు. ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌లు గతంలో నగరాలకే పరిమితం అయ్యేది. ఇప్పుడు గ్రామీణ ప్రాంతాలకు కూడా పాకింది. బుకీలు స్థానింగా ఉండే ఏజెంట్ల సాయంతో బెట్టింగ్ చేసే వారిని గుర్తించి వారి వివరాలు, ఫోన్ నెంబర్లతో వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేసుకుంటున్నారు. సహకరించిన ఏజెంట్లకు కమీషన్ల రూపంలో భారీగా ముట్టజెప్పుతున్నారు. గతంలో క్రికెట్ బెట్టింగ్‌లలో డబ్బులు పోగొట్టుకున్న చాలా మంది సబ్ ఏజెంట్లుగా మారుతున్నారు. ఇందులో విద్యార్థులు, యువకులు, చిరుద్యోగులు, ఐటీ నిపుణులు ఉంటున్నారు. సామాన్యులు చిరువ్యాపారులు కూడా బెట్టింగ్‌లతో నష్టపోతున్నారు. చేతిలో స్మార్ట్‌ఫోన్ అందుబాటులో ఉండడం, వెబ్‌సైట్‌లు, యాప్‌ల ద్వారా సులభంగా ఆడే సదుపాయం ఉండడంతో ఎక్కువ మంది దీనికి ఆకర్శితులవుతున్నారు. సరదాగా బెట్టింగ్ కాయడం మొదలుపెట్టి చివరకు వ్యవసనపరులుగా మారుతున్నారు. పెట్టిన డబ్బుతో పోలిస్తే ఎక్కువ డబ్బు తిరిగి వస్తుండడం ఇందుకు కారణం. రెండు మూడుసార్లు ఇలాగే ఎక్కువ డబ్బు వచ్చినా ఆ తర్వాత ఆశతో మరింత పెట్టి భారీగా నష్టపోతున్నారు.

పలు రకాలుగా బెట్టింగ్

బెట్టింగ్ అనేక మార్గాల్లో సాగుతుంటుంది. బంతి బంతికి, ఓవర్ ఓవర్‌కు, మ్యాచ్ మ్యాచ్‌కు.. ఇలా పలు మార్గాల్లో నిర్వహిస్తారు. మ్యాచ్ టాస్ వేసిన మొదలు బంతి బంతికి పందెం సాగుతుంది. గతంలో క్రికెట్ బెట్టింగ్ గెలుపోటములపై ఎక్కువగా నడిచేది. కానీ ప్రస్తుతం ఆటలో టాస్ నుంచి మొదలు కొని బంతి బంతికి ఒకే రేటు నిర్ణయిస్తున్నారు. ఈ బంతి బౌండరీ దాటుతుందని, సిక్సర్ కొడతాడని, ఫలానా ఆటగాడు ఇంత స్కోర్ చేస్తాడని, బౌలర్ వికెట్ తీస్తాడని ఇలా రకరకాలుగా పందేలు కాస్తుంటారు. టీవీ ముందు కూర్చొని బంతి బంతికి బెట్టింగ్ కాస్తూ రేటింగ్ ముందే నిర్ణయిస్తుంటారు. చెప్పినట్లు జరిగితే పందెం కట్టిన వ్యక్తికి మూడు రెట్లు అదనంగా డబ్బు వస్తుంది. ఐపీఎల్ మ్యాచ్‌లో బెట్టింగ్‌లు రకరకాలుగా జరుగుతాయి. కొంత మంది గ్రూపులుగా ఏర్పడి బెట్టింగ్‌లకు పాల్పడుతుంటారు. మరికొంత మంది మధ్యవర్తి సాయంతో బెట్టింగ్‌లు నిర్వహిస్తుంటారు. మ్యాచ్ అయిపోయిన తర్వాత బెట్టింగ్‌లలో ఎవరికి ఎవరు ఎంత ఇవ్వాలో చివరికి లెక్కచూసుకుంటారు. ఉమ్మడి జిల్లాలో ప్రతీ ఐపీఎల్ సీజన్‌లో బెట్టింగ్‌లు రూ.కోట్లలో సాగుతోంది.



ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ కోసం నగరంలోని ఓ బార్‌లో ఏర్పాటు చేసిన స్క్రీన్

బెట్టింగ్‌లకు ఎంతో మంది బలి


- 2023 ఏప్రిల్ 11న వరంగల్ టాస్క్‌ఫోర్సు పోలీసులు నగర శివార్ల గుట్టుగా క్రికెట్ బెట్టింగ్స్ పాల్పడుతున్న ముగ్గురు సభ్యుల ముఠాను అరెస్టు చేశారు. బెట్టింగ్‌లు జరుగుతున్న స్థావరంపై మెరుపుదాడి చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు.
- కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుండ్ల సింగారానికి చెందిన ఆటోడ్రైవర్ రాజేందర్ ఇంటిపై దాడి చేసి క్రికెట్ బెట్టింగ్ వ్యవహారానికి చెక్ పెట్టారు. డైమండ్ ఎక్స్ సీహెచ్ 9 పోర్టల్ అండ్ ప్రింటర్స్ బుక్‌లో బెట్టింగ్ కాసిన రూ.68వేల నగదు, 2 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. రాజేందర్‌తో పాటు ఓ సివిల్ కాంట్రాక్టర్‌ను, హనుమకొండ వాజ్‌పేయి కాలనీకి చెందిన మరొకరిని అరెస్టు చేశారు.
- ఆత్మకూరు మండలం ఊరుగొండలో నాగరాజు అనే యువకుడు బెట్టింగ్‌లో డబ్బు పోగొట్టుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చిన్నచిన్న పనులు చేసుకుంటూ జీవనం సాగించే నాగరాజు స్నేహితులతో కలిసి బెట్టింగ్ పెట్టి అంతా పోగొట్టుకోవడంతో బయట అప్పులు చేశాడు. చేసిన అప్పు తీర్చలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు.
- ధర్మసాగర్ మండలం మల్లక్‌పల్లికి చెందిన రామక్రిష్ణారెడ్డి బెట్టింగ్‌లో లక్షల రూపాయలు పోగొట్టుకొని చివరికు బలవన్మరణానిక పాల్పడ్డాడు.
- నర్సంపేటకు చెందిన ప్రశాంత్ బెట్టింగ్‌లో రూ.2లక్షలకుపైగా పోగొట్టుకొని చివరకు ఆత్మహత్య చేసుకున్నాడు.
- రఘునాథపల్లికి చెందిన రైల్వే ఉద్యోగి రాజు కూడా బెట్టింగ్‌లో పెద్ద మొత్తంలో డబ్బు పోగొట్టుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

కఠిన చర్యలతోనే బ్రేక్

క్రికెట్ బెట్టింగ్‌లు జోరుగా సాగుతున్నప్పటికీ పోలీసులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒక సారి అరెస్టయినా జైలు నుంచి బయటకు వచ్చి మళ్లీ బెట్టింగ్ పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్ల వారు రెచ్చిపోతున్నారు. ఇటువంటి వారిపై రౌడీషీట్లు తెరవాలని ప్రజలు కోరుతున్నారు. పాత ముఠాలపై నిఘా పెంచాలని, పందేలు నిర్వహించేవారిని వ్యవస్థీకృత నేరస్తులుగా పరిగణించి వారి ఆస్తులను ప్రభుత్వానికి అటాచ్ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

దొంగలుగా మారి..

బెట్టింగ్ వల్ల కొంతమంది ఆర్థికంగా నష్టపోయి ఆత్మహత్యలు చేసుకుంటుంటే మరికొంత మంది సబ్ ఏజెంట్లుగా అవతారమెత్తుతున్నారు. ఇంకొందరు దొంగతనాలకు పాల్పడుతున్నారు. రాయపర్తికి చెందిన ధర్మరాజు క్రికెట్ బెట్టింగ్‌లో నష్టపోయి 17 దొంగతనాలకు పాల్పడ్డాడు. పోలీసు అరెస్టు చేసి జైలుకు పంపారు. రెండేళ్ల కిందట వరంగల్ నగరానికి చెందిన ఏడుగురు యువకులు బెట్టింగ్‌లో నష్టపోయి దొంగతనాలు చేస్తూ పోలీసులుకు చిక్కారు. మహబూబాబాద్‌కు చెందిన సునిల్ కూడా ఇలాగే చోరీలకు పాల్పడి కటకటాలపాలయ్యాడు. హనుమకొండ గోపాల్‌పూర్‌కు చెందిన మాడిశెట్టి ప్రసాద్ రెండు రాష్ట్రాల బుకీగా అవతారమెత్తి జైలు పాలయ్యాడు. బయటకు వచ్చిన తర్వాత మళ్లీ బెట్టింగ్‌లు నిర్వహిస్తూ మళ్లీ పోలీసులకు చిక్కాడు. తర్వాత వరంగల్‌కు మకాం మార్చి బెట్టింగ్‌లకు పాల్పడగా ఆయన చేతుల్లో మోసపోయినవారు చేసిన ఫిర్యాదు మేరకు టాస్క్‌ఫోర్సు పోలీసులు అరెస్టు చేసి రూ.2.70 కోట్లు స్వాధీనం చేసుకున్నారు. ఆయన మళ్లీ అదే బాటలో నడిచి అరెస్టు కాగా, ఈసారి ప్రసాద్ నుంచి మరో రూ.52లక్షలను స్వాధీనం చేసుకున్నారు.



కేయూ ఇంజనీరింగ్ విద్యార్థి రంజిత్‌కుమార్‌కు నివాళి

కేయూ క్యాంపస్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ ఇంజనీరింగ్ ఈసీఈ ఫైనల్ ఇయర్ విద్యార్థి కె.రంజిత్‌కుమార్ రోడ్డు ప్రమాదంతో దుర్మరణం పాలయ్యారు. దామెర మండలం గుడెప్పాడ్ జంక్షన్ సమీపంలో శనివారం రాత్రి జరిగిన సంఘటనలో ట్రాక్టర్, మోటార్ సైకిల్‌కు ఢీకొట్టడం తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. వెంటనే అంబులెన్స్‌లో ఎంజీఎం ఆస్పత్రికి తరలించడంతో అప్పటికే రంజిత్‌కుమార్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా, మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో పోస్టుమార్టం కోసం తరలించారు. కాగా, రంజిత్‌కుమార్ భౌతిక కాయాన్ని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, ప్రిన్సిపాల్ ఎన్. రమణ, ఓఎస్‌డీ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, హాస్టల్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్, నేతాజీ, ఈసీఈ ఫ్యాకల్టీ రాజేందర్, కళాశాల ఎన్‌సీసీ ఎయిర్ వింగ్ ఆఫీసర్లు పాణి, పవన్ ఇతర బోధనేతర సిబ్బంది రంజిత్ భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. మృతుడి కుటుంబాన్ని ఓదార్చారు. రంజిత్ కుమార్ స్వగ్రామమైన హుస్నాబాద్‌కు తరలించి అంత్యక్రియలను కుటుంబ సభ్యులు పూర్తిచేశారు.

నేడు బల్దియాలో ప్రజావాణి కార్యక్రమం

వరంగల్ కార్పొరేషన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : నగర ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు ప్రతీ వారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం సోమవారం జరుగనుందని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆమె వెల్లడించారు. ప్రజలు సమస్యలు వెల్లడించేందుకు ఉదయం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. ప్రజావాణిలో సంబంధిత అధికారులు బాధితుల ఫిర్యాదులు పరిష్కరించి తగిన పరిష్కారం చూపిస్తారని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే తెలిపారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

వడ్డేపల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ ఎస్వీఎస్ కాలనీ- కేయూ వంద ఫీట్ల రోడ్డులోని ఓ ప్రైవేటు సమావేశ మందిరంలో పరకాల సీఎస్ఐ పాఠశాలలో 1984-85 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. అప్పటి పాఠశాల హెచ్‌ఎం ఎంకేజే థామస్ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. 40ఏళ్ల కిందట పరకాల సీఎస్ఐ పాఠశాలలో విద్య నభ్యసించిన వారంతా ఎక్కడెక్కడో స్థిరపడి ఒకేచోట చేరి అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని ఆనంద డోలికల్లో తేలియాడారు. అప్పటి ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు నరిసింహ రామయ్య, డి.కోర్నెల్, పాల్, పీఈటీ జేమ్స్, అటెండర్ తిప్పపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలి

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజి వాకడే



మండిబజార్‌లో పన్నుల స్వీకరణను పరిశీలిస్తున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరం పన్నులు చెల్లించడానికి కేవలం వారం మాత్రమే మిగిలి ఉందని, ఇంటి, నల్లా పన్నులు చెల్లించడానికి ప్రజలు ముందుకు రావాలని సూచించారు. నగర ప్రజల సౌకర్యార్థం నగరంలో 10 ఈ-సేవా కేంద్రాలు సర్కిల్ కార్యాలయాలలో సిబ్బంది అందుబాటులో ఉన్నారని తెలిపారు. అంతేకాకుండా జీడబ్ల్యుఎంసీ యాప్ ద్వారా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి కూడా పన్నులు చెల్లించవచ్చని తెలిపారు. వరంగల్ పరిధిలోని రెసిడెన్షియల్, కమర్షియల్ పన్ను చెల్లింపుదారులు వెంటనే పన్నులు చెల్లించాలని, లేదంటే ఆస్తుల్ని జప్తు చేస్తామని కమిషనర్ హెచ్చరించారు.

పన్ను వసూళ్లపై కమిషనర్ ఆకస్మిక తనిఖీ

పన్నుల చెల్లింపు ప్రక్రియను బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదివారం నగరంలో పలుచోట్ల క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈనెల చివరి రోజు వరకు పన్నుల చెల్లింపుపై హైదరాబాద్ సీడీఎంఏ ఆదేశాల మేరకు పన్నులు చెల్లించవచ్చని కమిషనర్ సూచించారు. ఈ మేరకు వరంగల్ నగరంలోని మండిబజార్, వరంగల్ చౌరస్తా, స్టేషన్‌రోడ్డు, హంటర్‌రోడ్డు, కాజీపేట ప్రాంతాల్లో పన్నుల వసూళ్ల తీరుపై కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. 6 కాజీపేట పరిధిలో, 5 కాశిబుగ్గ పరిధిలో ప్రత్యేక బృందాలు పర్యటిస్తున్నాయని, వారి వద్ద కూడా బల్దియాకు సంబంధించిన ఇంటి, నల్లా పన్నులు చెల్లించవచ్చని అన్నారు. పన్నులు చెల్లించని బడా బకాయిదారులకు ఇప్పటికే రెడ్ నోటీసులు జారీ చేశామని, విస్మరిస్తే ఆస్తులు జప్తు చేస్తామన్నారు. కొందరు ఇండ్ల యజమానులు చాలా కాలంగా ఇంటి, నల్లా పన్నులు చెల్లించకుండా జాప్యం చేస్తున్నారని, వారికి రెడ్ నోటీసులు జారీచేసి ఆస్తులు జప్తు చేస్తామన్నారు. ప్రజలు బల్దియాకు సహకరించి నిర్దిష్ట గడువులోగా పన్నులు చెల్లించాలని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి, ఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, పన్నులు విభాగం అధికారి రామకృష్ణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఆర్‌ఐలు లింగమూర్తి, సొహెల్ పాల్గొన్నారు.

రంజాన్‌లో ముస్లింలకు ఇఫ్తార్ విందులు



దాసరి మురళీధర్‌రెడ్డి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి, హనుమకొండ

ముఖాముఖి

ఆంధ్రజ్యోతి: రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందులకు నిధులు మంజూరయ్యాయా?

అధికారి: రంజాన్ మాసంలో ముస్లింలకు ఇఫ్తార్ విందులను ఇచ్చేందుకు ప్రభుత్వం నిధులను మంజూరి చేసింది.

ఆంధ్రజ్యోతి: ఎన్ని మసీదులకు నిధులు మంజూరయ్యాయి?

అధికారి: వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని ఏడు మసీదులకు, పరకాల నియోజకవర్గంలోని మూడు మసీదులకు నిధులు మంజూరయ్యాయి. ఒక్కొక్క మసీదుకు మంజూరైన రూ.లక్షతో ఇఫ్తార్ విందును నిర్వహిస్తాం.

ఆంధ్రజ్యోతి: రంజాన్ కానుకలు మంజూరయ్యాయా?

అధికారి: ఇప్పటి వరకు హనుమకొండ జిల్లాకు రంజాన్ పర్వదినానికి ఎలాంటి కానుకలను ప్రభుత్వం మంజూరు చేయలేదు.

ఆంధ్రజ్యోతి: జిల్లాలో ఎన్ని మైనారిటీ గురుకుల పాఠశాలలున్నాయి?

అధికారి: హనుమకొండ జిల్లాలో 5 మైనారిటీ గురుకుల పాఠశాలలు ఉన్నాయి. ఇందులో హనుమకొండలో బాలికలకు 1, బాలురుకు 1, కాజీపేటలో బాలురకు 2, బాలికలకు 1, పరకాలలో బాలురకు 1 గురుకుల పాఠశాల ఉంది. మెనూ ప్రభుత్వ నిబంధన ప్రకారం అందుతోంది.

- వడ్డేపల్లి (ఆంధ్రజ్యోతి)

యువతకు ఉపాధి అవకాశాలు

రాంనగర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వేతర సంస్థల సహకారంతో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. నాయిని విశాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం కిషన్‌పుర వాగ్దేవి కళాశాలలో నిర్వహించిన మహిళా జాబ్‌మేళాకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా జాబ్‌మేళా నిర్వహించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న నాయిని గోదారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డితోపాటు ఉపాధి కల్పించేందుకు ముందుకొచ్చిన ఫాక్స్‌కాన్ సంస్థను ఎమ్మెల్యే అభినందించారు. ఫాక్స్‌కాన్ సంస్థ ప్రతినిధులు ఆనందం కుమార్, పరమేశ్, పార్వతి, వాగ్దేవికళాశాల చైర్మన్ దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సినారె పురస్కారం అందుకున్న అనురాధ



మంత్రి సంజయ్ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న అనురాధ

హనుమకొండ కల్చరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : సాహిత్యం, వ్యాఖ్యానం, విద్యారంగంలో విశేష కృషి చేస్తున్నందుకు గాను హనుమకొండ రెడ్డికాలనీకి చెందిన ఉపాధ్యాయిని, ప్రముఖ కవయిత్రి మెరుగు అనురాధ సినారె పురస్కారం అందుకున్నారు. ఆదివారం కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ చేతుల మీదుగా సినారె బాగ్భూషణ రాష్ట్రస్థాయి పురస్కారాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కళా వేదిక చైర్మన్ దాస్యం సేనాధిపతి, అధ్యక్షుడు అనుముల దయాకర్, ఎమ్మెల్సీలు మల్క కొమురయ్య, అంజిరెడ్డి, ఉదయ సాహితీ రాష్ట్ర అధ్యక్షుడు దాస్యం లక్ష్మయ్య, ఎర్రం రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు పరపతి సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

- అధ్యక్ష, కార్యదర్శులుగా తోట ప్రకాష్, రవికుమార్



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతనంగా ఎన్నికైన సంఘం సభ్యులు

హనుమకొండ చౌరస్తా, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ పద్మాక్షికాలనీ మున్నూరుకాపు పరపతి సంఘం నూతన కార్యవర్గం ఎన్నికలు జరిగాయి. హనుమకొండ పద్మాక్షి రోడ్డులోని మున్నూరుకాపు సంఘ భవనంలో ఆదివారం నిర్వహించిన 41వ వార్షిక సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తోట ప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా కె.రవికుమార్, కోశాధికారిగా బి.అశోక్, ఉపాధ్యక్షులుగా బండారి మహేందర్, సహాయ కార్యదర్శిగా పోలు లక్ష్మణ్, కార్యవర్గ సభ్యులుగా కె.శ్రీనివాస్, యాపశెట్టి లక్ష్మణ్, కె.మనోజ్‌కుమార్, ఎం.రాకేష్, ఎం.రేవంత్, ఆడిటర్‌గా జి.మధు నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో 10వ డివిజన్ కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు, గందె కృష్ణ, అంబటి కుమారస్వామి, పి.శ్రీనివాస్, కె.సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

200కు పైగా కోతుల పట్టివేత



కోతులను బోనులో బంధించిన దృశ్యం

హసన్‌పర్తి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 65వ డివిజన్ పరిధి ఎల్లాపూర్‌లో కోతుల బెడదకు చెక్ పెట్టేందుకు రంగం సిద్ధం చేసినట్లు స్థానిక కార్పొరేటర్ గుగులోతు దివ్యరాణిరాజునాయక్ తెలిపారు. ఇప్పటికే ఎల్లాపూర్ గ్రామంలో 200 కోతులను పట్టుకొని బోనులో బంధించినట్లు కార్పొరేటర్ వెల్లడించింది. సాధ్యమైనంత వరకు డివిజన్‌లో కోతుల బెడద లేకుండా చూసేందుకు కార్పొరేషన్ ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని తెలిపారు. ప్రస్తుతం కోతులతో పాటు పిచ్చికుక్కల బెడదతో డివిజన్‌ప్రజలు ఇబ్బందులుపడుతున్నట్లు దృష్టికి వచ్చిందని త్వరలోనే పిచ్చి కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కండలు పీకేస్తున్నాయ్..

- కాజీపేటలో కుక్కల బీభత్సం
- పట్టించుకోని మునిసిపల్ సిబ్బంది



కుక్కల దాడిలో గాయపడిన బషీరుద్దీన్

కాజీపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : కాజీపేటలో పగలు రాత్రి తేడా లేకుండా కుక్కలు సృష్టిస్తున్న బీభత్సంతో స్థానికులు వణికిపోతున్నారు. రైల్వే కాలనీ, విష్ణుపురి, సోమిడి, రహ్మత్‌నగర్ తదితర ప్రాంతాల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఆయా కాలనీలలో స్థానికులు, పిల్లలు బయటికి వెళ్లాలంటేజంకుతున్నారు. గతేడాదిలో రైల్వే కాలనీలో ఐదేళ్ల బాలుడిపై కుక్కలు దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విష్ణుపురి, రహ్మత్‌నగర్, సోమిడి వెంకటాద్రి నగర్‌లో ప్రతీ రోజు పదుల సంఖ్యలో స్థాని కులు కుక్క కాట్లకు గురవుతున్నారు. ఇలా నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా మునిసి పల్ సిబ్బంది పట్టించుకోవడం లేదు. ఎప్పు డో ఒకప్పుడు తూతూ మంత్రంగా కక్కల ను పట్టుకుని వెళ్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కండలు పీకేస్తున్నాయ్..

కాజీపేట రహ్మత్‌నగర్ మజీద్ వద్ద నమాజ్‌కు వెళ్లే వారిపై కుక్కలు ఎగబడు తున్నాయి. మూడు రోజుల కిందట అక్కడే నిలబడ్డ ఓ వ్యక్తిపై అకస్మాత్తుగా కుక్కలు దాడి చేయడంతో ఆ వ్యక్తి రాళ్లమీద పడ టంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. అదే ప్రాంతంలో పాల ప్యాకెట్‌కు వెళ్లే ఓ మహి ళపై కుక్కలు దాడిచేసి తీవ్ర గాయాలు చేశాయి. ఇదిలా ఉండగా బషీరుద్దీన్ అనే వృద్ధుడు నమాజ్‌కు వెళ్లి ఇంటికొచ్చే క్రమం లో కుక్కలు ఎగబడి కాళ్లకండలు పీకాయి. తీవ్ర గాయాలపాలైన బషీరుద్దీన్‌ను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. రంజాన్ మాసంలో ముస్లింలు మసీద్‌కు వెళ్తుంటారు. ప్రస్తుతం అలాంటిది ప్రస్తుతం కుక్కల దాడులతో నమాజ్‌కు వెళ్లాలంటే వణికిపో తున్నారు. మునిసిపల్ సిబ్బంది వెంటనే చొరవ చూపి కుక్కలను పట్టుకుని నగరానికి దూరంగా వదిలిపెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నాసిరకంగా 'స్మార్ట్' పనులు

- నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలు
- వాటర్ క్యూరింగ్ చేయడం లేదంటున్న నగరవాసులు



వంగపహాడ్‌లో నాసిరకంగా వేస్తున్న సీసీ రోడ్డు



భీమారంలో నాసిరకంగా వేసిన సీసీ రోడ్డు

హసన్‌పర్తి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో స్మార్ట్ రోడ్ల నిర్మాణం అస్తవ్యస్తంగా తయారైందని నగరవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మార్చితో గడువు ముగుస్తుందన్న నెపంతో అధికార పార్టీ నేతలతో కుమ్మక్కై స్మార్ సిటీ రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నాసిరకంగా పనులు చేస్తున్నారని స్థానిక ప్రజల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్మార్ట్ రోడ్లు వేసిన తరువాత కాంక్రీట్ పది కాలాల పాటు మన్నికతో ఉండాలంటే వాటర్ క్యూరింగ్ చేయాల్సి ఉండగా సదరు కాంట్రాక్టర్ అవేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే మీఇంటి ఎదుట రోడ్లపై మీరే వాటర్ క్యూరింగ్ చేసుకోవాలంటూ ఉచిత సలహా ఇస్తున్నట్లు ప్రజలు వాపోతున్నారు. ఇటీవల వంగపహాడ్‌లో సీసీ రోడ్ల నిర్మాణం కోసం స్థానిక ఎమ్మెల్యే ఓ ప్రాంతంలో శంకుస్థాపన చేస్తే కాంట్రాక్టర్ అది వదిలేసి మరో చోట సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజావసరాలు కలిగిన చోట సీసీ రోడ్డు నిర్మాణాలు చేపట్టి ప్రజాధనం వృథా కాకుండా చూడాలని ఉన్నతాధికారులను ప్రజలు కోరుతున్నారు.

బ్రిటీష్ పాలనను తలపిస్తున్న ప్రధాని మోదీ





కేయూలో భగత్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న పీడీఎస్‌యూ నేత కావ్య, కాజీపేటలో రక్తదానం చేస్తున్న ప్రకాశ్

కేయూ క్యాంపస్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : బ్రిటీష్ ప్రభుత్వాన్ని గడగడలాడించి ఉరికంబం ఎక్కిన భగత్‌సింగ్ త్యాగాలను విస్మరించి కేంద్రంలోని ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వ పెట్టుబడి, కార్పొరేట్ శక్తులకు వంతపాడుతోందని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నరసింహరావు, కేయూ పీడీఎస్‌యూ సెక్రటరీ వి.కావ్య ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం భగత్‌సింగ్, రాజ్‌గురూ, సుఖ్‌దేవ్‌ల 94వ వర్ధంతిని నిర్వహించారు. కేయూ ఫస్ట్‌గేటు, గర్ల్స్ హాస్టల్స్ వద్ద పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ ప్రధాన కార్యదర్శి వి.కావ్య, ఉపాధ్యక్షురాలు పి.అనూష, గణేశ్, వంశీ, సహాయ కార్యదర్శులు యాదగగిరి, చందన, కోశాధికారి సంగీత, వర్సిటీ నేతలు చారి, పెరియార్ మల్లేశ్, శ్రీజ, నరేశ్, సాధన, మనోజ్, నవీన్, అంజు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

20వ సారి రక్తదానం చేసిన పర్యావరణ కార్యకర్త

కాజీపేట: భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా కాజీపేటకు చెందిన పర్యావరణ కార్యకర్త ప్రకాశ్ ఆదివారం 20వ సారి రక్తదానం చేశారు. హనుమకొండ సుబేదారిలోని రెడ్‌క్రాస్ సొసైటీలో రక్తదానం చేశారు. అనంతరం ప్రకాశ్ మాట్లాడారు. వేసవిలో తలసేమియా బాధితులకు రక్తం ఎక్కువగా అవసరం ఉంటుందని, యువత ఈ విషయాన్ని గమనించి రక్త దానం చేయాలని పిలుపునిచ్చారు.

ముగ్గురికి డాక్టరేట్



కేయూ క్యాంపస్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ హిస్టరీ విభాగం పరిశోధకుడు వడ్డెపల్లి సాయిచరణ్ డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు శనివారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ డాక్టరేట్ ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సాయిచరణ్ 'మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ ఇన్ హైదరాబాద్ స్టేట్ (1853-1948)' అనే అంశంపై పరిశోధ న గ్రంథాన్ని సమర్పించినందుకు డాక్టరేట్ ప్రకటించారు. కేయూ హిస్టరీ అండ్ టూరిజం విభాగం ప్రొఫెసర్, డీన్, ప్రిన్సిపాల్ తాళ్లపల్లి మనోహర్ పర్యవేక్షణ లో పరిశోధన పూర్తిచేశారు. హుజూరాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రభు త్వ లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. ఖమ్మం జిల్లా బల్లెపల్లికి చెందిన సాయి చరణ్ ఖమ్మం, కోదాడలో ప్రాథమిక విద్యతోపాటు ఇంటర్, డిగ్రీ పూర్తి చే శారు. కేయూలో హిస్టరీలో ఎంఏ పూర్తి చేసి డాక్టరేట్ పొందారు.

జియాలజీలో సందీప్‌కుమార్‌కు..



కాకతీయ యూనివర్సిటీ జియాలజీ విభాగం పరిశోధకుడు కందకట్ల సందీప్‌కుమార్ డాక్టరేట్ సాధించారు. సందీప్‌కుమార్ 'పెట్రోలాజికల్ అండ్ జియో కెమికల్ స్టడీ ఆఫ్ కింబర్లైట్ మాగ్మాటిసమ్ ఇన్ ద ఈస్టర్న్ ధార్వార్ క్రేటాన్ ఆఫ్ పెనిన్సులార్ ఇండి యా విత్ స్పెషల్ రెఫరెన్స్ టూ రాయచూర్ కిం బర్లైట్ ఫీల్డ్ స్ప్రెడ్ ఎక్రాస్ కర్ణాటక అండ్ తెలంగాణ స్టేట్స్' అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించినందుకు డాక్టరేట్ ప్రకటించారు. కేయూ జియాలజీ విభాగం ప్రొఫెసర్ రాగి మల్లికార్జున్‌రెడ్డి పర్యవేక్షణలో పరిశో ధన పూర్తిచేశారు. నల్లబెల్లి మండలం నందిగామకు చెందిన సందీప్ కుమార్ పలు సదస్సుల్లో విలువైన పరిశోధన పత్రాలను ప్రచురించారు.

కెమిస్ట్రీలో మొహమ్మద్ ముఖీద్‌కు..




చైతన్య డీమ్డ్ టూ బీ యూనివర్సిటీ కెమిస్ట్రీ విభాగం పరిశోధకుడు మొహమ్మద్ ముఖీద్ డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు ఆదివారం చైతన్య డీమ్డ్ టు బీ వర్సిటీ 13వ స్నాతకోత్సవంలో అస్సాం ఎన్‌ఐపీ ఈ ఆర్ (నైపర్) డైరెక్టర్ డాక్టర్ యూఎస్‌ఎన్ మూర్తి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి చేతుల మీదుగా మొహమ్మద్ ముఖీద్ పట్టాను అందచేశారు. మొహమ్మద్ ముఖీద్ 'న్యూ కాటలిటిక్ సిస్టమ్ ఫర్ సీ-సీ అండ్ సీ హెటెరో ఆటమ్ బాండ్ ఫార్మేషన్ ' అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించి నందుకు డాక్టరే ట్ ప్రకటించారు. హనుమకొండ వడ్డెపల్లి ప్రాంతానికి చెందిన మొహ మ్మద్ ముఖీద్ హైదరాబాద్ దుండిగల్‌లోని మర్రి లక్ష్మ ణ్‌రెడ్డి కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. మొహమ్మద్ ముఖీద్ పలు సదస్సుల్లో విలువైన 6 పరిశోధన పత్రాలు, పెటెంట్‌ను కల్గి ఉన్నారు. సౌత్ అరేబియాలోని కింగ్ సౌద్ వర్సిటీ, అమెరికాలోని టెక్సాస్ డల్లాస్ వర్సిటీ సహకరంతో పరిశోధన పూర్తి చేశారు. డాక్టరేట్ సాధించిన మొహమ్మద్ ముఖీద్ తల్లిదండ్రులు మొహమ్మద్ సాధిక్, గౌసియా బేగంతో పాటు వీసీ శంకర్‌లింగం, స్వాతిక రెడ్డి, రవీందర్, డీన్లు, ఇతర అధికారులు అభినందించారు.

పేద ముదిరాజ్‌ల సంక్షేమమే ధ్యేయం



ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్‌ను సత్కరిస్తున్న ముదిరాజ్ సంఘాల నేతలు

వడ్డెపల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పేద ముదిరాజ్ కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను చేరవేసేందుకు తనవంతు కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కోఆపరేటివ్ సొసైటీస్ కార్పొరేషన్ చైర్మన్ బుర్ర జ్ఞానేశ్వర్ అన్నారు. చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన జ్ఞానేశ్వర్ తొలిసారిగా వరంగల్‌కు విచ్చేసిన సందర్భంగా వివిధ ముదిరాజ్ సంఘాల నాయకులు ఆయనను ఆదివారం ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌజ్‌లో మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ముదిరాజ్ సొసైటీల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ముదిరాజ్ కార్పొరేషన్‌కు ప్రభుత్వం నుంచి తగినన్ని నిధులు విడుదలయ్యేలా ముఖ్యమంత్రి, ప్రభుత్వ పెద్దలతో మాట్లాడతానన్నారు. అలాగే ముదిరాజ్ జర్నలిస్టుల సంక్షేమం కోసం కార్పొరేషన్ ఆధ్వర్యంలో చర్యలు తీసుకోవాలని ముదిరాజ్ జర్నలిస్టులు జ్ఞానేశ్వర్‌ను కోరారు. కార్యక్రమంలో మెపా నాయకులు పులి దేవేందర్, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పల్లెబోయిన అశోక్, పొన్నం రాజు, సీనియర్ హైకోర్టు అడ్వకేట్ డాక్టర్ వినోద్‌కుమార్, పులి రజనీకాంత్, మెపా నాయకులు డాక్టర్ కొత్తగట్టు శ్రీనివాస్, రేగుల మొగిలి, బీస రమేష్, పెండెం మధుసూదన్, పొన్నం రాజు, ముదిరాజ్ జర్నలిస్టు నాయకులు బొళ్ల అశోక్, డాక్టర్ పోతరవేని రాజన్న, కుమార్, రాజేంద్ర ప్రసాద్, వివిధ మత్స్యసహకార సంఘాల నేతలు జ్ఞానేశ్వర్‌కు ఘనంగా స్వాగత సత్కారం చేశారు.



పాఠకులు నాతో ప్రయాణం చేస్తారు

శాస్త్రీయ అంశాలను అందరికీ అర్థమయ్యే సులభమైన భాషలో చెప్పటం చాలా కష్టం. ముఖ్యంగా గురుత్వాకర్షణ శక్తి వంటి అంశాలను సులభతరంగా చెప్పటం చాలా కష్టం. ఇలాంటి కష్టమైన విషయాన్ని తనదైన రీతిలో పాఠకుల ముందుకు తీసుకువచ్చిన శాస్త్రవేత్త బ్రిటన్‌కు చెందిన క్లాడా రమ్. ఆమె రాసిన 'ది బ్యూటీ ఆఫ్ ఫాలింగ్: ఏ లైఫ్ ఇన్ పర్‌సూట్ ఆఫ్ గ్రావిటీ' పుస్తకం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఇటీవలే భారత దేశంలో పర్యటించిన క్లాడాతో 'నవ్య' ప్రత్యేక ఇంటర్వ్యూ...

గురుత్వాకర్షణ వంటి కష్టతరమైన అంశంపై సాహిత్యపరమైన పుస్తకం రాయటం ఎంత కష్టం?

ఈ పుస్తకం సామాన్య పాఠకులకు ఒక ప్రయాణం లాంటిది. నేను ఒక సిద్ధాంతం గురించి చెబితే వారు వినటమనేది జరుగుతూనే ఉంటుంది. కానీ దీనిలో పాఠకులు కూడా నాతో పాటే ప్రయాణం చేస్తారు. తమ చుట్టూ ఉన్న ప్రపంచాన్ని తమదైన దృష్టికోణం నుంచి చూస్తారు. అనుభూతి పొందగలుగుతారు.

భౌతిక శాస్త్రంలో మహిళా శాస్త్రవేత్తల సంఖ్య చాలా తక్కువ కదా. దీనికి కారణాలేమిటి?

శాస్త్రవేత్తలు రెండు రకాలుగా ఉంటారు. కొందరు సిద్ధాంతాలను ప్రతిపాదిస్తారు. కొందరు ప్రయోగాలు చేస్తారు. భౌతికశాస్త్ర పరిశోధనా రంగంలో మహిళల సంఖ్య చాలా తక్కువ. దీనికి కొన్ని కారణాలు ఉన్నాయి. డిగ్రీ స్థాయిలో చాలా మంది మహిళలు భౌతికశాస్త్రాన్ని చదువుతారు. యూనివర్సిటీకి వచ్చే సమయానికి వీరి సంఖ్య గణనీయంగా తగ్గిపోతుంది. ఇక పరిశోధన రంగంలోకి వచ్చే మహిళలు ఇంకా తక్కువగా ఉంటారు. ఇక్కడ ఇంకో విషయాన్ని కూడా చెప్పాలి. సైన్స్ అనేది చాలా క్లిష్టమైన విషయం కాదు. సిద్ధాంతాలను రాతిపై రాసి చెక్కరు. ఇదే విధంగా శాస్త్రవేత్తలనగానే- కళ్లజోడు పెట్టుకొని గంభీరంగా ఉండరు. ఇలాంటి రకరకాల అభిప్రాయాలు తొలగిపోతే సైన్స్‌కు చాలా మంచి జరుగుతుంది. అందుకే నేను పుస్తకాన్ని రాశాను. దీనిని చదివిన తర్వాత సైన్స్‌పై వారికి ఉన్న దృష్టి కోణం మారుతుందని భావిస్తున్నాను.

మీరు అనేక పతకాలు గెలిచిన స్విమ్మింగ్ ఛాంపియన్.. వ్యోమగామి కావటానికి శిక్షణ కూడా పొందారు. గురుత్వాకర్షణ శక్తి గురించి చెప్పమంటే మీరు ఏం చెబుతారు?

గురుత్వాకర్షణ శక్తి మనకు స్వేచ్ఛను ఇస్తుంది. ఒక క్షణం గురుత్వాకర్షణ శక్తే లేదనుకుందాం. అప్పుడు మనందరం ఎలా ఉండేవాళ్లం? తేలుతూ ఉండేవాళ్లం. ఎలా అయినా స్వేచ్ఛగా వెళ్లే శక్తి ఉండేది. ఈ స్వేచ్ఛను నేను వ్యక్తిగతంగా కూడా కోరుకుంటాను. ఇక్కడ ఒక ఆసక్తికరమైన విషయం చెబుతాను. చాలా మంది నన్ను... "మీరు ఈ విశ్వంపై ఎందుకు పరిశోధన చేస్తున్నారు? గురుత్వాకర్షణపై మీకున్న ఆసక్తి ఏమిటి?" అని అడుగుతూ ఉంటారు. నాకు విశ్వం.. గురుత్వాకర్షణ శక్తి కాకుండా మిగిలిన విషయాలన్నీ చాలా సంక్లిష్టంగా అనిపిస్తాయి. ఉదాహర ణకు బయాలజీని తీసుకుందాం. దీనిలో ప్రతి విషయం ఒక దానిపై మరొకటి ఆధారపడి ఉంటుంది. ఒక విషయాన్ని అధ్యయనం చేయాలంటే విగిలిన వాటి గురించి కూడా తెలుసుకోవాలి. గురుత్వాకర్షణ విషయంలో ఇలాంటి సమస్య ఉండదు. ఇది మన విశ్వానికి సంబంధించిన మౌలికమైన అంశం. దీనిపై పరిశోధనవల్ల అనేక లోతుపాతులు తెలుసుకోగలు గుతాను. ఉదాహరణకు మీరు ఒక విమానాన్ని నడుపుతున్నారనుకుందాం. విమానం ఇంజిన్‌ను స్టార్ట్ చేసే ముందు ఆలోచనలు ఒకలా ఉంటాయి. ఒక్కసారి ఆకాశంలోకి వెళ్లిన తర్వాత మొత్తం దృష్టంతా ఆకాశంపైనే ఉంటుంది. ఇతర ఆలోచనలు ఏవి రావు.

ఈ మధ్యకాలంలో ప్రాథమిక విజ్ఞాన శాస్త్ర పరిశోధనలకు ప్రాధాన్యం తగ్గింది. ఎక్కువ మంది ఐటీ, ఐటీ ఆధారిత సేవలవైపే మొగ్గు చూపుతున్నారు కదా.. దీనిపై మీ అభిప్రాయమేవిటి?

గతంలో మన సమాజంలో శాస్త్రవేత్తలకు ప్రత్యేకమైన స్థానం ఉండేది. ఇప్పుడు ప్రాధాన్యత తగ్గుతూ వస్తోంది. దీనికి కారణం ఎక్కువమంది ప్రజలకు దీర్ఘకాలిక పరిశోధనలకు ఉన్న అవసరంపై అవగాహన లేకపోవటమే! ఈ రోజు మానవుడు భూమిపై సురక్షితంగా నివసించటానికి అనేక లక్షల సంవత్సరాల పరిశోధనల ఫలితాలే కారణం. ఇప్పుడు అలాంటి పరిశోధనలు జరగకపోతే ఆ ప్రభావం భవిష్యత్ తరాలపై పడుతుంది. అది చాలా ప్రమాదకరం కూడా! మన జీవనశైలిని మెరుగుపరిచే కొత్త కొత్త టెక్నాలజీలు, అప్లికేషన్లు రావాలంటే... ప్రాథమిక స్థాయిలో కొన్ని పరిశోధనలు జరగాలి. అవి జరగకపోతే భవిష్యత్ కుంటుపడుతుంది.

• సివిఎల్ఎన్ ప్రసాద్

సాదా కుర్తాని స్టయిల్‌గా మార్చేద్దాం..!



ఒకే రంగులో ఉన్న సాదా కుర్తాలు ఎలాంటి శరీరాకృతి ఉన్నవారికైనా చక్కగా నప్పుతాయి. వీటిని మళ్లీ మళ్లీ వేసుకోవాలంటే మాత్రం ఇష్టంగా అనిపించదు. అందుకే సాదా కుర్తాని పలు కాంబినేషన్లతో స్టయిల్‌గా ఎలా మార్చాలో తెలుసుకుందాం.

- సాదా కుర్తాకి జతగా భారీగా ఎంబ్రాయిడరీ చేసిన షెరారా ధరిస్తే హుందాగా కనిపిస్తారు.
- ముదురు రంగు సాదా కుర్తా మీద పెద్ద ప్రింట్లు ఉన్న చున్నీ వేసుకుంటే బాగుంటుంది. జరీ వర్క్ ఉన్న దుపట్టా వేసుకున్నా అందంగా కనిపిస్తారు. చున్నీ లేదా దుపట్టాకు మ్యాచ్ అయ్యేలా పైజమా ఎంచుకుంటే డ్రెస్ చక్కగా ఉంటుంది.
- సాదా కుర్తాకి గుండ్రని మెడ కాకుండా మంచి డిజైన్ ఉండేలా చూసుకుంటే మంచి లుక్ వస్తుంది. హాల్టర్ నెక్, డీప్ వి నెక్ డిజైన్లు ప్రయత్నించవచ్చు. నెక్ డిజైన్ మీద కుందన్స్, అద్దాలు, రంగురంగుల పూసలు, మెరిసే రాళ్లు అమరిస్తే డ్రెస్ ఇంకాస్త రిచ్‌గా కనిపిస్తుంది.
- లేత రంగు కుర్తాకి ముదురు రంగు అంచుతో డిజైన్ చేసుకోవచ్చు. అంచుకి మ్యాచ్ అయ్యేలా సల్వార్, చున్నీ తెచ్చుకుని వేసుకుంటే గ్రాండ్ లుక్ వస్తుంది.
- ప్లెయిన్ కుర్తా మీద చక్కగా సూటయ్యే లెగ్గింగ్ వేసుకుని చెవులకు పెద్ద జుంకాలు లేదా ట్రెండింగ్‌లో ఉన్న ఇయర్ రింగ్స్ పెట్టుకుంటే ఫ్యాషన్‌గా కనిపిస్తారు.

మేని మెరుపులకు బ్రోకలీ

బ్రోకలీ తింటే ఆరోగ్యానికి మంచిదని తెలుసు. కానీ ఇది చర్మ సంరక్షణకు కూడా ఎంతో తోడ్పడుతుందని నిపుణులు చెబుతున్నారు. దీనిలోని యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, మినరల్స్... చర్మం మీద ముసలితనం గుర్తులను పోగొట్టి సహజ కాంతితో మెరిసేలా చేస్తాయని అంటున్నారు.

చర్మ ఆరోగ్యానికి...

- వయసు పెరుగుతున్నప్పుడు సహజంగానే చర్మం సాగే గుణాన్ని కోల్పోతుంది. దీంతో చర్మం కుంచించుకుపోయి ముడతలు ఏర్పడుతుంటాయి. వీటిని నివారించి చర్మం బిగుతుగా మారాలంటే కొల్లాజెన్ కావాలి. దీన్ని బ్రోకలీలోని సి విటమిన్ ఉత్పత్తి చేస్తుంది. అందుకే రెండు రోజులకు ఒకసారి బ్రోకలీని ఆహారంలో చేర్చుకోవడం మంచిది.
- బ్రోకొలీని తినడం వల్ల శరీరానికి సల్ఫోరాఫేన్ అనే యాంటీ ఆక్సిడెంట్ లభిస్తుంది. ఇది చర్మాన్ని ఆక్సీకరణ ఒత్తిడి, వాపుల నుంచి కాపాడుతుంది. చర్మ కణాలను నాశనం చేసే ఫ్రీ రాడికల్స్‌పై పోరాడుతుంది. బయటికి వెళ్లినప్పుడు ఎండలోని అతినీలలోహిత కిరణాల వల్ల చర్మానికి హాని కలగకుండా రక్షణ పొరలను ఏర్పరుస్తుంది.
- బ్రోకలీని తరచూ తింటూ ఉంటే శరీరానికి కావాల్సినంత ఎ విటమిన్ లభిస్తుంది. ఇది చర్మం మీద మృతకణాలను తొలగించి కొత్తవాటిని ఉత్పత్తి చేస్తుంది. చర్మం పొడిబారడాన్ని నివారిస్తుంది. దీంతో చర్మం తేమగా, మృదువుగా ప్రకాశిస్తుంది.



ముఖ సౌందర్యానికి...

- స్టవ్ మీద గిన్నె పెట్టి ఒక కప్పు బ్రోకలీ ముక్కలు వేసి తగినన్ని నీళ్లు పోసి మెత్తగా ఉడికించాలి. తరవాత ఈ మిశ్రమాన్ని చల్లార్చి చెంచాతో గుజ్జులా మెదపాలి. ఇందులో ఒక చెంచా తేనె వేసి కలపాలి. ఈ పేస్టుని ముఖమంతా పట్టించాలి. పావుగంటసేపు ఆరిన తరవాత ముఖాన్ని మంచినీళ్లతో శుభ్రం చేసుకోవాలి. ఇలా తరచూ చేస్తూ ఉంటే ముఖం మీద చర్మం తేమతో నిండి ఛాయగా మెరుస్తుంది. ఈ మిశ్రమంలో తేనెకు బదులు ఒక చెంచా ఓట్‌మీల్ వేసి కలిపి ముఖానికి రాస్తే దురద, మంట లాంటివి తగ్గుతాయి.
- ఒక గిన్నెలో రెండు చెంచాల బ్రోకలీ గింజల నూనె తీసుకోవాలి. దీన్ని వేళ్లతో అద్ది ముఖమంతా రాయాలి. నుదుటి మీద అలాగే కళ్లు, ముక్కు, పెదవుల చుట్టూ ఈ నూనెతో మర్దన చేయాలి. పది నిమిషాల తరవాత గోరువెచ్చని నీటితో ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. వారానికి ఒకసారి ఇలా చేస్తే ముఖం మీద ముడతలు తగ్గుతాయి.
- మిక్సీ గిన్నెలో అరకప్పు బ్రోకలీ మొలకలు వేసి ఒక కప్పు నీళ్లు పోసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని గిన్నెలోకి వడబోసి రసాన్ని సిద్ధం చేసుకోవాలి. ఇందులో దూది వుండను ముంచి దానితో ముఖమంతా అద్దాలి. పది నిమిషాలు ఆరాక చల్లని నీళ్లతో ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. ఇలా రోజూ చేస్తూ ఉంటే ముఖంమీద చర్మ రంధ్రాలు శుభ్రమవుతాయి. మొటిమలు, గుల్లలు రావు. మచ్చలు ఏవైనా ఉన్నాకూడా వెంటనే తగ్గిపోతాయి.
- బ్రోకలీని సాధ్యమైనంత చిన్న ముక్కలుగా తరగాలి. ఒక గిన్నెలో అరకప్పు బ్రోకలీ ముక్కలు, రెండు చెంచాల యోగర్ట్ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని వేళ్లతో తీసుకుని ముఖం మీద సున్నితంగా రుద్దాలి. ఇది స్క్రబ్బర్‌లా పనిచేసి ముఖం మీద పేరుకున్న మురికిని తొలగి స్తుంది. ముఖం మృదువుగా ప్రకాశ వంతంగా తయారవుతుంది.
- ఎండాకాలంలో బయటికి వెళ్లి ఇంటికి రాగానే ముఖం ఎర్రగా కమలడం లేదా నల్లగా మారడం చూస్తూ ఉంటాం. ఇలాంటప్పుడు బ్లెండర్‌లో కొన్ని బ్రోకలీ ముక్కలు, కొన్ని నీళ్లు పోసి బాగా బ్లెండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని ఐస్ ట్రేలో పోసి ఫ్రీజర్‌లో ఉంచి క్యూబ్స్ తయారు చేసుకోవాలి. ఈ క్యూబ్స్‌తో ముఖాన్ని రుద్దితే ఎర్రదనం లేదా నల్లదనం తగ్గి చల్లని అనుభూతి కలుగుతుంది.



మట్టి పాత్రలు మన్నికగా..!

వంట చేయడానికి మట్టి పాత్రలు ఉపయోగించడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. మట్టితో తయారు చేసిన పాత్రలు, కుండల మీద సన్నని రంధ్రాలు ఉంటాయి. వీటివల్ల ఆహారం నెమ్మదిగా ఉడుకుతుంది. దీంతో ఆహారంలోని పోషకాలు ఆవిరి కాకుండా ఉంటాయి. అంతేకాదు మట్టి పాత్రల్లో వండేటప్పుడు నూనె ఎక్కువగా అవసరం ఉండదు. ఇలా ఎన్నో ప్రయోజనాలను అందించే మట్టి పాత్రలు చాలాకాలం మన్నికగా ఉండాలంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. వాటి గురించి తెలుసుకుందాం.

- ముందుగా మట్టి పాత్రను రాత్రంతా నీళ్లలో నానబెట్టాలి. దీని వల్ల పాత్ర మీద ఉండే సన్నని రంధ్రాలు తేమను నింపుకుంటాయి. దీంతో మట్టి పాత్రను వేడి చేసినప్పుడు దానిమీద పగుళ్లు రావు.
- మట్టి పాత్రలో నీటిని నింపి స్టవ్ మీద పెట్టి చిన్న మంట మీద కొద్దిగా వేడి చేయాలి. తరవాత ఈ నీటిని పారబోసి పాత్రను వంటకు వాడుకుంటే చాలాకాలం మన్నికగా ఉంటుంది.
- మట్టి పాత్రలను పెద్ద మంట మీద పెట్టకూడదు. అలా పెడితే అవి ఎక్కువగా వేడెక్కి పగిలిపోతాయి. మంట ఎప్పుడూ మధ్య స్థాయి లేదా చిన్నగా ఉండాలి.
- మట్టి పాత్రల్లో వంట చేసేటప్పుడు వాటిలోని ఆహారాన్ని కలపడానికి స్టీల్ లేదా ఇనప గంటెలు వాడకూడదు. ఇవి వాడితే పాత్ర లోపలి భాగం దెబ్బతింటుంది. చెక్క లేదా సిలికాన్ గరిటెలు ఉపయోగించడం మంచిది.
- వంట పూర్తయిన తరవాత మట్టి పాత్రలను స్క్రబ్బర్‌తో మెల్లగా తోమాలి. ఎక్కువగా నీళ్లు పోస్తూ కడగాలి. ఏమాత్రం అశ్రద్ధ వహించినా పాత్రలు పగిలిపోతాయి. శుభ్రం చేసిన మట్టి పాత్రలను పలుచని గుడ్డతో తుడిచి గాలికి ఆరబెట్టాలి. తరవాత గుడ్డలో చుట్టి ఉంచితే వాటిపై దుమ్ము పడకుండా ఉంటుంది.



అపరాధా? బాధితురాలా?

ఉగ్రవాద సానుభూతిపరురాలిగా ముద్ర, వీసా రద్దు, వెంటపడుతున్న ప్రభుత్వ ఏజెన్సీలు...
ఊపిరి సలపనివ్వనంత వేగంగా తరుముతున్న సంఘటనల నేపథ్యంలో... భారతీయ విద్యార్థిని రంజనీ శ్రీనివాసన్ స్వీయ బహిష్కరణ విధించుకొని, అమెరికా నుంచి కెనడాకు పరుగులెత్తారు. ఆమె అపరాధి అని చట్ట సంస్థలు చెబుతూంటే... తను బాధితురాలినంటున్నారు రంజని. వీటిలో నిజం ఏదైనా... ప్రస్తుతం ఆమె భవిష్యత్తు అనిశ్చితిలో ఉంది.

థ్రిల్లర్ సినిమాను తలపిస్తున్న రంజనీ శ్రీనివాసన్ కథలో తాజా పరిణామాల వెనుక... ఓ ఫ్లాష్‌బ్యాక్ ఉంది. పాలస్తీనాకు అనుకూలంగా న్యూయార్క్‌లోని కొలంబియా యూనివర్సిటీ విద్యార్థులు కొందరు నిరుడు ఏప్రిల్‌లో ఆందోళనలు చేపట్టి, క్యాంపస్‌లోని హామిల్టన్ హాల్‌ను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. తమతో ఘర్షణకు దిగిన ఆందోళనకారులను పోలీసులు అరెస్ట్ చేశారు. రంజనిని కూడా యూనివర్సిటీ మైదానం సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. "నేను ఆ ఆందోళనలో పాల్గొనలేదు. క్యాంపస్‌లోని నా స్నేహితులను కలుసుకొని, తిరిగి నా అపార్ట్‌మెంట్‌కు వెళ్తూ వీధుల్లో ఉన్న నిరసనకారుల మధ్య చిక్కుకున్నాను. నన్ను అన్యాయంగా అరెస్ట్ చేశారు. ఆ నిరసనలకు నాకు ఏ సంబంధం లేదు" అని ఆమె స్పష్టం చేశారు. కాగా, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారని, సంఘటన స్థలం నుంచి వెళ్ళిపోవాలని హెచ్చరించినా పట్టించుకోలేదనీ ఆరోపిస్తూ రెండు సమన్లను పోలీసులు ఆమెకు జారీ చేశారు. అయితే ఆ కేసును న్యాయస్థానం డిస్మిస్ చేసింది. క్రిమినల్ రికార్డుల్లో కూడా ఆ వివరాలు నమోదు కాలేదని రంజని చెబుతున్నారు. హామిల్టన్ హాల్‌ను విద్యార్థులు ఆక్రమించిన సంఘటనతో రంజనికి సంబంధం లేకపోవచ్చు కానీ... అంతకు ముందు కొన్ని ఆందోళనల్లో ఆమె పాల్గొన్నారు. గాజాలో మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందంటూ సోషల్ మీడియాలో వచ్చిన కొన్ని పోస్టుల్ని షేర్ చెయ్యడం, లైక్ చెయ్యడంతో పాటు... 2023లో పాలస్తీనా విముక్తికి మద్దతుగా 'సొసైటీ ఆఫ్ ఆర్కిటెక్చరల్ హిస్టారియన్స్' విడుదల చేసిన బహిరంగ లేఖ మీద సంతకం కూడా చేశారు. ఈ విషయాలను ఆమె తరఫు న్యాయవాదులు సైతం ధ్రువీకరించారు.



"చెన్నైలోని యుఎస్ కాన్సులేట్ నుంచి నాకు ఒక ఇ-మెయిల్ వచ్చింది. నా వీసా రద్దు గురించి తెలియజేస్తూ నన్ను 'వీసాకు అనర్హురాలుగా చేసే కొత్త సమాచారం' వెలుగులోకి వచ్చిందని తెలిపింది" అని చెప్పారు రంజని.

ఆ వివరాలు దాచినందుకు...

తమిళనాడుకు చెందిన రంజని 2016లో హార్వర్డ్ యూనివర్సిటీలో గ్రాడ్యుయేట్ విద్యార్థిగా ఎఫ్-1 వీసాపై అమెరికాకు వచ్చారు. ప్రస్తుతం కొలంబియా యూనివర్సిటీలో... అర్బన్ ప్లానింగ్‌లో డాక్టోరల్ డిగ్రీ చేస్తున్నారు. హామిల్టన్ హాల్ కేసు నుంచి తనకు విముక్తి లభించిన కొద్ది రోజులకు స్టూడెంట్ వీసాను ఆమె పునరుద్ధరించుకున్నారు. తదనంతరం అధికారంలోకి వచ్చిన ట్రంప్ ప్రభుత్వం... కొలంబియా యూనివర్సిటీలో పాలస్తీనా అనుకూల విద్యార్థుల మీద చర్యలకు శ్రీకారం చుట్టింది. ఈ ఏడాది మార్చి 5న రంజని వీసాను 'యుఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్' రద్దు చేసింది. "చెన్నైలోని యుఎస్ కాన్సులేట్ నుంచి నాకు ఒక ఇ-మెయిల్ వచ్చింది. నా వీసా రద్దు గురించి తెలియజేస్తూ నన్ను 'వీసాకు అనర్హురాలుగా చేసే కొత్త సమాచారం' వెలుగులోకి వచ్చిందని తెలిపింది" అని చెప్పారు రంజని. తన స్టూడెంట్ వీసాను పునరుద్ధరించుకొనే సమయంలో... పాత అరెస్టు, రెండు సమన్ల గురించి ప్రస్తావించకుండా దాచినందుకు, హింసను, ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నందుకు ఆమె వీసాను రద్దు చేస్తున్నట్టు 'యుఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ' ఒక ప్రకటన జారీ చేసింది. ఆమెపై ఉగ్రవాదులకు అనుకూలవాదిగా ముద్ర వేస్తూ, నిషేధిత ఉగ్రవాద సంస్థ హమాస్‌కు మద్దతుగా కార్యకలాపాల్లో పాల్గొన్నట్టు పేర్కొంది. గందరగోళానికి గురైన రంజని... యూనివర్సిటీలోని అంతర్జాతీయ విద్యార్థుల కేంద్రం ప్రతినిధులను కలిశారు. ఆమె అమెరికాలో ఉన్నంతకాలం విద్యను కొనసాగించవచ్చని వారు తెలిపారు. రెండు రోజుల అనంతరం... కొలంబియా యూనివర్సిటీ నుంచి ఆమెకు ఒక ఇ-మెయిల్ వచ్చింది. ఆమె వీసాను రద్దు చేసినట్టు అధికారిక సమాచారం అందిందనీ, ఈ క్రమంలో యూనివర్సిటీ నుంచి ఆమెను తొలగిస్తున్నామనీ, విద్యార్థినిగా ఆమెకు ఇచ్చిన వసతిని ఖాళీ చేయాలని అందులో పేర్కొన్నారు.

జీవితం తల్లకిందులు...

ఒకవైపు ఇవి కొనసాగుతూండగా.. మరోవైపు మార్చి 7న రంజని నివసిస్తున్న అపార్ట్‌మెంట్‌కు ముగ్గురు ఫెడరల్ ఇమ్మిగ్రేషన్ ఏజెంట్లు వచ్చారు. రంజనితో కలిసి అక్కడ నివసిస్తున్న మరో విద్యార్థినితో తాము పోలీసులమని చెప్పారు. గుర్తింపు కార్డులు చూపించాలని ఆమె కోరడంతో వాళ్ళు కొద్దిసేపు వాదించి వెళ్ళిపోయారు. ఆ సమయంలో రంజని ఆ అపార్ట్‌మెంట్‌లోనే ఉన్నారు. పరిస్థితి అర్థం చేసుకున్న ఆమె తక్షణం ఆ నివాసాన్ని ఖాళీ చేసి, వేరే మిత్రుల దగ్గర తలదాచుకున్నారు. మరికొన్ని గంటల్లోనే హమాస్ మద్దతుదారుడిగా పేరుపడిన మరో విద్యార్థి మహమ్మద్ ఖలీల్‌ను ఇమ్మిగ్రేషన్ అధికారులు అరెస్ట్ చేశారు. పలుసార్లు రంజని అపార్ట్‌మెంట్‌కు ఫెడరల్ ఏజెంట్లు వస్తూనే ఉన్నారు. తదుపరి వంతు తనదేనని గ్రహించిన రంజని... ప్రభుత్వం రూపొందించిన 'సిబిపి యాప్'ను ఆశ్రయించారు. అమెరికాలో అనుమతి లేకుండా ఉంటున్నవారు చట్టపరమైన చర్యలను ఎదుర్కోవడానికి ముందే... స్వీయ బహిష్కరణ (సెల్ఫ్ డిపోర్ట్)ను ఎంచుకొని, స్వచ్ఛందంగా అమెరికా వదిలి వెళ్ళడానికి ఈ యాప్ వీలు కలిగిస్తుంది. దాన్ని ఉపయోగించుకున్న రంజని... కెనడాకు పయనమయ్యారు. జ్యుడీషియల్ వారెంట్‌తో ఆమె అపార్ట్‌మెంట్‌కు వెళ్ళిన అధికారులకు ఈ సంగతి ఆలస్యంగా తెలిసింది. ఆ తరువాత... న్యూయార్క్‌లోని లాగార్డియా విమానాశ్రయం నుంచి ఆమె నిష్క్రమిస్తున్న దృశ్యాలను అధికారులు మీడియాకు విడుదల చేశారు. ఇది జరిగిన రెండు రోజుల తరువాత ఒక ఆంగ్ల పత్రికకు రంజని ఇంటర్వ్యూ ఇస్తూ "అక్కడ వాతావరణం చాలా ఉద్రిక్తంగా, ప్రమాదకరంగా కనిపించింది. అందుకే వేగంగా నిర్ణయం తీసుకున్నాను. అయిదేళ్ళ నుంచి కొలంబియా యూనివర్సిటీలో చదువుతున్నాను. ఈ ఏడాది డిగ్రీ పూర్తి చెయ్యాల్సి ఉంది. ఇదంతా నేను తప్పు చెయ్యడంవల్ల జరిగింది కాదు, నా అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తపరిచే హక్కును ఉపయోగించుకోవడం వల్ల జరిగింది. ఇప్పుడు నేను బాధితురాలిని. నా వీసాను రద్దు చెయ్యడంతో నా జీవితం తల్లకిందులయింది. డిగ్రీ పూర్తి చేస్తాననే ఆశ కనిపించడం లేదు. అంతా అనిశ్చితిగా ఉంది" అని చెప్పారు. '37 ఏళ్ళ రంజని భవిష్యత్తులో ఏం చెయ్యబోతున్నారు? స్వదేశానికి తిరిగి వస్తారా?' అనే ప్రశ్నలకు... ప్రస్తుతానికి ఆమె దగ్గర కూడా స్పష్టమైన సమాధానాలు లేవు.

దిక్సూచి
DIKSUCHI



ఉమ్మడి ప్రిపరేషన్ బెస్ట్

ఇంటర్ పరీక్షలు పూర్తయ్యాయి. పోటీ పరీక్షలు మళ్లీ మొదలయ్యాయి. ఎంపీసీ విద్యార్థులు ఏప్రిల్ మొదటి వారంలో జేఈఈ మెయిన్ రెండో సెషన్‌కి హాజరు కావాల్సి ఉంది. తరవాత మేలో ఎంసెట్ పరీక్ష రాయాలి. జేఈఈకి దాదాపుగా 13.5 లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా జనవరి సెషన్‌కి దాదాపుగా 11 లక్షల మంది హాజరయ్యారు. వీటి ఫలితాలు కూడా వెల్లడయ్యాయి. అదే సమయంలో రెండో సెషన్ రిజిస్ట్రేషన్ కూడా పూర్తయింది.

ఇంటర్ పరీక్షల తరవాత జేఈఈ రాసే విద్యార్థులకు సరిగ్గా రెండువారాల సమయం కూడా లేదు. అలాగే ఎంసెట్ పరీక్ష తెలంగాణలో మే 2 నుంచి 5 తేదీ వరకు జరగనుంది. ఆంధ్రప్రదేశ్‌లో అయితే మే 21 నుంచి 27 వరకు నిర్వహిస్తున్నారు. జేఈఈ, ఎంసెట్ రెండు ఎంట్రెన్స్‌లను దృష్టిలో పెట్టుకుని ఎలా సన్నద్ధం కావాలో చూద్దాం. సమయం తక్కువగా ఉంది కాబట్టి జేఈఈ విద్యార్థులు వెయిటేజీకి అనుగుణంగా చాప్టర్ల వారీగా రివిజన్‌ను ప్లాన్ చేయాలి.

- ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల నుంచి ముఖ్యమైన డెఫినేషన్స్, ఫార్ములాలు అండర్‌లైన్ చేసుకోవాలి. పైన పేర్కొన్న చాప్టర్ల ఆధారంగా ఈ కాన్సెప్టులను రోజూ పునశ్చరణ చేయాలి.
- రోజుకు రెండు చాప్టర్ల చొప్పున మాక్‌టెస్టులు రాయాలి. ఇవి గత జేఈఈ టెస్టుల నుంచి అయితే ఇంకా మంచిది. ప్రతీ పరీక్షలో మెరుగుదల ఉండాలంటే నెగెటివ్ మార్కులు తగ్గుతూ ఉండాలి. గెస్ వర్క్‌ను పూర్తిగా మానేయాలి.
- పరీక్షలో ప్రతీ సబ్జెక్టుకు గంట మాత్రమే సమయం కేటాయించాలి. మేథ్స్‌లో ప్రశ్నలు చాలా లెంథీగా ఉంటున్నాయి. అక్కడే సమయ పాలన చాలా అవసరం.

మేథ్స్ :	
కాలిక్యులస్	35 శాతం,
ఆల్జీబ్రా	25 శాతం,
కోఆర్డినేట్ జామెట్రీ	20 శాతం,
వెక్టార్స్ 3డి	15 శాతం
ప్రాబబిలిటీ	5శాతం
ఫిజిక్స్ :	
మెకానిక్స్	30 శాతం
ఎలక్ట్రోడైనమిక్స్	25 శాతం
ఆప్టిక్స్ అండ్ మోడ్రన్ ఫిజిక్స్	20 శాతం
థర్మోడైనమిక్స్	15 శాతం
వేవ్స్ అండ్ ఆస్లేషన్స్	10 శాతం
కెమిస్ట్రీ :	
ఫిజికల్ కెమిస్ట్రీ	35 శాతం
ఇన్‌ఆర్గానిక్ కెమిస్ట్రీ	30 శాతం
ఆర్గానిక్ కెమిస్ట్రీ(బయోమాలిక్యుల్స్)	35 శాతం

- టైమ్ మేనేజ్‌మెంట్ కోసం ప్రతీ ప్రశ్నకు నిర్దుష్టంగా రెండు నుంచి మూడు నిమిషాలు మాత్రమే కేటాయించుకోవాలి. కాలిక్యులేషన్స్‌లో ఎక్కువ సమయం వృథా చేయకూడదు.
- మీకు కాన్ఫిడెన్స్ ఉన్న చాప్టర్లపై ఎక్కువ శ్రద్ధ పెట్టండి. ప్రస్తుతం ఉన్న సమయం దృష్ట్యా మీరు వీక్‌గా ఉన్న చాప్టర్లను వాటి వెయిటేజీ ఆధారంగా వదిలిపెట్టడమే మంచిది.

చాప్టర్ల వారీగా ఎంసెట్ ప్రణాళిక

తెలంగాణలో ఎంసెట్‌కు ఇప్పుడు సరిగ్గా 40 రోజుల సమయం ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో దాదాపుగా రెండు నెలల సమయం ఉంది. కేవలం ఎంసెట్ మాత్రమే రాయాలనుకునే విద్యార్థులు అందుకు అనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి. మొదటి రోజు నుంచి వెయిటేజీ ఆధారంగా చదవడం చేయాలి. జేఈఈ తరవాత ఎంసెట్ రాయాలనుకునే విద్యార్థులకు టీఎస్‌లో కేవలం 30 రోజులు, ఏపీలో 50 రోజుల సమయం మాత్రమే ఉంటుంది. వీరు రాపిడ్ షెడ్యూల్ సిద్ధం చేసుకోవాలి.

- జేఈఈ మెయిన్‌తో పోలిస్తే ఎంసెట్‌లో 25 నుంచి 30 శాతం ఎక్కువ సిలబస్ ఉంటుంది. ఈ చాప్టర్లను పూర్తిగా పునఃశ్చరణ చేయాల్సిందే.
- జేఈఈ మెయిన్, ఎంసెట్ పరీక్ష ఏదైనా కాన్సెప్టులను ఎన్‌సీఈఆర్‌టీ చాప్టర్ల నుంచే రివైజ్ చేయాలి.
- వెయిటేజీ ఆధారంగా ముఖ్యమైన చాప్టర్లను చదవండి.
- జేఈఈతో పోలిస్తే ఎంసెట్‌లో ఒక్కో ప్రశ్నకు కేటాయించిన సమయం తక్కువ. ఒక నిమిషంలో ఒక ప్రశ్నను పూరించాల్సి ఉంటుంది. కాబట్టి కాలిక్యులేషన్స్‌తో సమయం వృథా చేయవద్దు.
- ఎంసెట్‌లో నెగెటివ్ మార్కులు లేనందున, ఆప్షన్‌కు అనుగుణంగా గెస్ వర్క్ చేయవచ్చు.
- గత ముప్పై సంవత్సరాల నుంచి వచ్చిన ప్రశ్నపత్రాలను తప్పనిసరిగా రివైజ్ చేయండి. ఎంసెట్‌లో రిపీటెడ్‌గా ప్రశ్నలు వచ్చే అవకాశం ఎక్కువ.
- ప్రతీ రోజు మాక్‌టెస్ట్ రాయండి. జేఈఈతో పోలిస్తే ప్రశ్నలు ఎంసెట్‌లో సులువుగా ఉంటాయి. ఎక్కువ ప్రాక్టీసు చేస్తే నిర్ణీత సమయంలోనే నిర్దుష్ట సమయంలో పేపర్‌ను పూర్తి చేయవచ్చు.
- ఒక వేళ నిమిషంలో ఆ ప్రశ్న పూర్తి కావడం లేదు అనుకుంటే ఈ ప్రశ్నను వదిలేయండి. చివర్లో సమయం మిగిలితే వీటికి ఉపయోగించవచ్చు.
- అన్నింటికన్నా ముఖ్యం ఈ కొద్దికాలం సోషల్ మీడియాతో పాటు చదువు నుంచి దృష్టి మళ్లించే ఇతర విషయాలకు దూరంగా ఉండడం అవసరం.
- చదువుతోపాటు ఆరోగ్యంపై కూడా దృష్టిపెట్టాలి. పోషక ఆహారం, వ్యాయామం, సరైన అవసరం. అప్పుడే మెదడు చురుకుగా పనిచేస్తుంది.



డా.పవన్ కుమార్ కాసు
సంజీవనీ ఐఐటీ అకాడమి

పాలిసెట్ 2025



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రవేశాలకు ఉద్దేశించి పాలిసెట్ 2025 నోటిఫికేషన్లు వెలువడ్డాయి.

తెలంగాణ సెట్

తెలంగాణలోని పాలిటెక్నిక్ సీట్ల భర్తీకి మే 13న నిర్వహించే ఎంట్రెన్స్‌కు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం అయింది. ఇంజనీరింగ్, ఇతర వృత్తి విద్యా కోర్సుల తరహాలోనే రాష్ట్రంలోని పాలిటెక్నిక్ సీట్లన్నీ స్థానిక విద్యార్థులకు కేటాయించనున్నారు. మొత్తం సీట్లన్నీ కన్వీనర్ సీట్లు మాత్రమే. 85 శాతం సీట్లు స్థానికులకు, 15 శాతం స్థానికేతరులకు కేటాయించారు. అంటే నాలుగో తరగతి నుంచి పదో తరగతి వరకు ఉన్న ఏడేళ్లలో నాలుగేళ్లు తెలంగాణలో చదివితే స్థానికులుగా పరిగణిస్తారు. స్థానికేతర కోటా అంటే పదేళ్లపాటు తెలంగాణ రాష్ట్రంలో నివసించిన వారి పిల్లలు, తెలంగాణలో పనిచేస్తున్న ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగుల పిల్లలకు కేటాయిస్తారు.

ఫీజు : ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు దరఖాస్తు ఫీజు రూ.250/-, ఇతరులకు రూ.500/-
చివరి తేదీ: 2025 ఏప్రిల్ 19
(రూ.100/- ఆలస్య రుసుముతో ఏప్రిల్ 21, రూ.300/- ఆలస్య రుసుముతో ఏప్రిల్ 23 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.
ప్రవేశ పరీక్ష: 2025 మే 13
ఫలితాలు : 2025 జూన్
వెబ్‌సైట్ : https://polycet.sbtet.telangana.gov.in/

ఏపీ సెట్

ఆంధ్రప్రదేశ్ పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్ల కోసం ఏపీ పాలిసెట్ 2025 నోటిఫికేషన్ వెలువడింది. పదో తరగతి అర్హత ఉన్న విద్యార్థినీ, విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. పరీక్ష మాత్రం ఆఫ్‌లైన్ మోడ్‌లో జరుగుతుంది. ఇది పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. ప్రశ్న పత్రం మొత్తం 120 మార్కులకు ఉంటుంది. రెండు గంటల్లో దీనికి సమాధానాలు గుర్తించాలి. లెక్కల్లో 50 ప్రశ్నలు, ఫిజిక్స్‌లో 40 ప్రశ్నలు, కెమిస్ట్రీలో 30 ప్రశ్నలు ఉంటాయి.

ఫీజు: ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.400/-
ఎస్సీ,ఎస్టీ విద్యార్థులకు రూ.100/-
చివరి తేదీ: 2025 ఏప్రిల్ 15
ప్రవేశ పరీక్ష : 2025 ఏప్రిల్ 30
ఫలితాలు : 2025 మే 10(ఉజ్జాయింపు తేదీ)
వయస్సు : ఎలాంటి వయోపరిమితి లేదు.
వెబ్‌సైట్ : https://polycetap.nic.in/

SCHOLARSHIP ALERT

Alstom India Scholarship : Phase-III

Description: Alstom India is offering this scholarship with an aim to provide financial support to students across India to help them pursue their higher education and prevent them from dropping out.

Eligibility: Students studying in any year of ITI/Diploma, general graduation, or professional graduation in STEM courses for FY 2024-25 can apply. Applicants must have secured at least 60% marks in their previous academic year/semester. The annual family income of the applicants must be less than or equal to INR 6,00,000 from all sources. The scholarship is open to students studying in locations such as Coimbatore (Tamil Nadu), Madhepura (Bihar), Sri City (Andhra Pradesh), or Vadodara (Gujarat) at specified colleges.

Prizes & Rewards: Up to INR 75,000 (one-time)
Last Date to Apply: 04-05-2025
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/AISDG8

South Asia Postgraduate Excellence Award



Description: South Asia Postgraduate Excellence Award, 2025 is offered by the University of Nottingham. It aims to assist high-achieving international students from South Asia by covering a portion of their full-time Master's tuition fees at the university.

Eligibility: Open to residents of specific South Asian countries including India. Applicants must be classified as an overseas student for fee purposes. They must hold an offer to pursue full-time Masterâ ™s program for the academic session 2025-26.

Prizes & Rewards: Up to Â£8,000 (approx. â,¹8,51,016) towards tuition fees.
Last Date to Apply : 14-05-2025
Application mode : Online applications only
Short Url: www.b4s.in/aj/SAPE1

SBIF Asha Scholarship Program

Description: The SBIF Asha Scholarship Program for Overseas Education Students, one of India's largest scholarship programs, is an initiative of the SBI Foundation under its education vertical - Integrated Learning Mission (ILM). This scholarship aims to provide financial assistance to meritorious students from low-income families across India, ensuring the continuity of their education.


Eligibility: Open to Indian students belonging to SC and ST categories pursuing a masterâ ™s or postgraduate course (any year) at a premier university or college outside India. They should have secured at least 75% marks or above in their previous academic year, with a gross annual family income of up to INR 6,00,000.

Prizes & Rewards: Up to INR 20,00,000 or 50% of course-related expenses (whichever is less)
Last Date to Apply: 31-03-2025
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/SBIFS12

buddy4study.com

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

శ్రీలంకలో పాట చిత్రీకరణ



విజయ్ దేవరకొండ హీరోగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న పాన్ ఇండియా చిత్రం 'కింగ్‌డమ్'. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మాతలు. ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో మే 30న విడుదల కానుంది. ఈ సినిమాలోని ఓ పాట చిత్రీకరణ కోసం విజయ్ దేవరకొండ శ్రీలంక వెళ్లారు. ఈ షెడ్యూల్ వారం రోజుల పాటు కొనసాగుతుంది. కాగా, విజయ్ దేవర కొండ ఎయిర్‌పోర్ట్ ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.

జపాన్‌లో దేవర

జూనియర్ ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో వచ్చిన పాన్ ఇండియా చిత్రం 'దేవర' ఘన విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. జపాన్‌లో ఈనెల 28న విడుదల చేస్తున్నారు. ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు అక్కడి ప్రేక్షకులతో కలసి 'దేవర' చూసేందుకు ఎన్టీఆర్ జపాన్ వెళ్లారు. భార్య ప్రణతితో కలసి



ఎయిర్‌పోర్టులో కనిపించారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కాగా, ఎన్టీఆర్ ప్రస్తుతం ప్రశాంత్ నీల్ చిత్రంలో, బాలీవుడ్ సినిమా 'వార్-2'లో నటిస్తున్నారు. 'వార్-2' ఆగస్టు 14న థియేటర్లలో విడుదలవుతోంది.



ఈ సినిమాలో నటించడం గౌరవంగా భావిస్తున్నా


- ఆస్ట్రేలియా క్రికెటర్ డేవిడ్ వార్నర్

నితిన్, శ్రీలీల జంటగా వెంకీ కుడుముల దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'రాబిన్ హుడ్'. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై వై.రవిశంకర్, నవీన్ ఎర్నేని నిర్మించారు. ఈనెల 28న థియేటర్లలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్, ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా విచ్చేసిన ఆస్ట్రేలియా స్టార్ క్రికెటర్ డేవిడ్ వార్నర్ మాట్లాడుతూ 'ఈ సినిమాలో నటించడం ఒక గౌరవంగా భావిస్తున్నా. నన్ను మీ కుటుంబ సభ్యుడిగా చూస్తున్నందుకు ఆనందంగా ఉంది. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది' అని అన్నారు. హీరో నితిన్ మాట్లాడుతూ 'ఈ సినిమాపై చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాను. శ్రీలీలతో నాకు ఇది రెండో చిత్రం. మా ఇద్దరికీ హిట్ పెయిర్ అనే పేరు వస్తుంది' అని అన్నారు. హీరోయిన్ శ్రీలీల మాట్లాడుతూ 'నేను అనుకోకుండా చేసిన ఈ సినిమా అనుకున్న దానికంటే చాలా అద్భుతంగా వచ్చింది' అని చెప్పారు. చిత్ర దర్శకుడు వెంకీ కుడుముల మాట్లాడుతూ 'డేవిడ్ వార్నర్ క్యారెక్టర్‌లో చాలా సర్‌ప్రైజ్ ఉంటుంది. మార్చి 28న మీ అందరినీ తప్పకుండా ఎంటర్‌టైన్ చేస్తాం' అని అన్నారు. నిర్మాత వై.రవి శంకర్ మాట్లాడుతూ 'ఈ సినిమాలో నవ్వులతోపాటు మంచి కథ కూడా ఉంటుంది. కమర్షియల్ ఎలిమెంట్స్ అన్నీ ఉన్నాయి. సినిమా సూపర్ డూపర్ హిట్ పక్కా' అని చెప్పారు. మరో నిర్మాత నవీన్ ఎర్నేని మాట్లాడుతూ 'ఇది పూర్తిగా కుటుంబ వినోదాత్మక చిత్రం. కుటుంబ సమేతంగా చూసి ఎంజాయ్ చేయవచ్చు' అని అన్నారు. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ 'మైత్రీ మూవీస్ నా సొంత సంస్థలాంటిది. దర్శకుడు సినిమాను అద్భుతంగా తెరకెక్కించాడు. నితిన్‌కు నెక్స్ట్ లెవెల్ విజయం ఇచ్చే చిత్రమిది. చాలా ప్రేమతో తీసిన ఈ చిత్రాన్ని ఆదరించండి' అని కోరారు. కేతిక శర్మ మాట్లాడుతూ 'అదిదా సర్‌ప్రైజు పాట నిజంగా అదిరిపోతుంది' అని అన్నారు.



ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్) 8వ తెలుగు సంబరాలు ఈవెంట్‌కు సిద్ధమవుతోంది. జూలై 4వ తేదీ నుంచి 6వ తేదీ వరకు ఈ ఉత్సవాలు అమెరికాలోని టంపాలో జరగనున్నాయి. తాజాగా హైదరాబాద్‌లో నాట్స్ 8వ తెలుగు సంబరాలు కర్టెన్ రైజర్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలుగు సంబరాలు కాన్ఫరెన్స్ కన్వీనర్, మాజీ చైర్మన్ శ్రీనివాస్ గుత్తికొండ, నాట్స్ చైర్మన్ ప్రశాంత్ పిన్నమనేని, నటీమణులు జయసుధ, ఆమని, దర్శకులు హరీశ్ శంకర్, మెహర్ రమేష్, సంగీత దర్శకుడు తమన్, గీత రచయితలు రామజోగయ్య శాస్త్రి, చంద్రబోస్, కళ్యాణ్ చక్రవర్తి తదితరులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు.

కీలక పాత్రలో శ్రీకాంత్



సాయి దుర్గా తేజ్, ఐశ్వర్య లక్ష్మీ జంటగా రోహిత్ కేపీ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'సంబరాల యేటి గట్టు'. కె.నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మిస్తున్నారు. సెప్టెంబరు 25న తెలుగుతోపాటు తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానుంది. ఈ సినిమాలో శ్రీకాంత్ కీలక పాత్రను పోషిస్తున్నారు. శ్రీకాంత్ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ఆయన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని విడుదల చేశారు. చిందరవందర జుట్టు, బాగా పెరిగిన గెడ్డంతో నల్లని కోటు ధరించిన శ్రీకాంత్ లుక్ అదిరిపోయింది. ప్రస్తుతం ఈ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

సాయికుమార్‌కు అవార్డు



నటుడు సాయికుమార్ కుమరం భీం జాతీయ అవార్డును అందుకున్నారు. ఆదివారం ఆసిఫాబాద్‌లో భారత్ కల్చర్ అకాడమీ, ఆదివాసీ సాంస్కృతిక పరిషత్, ఓం సాయితేజ ఆర్ట్స్ ఆయనకు ఈ పురస్కారాన్ని ప్రదానం చేశాయి. జ్ఞాపికతో పాటు 50వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో భారత్ కల్చర్ అకాడమీ చైర్మన్, మాజీ ఐఏఎస్ అధికారి పార్థసారధి, మాజీ మంత్రి, నటుడు బాబు మోహన్, ఆదిలాబాద్ ఎంపీ నగేష్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ (ఆంధ్రజ్యోతి)

సందేశాత్మక చిత్రం



అజయ్, ఇంద్రజ, సుమన్, జయసుధ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'సీఎమ్ పెళ్లాం'. గడ్డం రమణ దర్శకత్వంలో బొల్లా రామకృష్ణ నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా నుంచి ప్రమోషనల్ సాంగ్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో బొల్లా రామకృష్ణ మాట్లాడుతూ "రాజకీయ నేపథ్యంతో కూడిన సందేశాత్మక చిత్రమిది" అని అన్నారు. "ప్రతీ ఒక్కరినీ ఆలోచింపజేసే చిత్రమిది" అని దర్శకుడు రమణ గెడ్డం చెప్పారు. "ఈ పాట చూశాక చాలా భావోద్వేగానికి లోనయ్యాను. ఈ సినిమాతో అందరికీ మంచి పేరు వస్తుంది" అని నటుడు అజయ్ అన్నారు.

ఉప్పల్‌లో ఇషాన్ తుఫాన్

సూపర్ సెంచరీతో కదం తొక్కిన కిషన్

హైదరాబాద్ 286/6 రాజస్థాన్ 242/6

హెడ్ ధనాధన్ ఇన్నింగ్స్

- సన్‌రైజర్స్ పరుగుల సునామీ
- 44 రన్స్‌తో రాయల్స్ ఓటమి




హెడ్ (31 బంతుల్లో 67)

హైదరాబాద్: నిరుటి రన్నరప్ హైదరాబాద్ ఈసారి ఐపీఎల్‌లో అద్భుతమైన బోణీ కొట్టింది. క్రీజులోకి వచ్చిన బ్యాటర్లంతా హడలెత్తించిన వేళ 44 పరుగులతో రాజస్థాన్ రాయల్స్‌పై ఘన విజయం సాధించింది. ఆదివారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో మొదట హైదరాబాద్ 20 ఓవర్లలో 286/6 స్కోరు చేసింది. ఇషాన్ కిషన్ (47 బంతుల్లో 11 ఫోర్లు, 6 సిక్స్‌లతో 106 నాటౌట్) సూపర్ సెంచరీతో భళా అనిపించాడు. ట్రావిస్ హెడ్ (31 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్స్‌లతో 67), క్లాసెన్ (14 బంతుల్లో 5 ఫోర్లు, సిక్సర్‌తో 34), నితీశ్ కుమార్ (15 బంతుల్లో 4 ఫోర్లు, సిక్సర్‌తో 30) మెరిశారు. తుషార్ మూడు, మహీశ్ తీక్షణ రెండు వికెట్లు పడగొట్టారు. భారీ ఛేదనలో రాజస్థాన్ రాయల్స్ 20 ఓవర్లలో 242/6 స్కోరుకే పరిమితమై ఓడింది. ధ్రువ్ జురెల్ (35 బంతుల్లో 5 ఫోర్లు, 6 సిక్స్‌లతో 70), సంజూ శాంసన్ (37 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్స్‌లతో 66) హాఫ్ సెంచరీలతో సత్తా చాటారు. హెట్‌మయెర్ (23 బంతుల్లో ఫోర్, 4 సిక్స్‌లతో 42), శుభమ్ దూబే (11 బంతుల్లో ఫోర్, 4 సిక్స్‌లతో 34 నాటౌట్) మెరుపు ఇన్నింగ్స్ ఆడారు. హర్షల్ పటేల్, సిమర్‌జీత్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఇషాన్ కిషన్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.

అంతా చెలరేగారు: సంజూ శాంసన్ గాయంతో 'ఇంపాక్ట్ ఆటగాడి' పాత్రకే పరిమితం కావడంతో రియాన్ పరాగ్ రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్సీ చేపట్టాడు. అయితే ఫ్లాట్ ఉప్పల్ పిచ్‌పై..టాస్ గెలిచి తొలుత బౌలింగ్ ఎంచుకుని పరాగ్ తొలి తప్పిదం చేశాడు. ఇక ప్రతి హైదరాబాద్ బ్యాటర్ రాయల్స్ బౌలర్లను చెడుగుడు ఆడుకున్నారు. ముఖ్యంగా సన్‌రైజర్స్ తరఫున మొదటి మ్యాచ్ బరిలో దిగిన ఇషాన్ కిషన్ ఆకాశమే హద్దుగా రెచ్చిపోయాడు. ఓపెనర్లు హెడ్, అభిషేక్ శర్మ (24) సహజ శైలిలో విజృంభించగా, నితీశ్, క్లాసెన్ కూడా బ్యాట్లు ఝుళిపించడంతో పరుగులు వెల్లువెత్తాయి. ఈక్రమంలో తొలుత..అభిషేక్, హెడ్ బాదుడుకు మొదటి మూడు ఓవర్లలోనే రైజర్స్ 45 పరుగులు కొల్లగొట్టింది. నాలుగో ఓవర్లో అభిషేక్‌ను తీక్షణ అవుట్ చేసినా రాయల్స్‌కు ఊరట దక్కలేదు. ఉరుముకు, మెరుపు తోడైనట్టు హెడ్‌కు, కిషన్ జత కలవడంతో హైదరాబాద్ స్కోరు రాకెట్ వేగంతో దూసుకు పోయింది. పవర్ ప్లేలో 94/1తో నిలవగా, ఆపై హెడ్ హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. కళ్లు చెదిరే షాట్లతో అలరించిన కిషన్ కూడా అర్ధ శతకాన్ని పూరించాడు. పదో ఓవర్లో హెడ్‌ను తుషార్ దేశ్‌పాండే పెవిలియన్ చేర్చాడు. దాంతో 39 బంతుల్లో 85 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. హెడ్, కిషన్ ఇద్దరూ కలిసి 20 ఫోర్లు, తొమ్మిది సిక్స్‌లు కొట్టడం చూస్తే..రాయల్స్ బౌలర్లను వారు ఎలా ఉతికేశారో తెలుస్తుంది. మెరుపు బ్యాటింగ్‌తో అలరించిన నితీశ్ 15వ ఓవర్లో నిష్క్రమించగా..అతడి స్థానంలో వచ్చిన క్లాసెన్ తగ్గేదేలే అనేలా షాట్లు సంధించాడు. క్లాసెన్ దూకుడుకు 19వ ఓవర్లో సందీప్ శర్మ చెక్ పెట్టగా, ఇదే ఓవర్లో రెండు సిక్స్‌లతోపాటు మరో రెండు పరుగులతో ఇషాన్ ఐపీఎల్‌లో తొలి సెంచరీ సాధించాడు. ఆఖరి ఓవర్లో 2 వికెట్లు కోల్పోయిన హైదరాబాద్ 13 పరుగులే చేసింది.

సంజూ, జురెల్ పోరాడినా..: రికార్డు ఛేదనలో రాజస్థాన్ టపటపా 3 వికెట్లు కోల్పోయినా.. శాంసన్, జురెల్ శతక భాగస్వామ్యంతో పోరాడారు. వీరిద్దరి నిష్క్రమణ అనంతరం హెట్‌మయెర్, శుభమ్ దూబే దూకుడైన బ్యాటింగ్‌తో ఆశలు రేపారు. కానీ రన్‌రేట్ అప్పటికే భారీగా పెరిగిపోవడంతో రాజస్థాన్‌కు ఓటమి తప్పలేదు. జైస్వాల్ (1), కెప్టెన్ రియాన్ పరాగ్ (4), నితీశ్ రాణా (11) విఫలం కావడంతో రాజస్థాన్ 50/3తో ఇబ్బందుల్లో కూరుకుపోయింది. ఈ తరుణంలో శాంసన్, జురెల్ హైదరాబాద్ బౌలర్లపై ఎదురు దాడికి దిగి 9.5 ఓవర్లలో 111 పరుగులు జత చేశారు. కానీ 14వ ఓవర్లో శాంసన్‌ను హర్షల్, 15వ ఓవర్లో జురెల్‌ను జంపా అవుట్ చేయడంతో రాజస్థాన్ పరిస్థితి మారిపోయింది. అయితే హెట్‌మయెర్, శుభమ్ దూబే పట్టువదల్లేదు. సిక్స్‌లు, ఫోర్లతో చెలరేగి ఆరో వికెట్‌కు 34 బంతుల్లో 80 రన్స్ జోడించినా..ఓటమి అంతరాన్ని మాత్రమే తగ్గించగలిగారు.

గత సీజన్‌లో మూడుసార్లు 250కిపైగా స్కోర్లు..టాపార్డర్ బ్యాటర్లంతా సూపర్ ఫామ్‌తో ఫుల్ జోష్..ఇంకేం ఈ సీజన్ తమ తొలి పోరులో, పైగా సొంత మైదానంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ '300' కొట్టేస్తుందనే అంచనా..అందుకు తగ్గట్టుగానే రాజస్థాన్ రాయల్స్‌తో మ్యాచ్‌లో హైదరాబాద్ బ్యాటర్లంతా పూనకం వచ్చినట్టు ఆడారు.. ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపారు..అలవోకగా ఫోర్లు, సిక్సర్లు బాది పరుగుల సునామీ సృష్టించారు..దాంతో ఐపీఎల్‌లో తన పేరిటేనున్న రికార్డు స్కోరుకు దగ్గరగా రైజర్స్ దూసుకొచ్చింది.. అయితే ఆఖరి ఓవర్లో రెండు వికెట్లు కోల్పోకుండా ఉంటే ఆ రికార్డు అందుకొనేదే! ముంబై ఇండియన్స్ నుంచి సన్‌రైజర్స్‌కు మారాక తొలి మ్యాచ్ బరిలో దిగిన ఇషాన్ కిషన్ తుఫాన్ ఇన్నింగ్స్‌తో ఫ్యాన్స్‌ను సమ్మోహితులను చేశాడు.

2 సన్‌రైజర్స్ చేసిన 286/6 ఐపీఎల్ చరిత్రలో రెండో అత్యధిక స్కోరు. 287/3తో 'టాప్' స్కోరు కూడా హైదరాబాద్ పేరిటే ఉండడం విశేషం.

ఐపీఎల్‌లో టాప్-5 స్కోర్లు

జట్టు	స్కోరు	ప్రత్యర్థి	వేదిక	తేదీ
సన్‌రైజర్స్	287/3	బెంగళూరు	బెంగళూరు	2024 ఏప్రిల్ 15
సన్‌రైజర్స్	286/6	రాజస్థాన్	హైదరాబాద్	2025 మార్చి 23
సన్‌రైజర్స్	277/3	ముంబై	హైదరాబాద్	2024 మార్చి 27
కోల్‌కతా	272/7	ఢిల్లీ	విశాఖపట్నం	2024 ఏప్రిల్ 3
సన్‌రైజర్స్	266/7	ఢిల్లీ	ఢిల్లీ	2024 ఏప్రిల్ 20

1 ఐపీఎల్ చరిత్రలో అత్యధిక పరుగులు (0/76) ఇచ్చుకున్న బౌలర్‌గా జోఫ్రా ఆర్చర్. గత రికార్డు మోహిత్ శర్మ (2/73) పేరిట ఉంది.

528 ఈ మ్యాచ్ రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి నమోదైన పరుగులు ఇవి. లీగ్ చరిత్రలో ఇది రెండో అత్యధికం.

ఆ రెండు ఓవర్లే మార్చేశాయి

రాజస్థాన్ ఛేదనలో జంపా వేసిన 11వ ఓవర్, కమిన్స్ సంధించిన 12వ ఓవరే ఇన్నింగ్స్ స్వరూపాన్ని మార్చాయి. ఈ రెండు ఓవర్లలో రాజస్థాన్ ఏడు పరుగులే చేయగలిగింది.

డాట్ బాల్స్‌కూడా..

హైదరాబాద్ విజయంలో డాట్ బాల్స్ కూడా కీలకంగా నిలిచాయి. సన్‌రైజర్స్ ఇన్నింగ్స్‌లో రాజస్థాన్ 25 డాట్ బాల్సే వేయగలిగింది. అయితే కమిన్స్ సేన 40 డాట్ బాల్స్ వేయడం విశేషం.


జురెల్ (70)

స్కోరుబోర్డు

సన్‌రైజర్స్: అభిషేక్ (సి) జైస్వాల్ (బి) తీక్షణ 24, హెడ్ (సి) హెట్‌మయెర్ (బి) తుషార్ 67, ఇషాన్ కిషన్ (నాటౌట్) 106, నితీశ్‌కుమార్ (సి) జైస్వాల్ (బి) తీక్షణ 30, క్లాసెన్ (సి) పరాగ్ (బి) సందీప్ 34, అనికేత్ వర్మ (సి) ఆర్చర్ (బి) తుషార్ 7, అభినవ్ మనోహర్ (సి) పరాగ్ (బి) తుషార్ 0, కమిన్స్ (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 18; మొత్తం: 20 ఓవర్లలో 286/6; వికెట్ల పతనం:** 1-45, 2-130, 3-202, 4-258, 5-279, 6-279; **బౌలింగ్:** ఫజల్లా ఫరూఖీ 3-0-49-0, మహీష్ తీక్షణ 4-0-52-2, ఆర్చర్ 4-0-76-0, సందీప్ శర్మ 4-0-51-1, నితీశ్ రాణా 1-0-9-0, తుషార్ దేశ్‌పాండే 4-0-44-3.

రాజస్థాన్ రాయల్స్: యశస్వీ జైస్వాల్ (సి) అభినవ్ (బి) సిమర్‌జీత్ 1, సంజూ శాంసన్ (సి) క్లాసెన్ (బి) హర్షల్ 66, రియాన్ పరాగ్ (సి) కమిన్స్ (బి) సిమర్‌జీత్ 4, నితీశ్ రాణా (సి) కమిన్స్ (బి) షమి 11, ధ్రువ్ జురెల్ (సి) ఇషాన్ (బి) జంపా 70, హెట్‌మయెర్ (సి) అభినవ్ (బి) హర్షల్ 42, శుభమ్ దూబే (నాటౌట్) 34, ఆర్చర్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 13; మొత్తం: 20 ఓవర్లలో 242/6; వికెట్ల పతనం:** 1-20, 2-24, 3-50, 4-161, 5-161, 6-241; **బౌలింగ్:** షమి 3-0-33-1, సిమర్‌జీత్ సింగ్ 3-0-46-2, కమిన్స్ 4-0-60-0, అభిషేక్ శర్మ 2-0-17-0, ఆడమ్ జంపా 4-0-48-1, హర్షల్ పటేల్ 4-0-34-2.

విశాఖలో ఐపీఎల్ సమరం

రా.7.30 నుంచి

నేడు లఖ్‌నవూ X ఢిల్లీ


కెప్టెన్లు పంత్, అక్షర్

విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): కెప్టెన్లు మారారు.. జట్లలో కూడా భారీ ప్రక్షాళన జరిగింది. ఈనేపథ్యంలో తొలి మ్యాచ్‌లో విజయం సాధించడం ద్వారా ఈ ఐపీఎల్‌లో ఘనమైన బోణీ చేయాలని లఖ్‌నవూ సూపర్ జెయింట్స్, ఢిల్లీ క్యాపిటల్స్ భావిస్తున్నాయి. సోమవారం ఇక్కడి ఏసీఏ-వీడీసీఏ స్టేడియం వేదికగా జరిగే మ్యాచ్‌లో రిషభ్ పంత్ సారథ్యంలో లఖ్‌నవూ, అక్షర్ పటేల్ కెప్టెన్సీలో ఢిల్లీ తలపడనున్నాయి. విశాఖ స్టేడియాన్ని హోం గ్రౌండ్‌గా ఎంచుకున్న ఢిల్లీ క్యాపిటల్స్ శుభారంభం చేసేందుకు ఉవ్విళ్లూరుతోంది. ఐపీఎల్ కెరీర్‌లో ఇప్పటివరకు ఢిల్లీకి ఆడిన పంత్..లఖ్‌నవూకు మారి సారథ్య బాధ్యతలు చేపట్టాడు. ఇక గత సీజన్‌లో సూపర్ జెయింట్స్‌కు కెప్టెన్‌గా వ్యవహరించిన కేఎల్ రాహుల్ ఢిల్లీ తరఫున కేవలం ఆటగాడిగా బరిలో దిగుతున్నాడు. అంతేకాదు..రెండు జట్లూ సమూల ప్రక్షాళనతో ఐపీఎల్‌కు సిద్ధమయ్యాయి.

కొత్త ఫ్లడ్‌లైట్లతో స్టేడియం: ఆధునికీకరణలో భాగంగా ఏసీఏ-వీడీసీఏ స్టేడియాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. రూ. 8 కోట్లతో హాలోజన్ బల్బుల స్థానంలో ఎల్ఈడీ బల్బులను అమర్చారు.

వీల్‌చైర్‌లో ఉన్నా.. వదలరు!

తన రిటైర్మెంట్‌పై ధోనీ



చెన్నై: టీమిండియా మాజీ కెప్టెన్ ధోనీకి ఇదే చివరి ఐపీఎల్ అనే ఊహాగానాలు బలంగా వినిపిస్తున్నాయి. అయితే, తన రిటైర్మెంట్‌పై వస్తున్న వార్తలను ధోనీ కొట్టిపడేశాడు. తాను ఆడాలనుకున్నంత కాలం ఆడతానని స్పష్టం చేశాడు. 'ఇది నా ఫ్రాంచైజీ. సీఎస్‌కేకు ఎంత కాలం ఆడాలనుకొంటే.. అంతకాలం ఆడతా. ఒకవేళ నేను వీల్‌చైర్‌లో ఉన్నా.. చెన్నై సూపర్ కింగ్స్ ఫ్రాంచైజీ వాళ్లు లాక్కెళ్లిపోతారు' అని సరదాగా ధోనీ వ్యాఖ్యానించాడు.

ప్రియాంక రికార్డు ప్రదర్శన



న్యూఢిల్లీ: భారత స్టార్ రేస్ వాకర్, కామన్వెల్త్ క్రీడల పతక విజేత ప్రియాంక గోస్వామి అంతర్జాతీయ వేదికపై రికార్డు ప్రదర్శనతో ఆకట్టుకుంది. స్లొవేకియాలోని డుడెన్స్‌లో ఆదివారం జరిగిన మహిళల 35 కిలోమీటర్ల రేసును ప్రియాంక 2 గంటలా 56 నిమిషాల 34 సెకన్లలో ముగించి 11వ స్థానంలో నిలిచింది. ఈ క్రమంలో ఆమె జాతీయ రికార్డును బద్దలు కొట్టింది. 2023లో మంజూరాణి నమోదు చేసిన 2 గంటలా 57 నిమిషాల 54 సెకన్ల రికార్డును ప్రియాంక అధిగమించింది.

మళ్లీ చిత్తుగా ఓడిన పాక్

నాలుగో టీ20లో 115 పరుగులతో కివీస్ గెలుపు

3-1తో సిరీస్ కైవసం


ఫిన్ అలెన్ (50)

మౌంట్ మాంగనుయ్: పేసర్లు జాకబ్ డఫీ (4/20), జకారి ఫౌల్క్స్ (3/25) నిప్పులు చెరగడంతో.. పాకిస్థాన్‌తో ఐదు టీ20ల సిరీస్‌ను ఆతిథ్య న్యూజిలాండ్ మరో మ్యాచ్ మిగిలుండగానే 3-1తో సొంతం చేసుకొంది. ఆదివారం జరిగిన నాలుగో టీ20లో కివీస్ 115 పరుగుల తేడాతో పాకిస్థాన్‌ను చిత్తు చేసింది. తొలుత న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 220/6 స్కోరు చేసింది. ఫిన్ అలెన్ (50), బ్రేస్‌వెల్ (46 నాటౌట్), సీఫెర్ట్ (44) దూకుడుగా ఆడారు. హరీస్ రౌఫ్ మూడు, అబ్రార్ అహ్మద్ రెండు వికెట్లు పడగొట్టారు. ఛేదనలో కివీస్ పేసర్ల దెబ్బకు పాక్ 16.2 ఓవర్లలో 105 పరుగులకే కుప్పకూలింది. అబ్దుల్ సమద్ (44), ఇర్ఫాన్ ఖాన్ (24) మినహా మిగతా బ్యాటర్లు ఎవరూ డబుల్ డిజిట్ స్కోరు సాధించలేక పోయారు.

చైనీస్ గ్రాండ్ ప్రీ విజేత ఆస్కార్



షాంఘై: మెక్‌లారెన్ డ్రైవర్ ఆస్కార్ పియాస్త్రి ఫార్ములావన్ చైనీస్ గ్రాండ్ ప్రీలో చాంపియన్‌గా నిలిచాడు. ఆదివారం జరిగిన ఫైనల్ రేసును పోల్ పొజిషన్‌తో ఆరంభించిన ఆస్కార్.. అందరికంటే ముందంజలో నిలిచి టైటిల్ దక్కించుకున్నాడు. మెక్‌లారెన్‌కే చెందిన లాండో నోరిస్ రెండో స్థానం, మెర్సిడెస్ డ్రైవర్ జార్జ్ రస్సెల్ మూడోస్థానంతో పోడియం ఫినిష్ చేశారు. కాగా, గతేడాది విజేత, రెడ్‌బుల్ డ్రైవర్ మ్యాక్స్ వెర్‌స్టాపెన్ నాలుగోస్థానానికి పడిపోయాడు. ఆస్ట్రేలియాకు చెందిన 23 ఏళ్ల ఆస్కార్‌కు ఇది ఎఫ్1 కెరీర్‌లో మూడో విజయం.

తిప్పేసిన నూర్

మెరిసిన రచిన్

- గైక్వాడ్ అర్ధ శతకం
- 4 వికెట్లతో చెన్నై గెలుపు
- పోరాడి ఓడిన ముంబై
- విఘ్నేష్‌కు 3 వికెట్లు


నూర్ అహ్మద్ (4-0-18-4)


రచిన్ రవీంద్ర (45 బంతుల్లో 65 నాటౌట్)

చెన్నై: ఫామ్‌లో ఉన్న రచిన్ రవీంద్ర (45 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్స్‌లతో 65 నాటౌట్), రుతురాజ్ గైక్వాడ్ (26 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్స్‌లతో 53) అర్ధ శతకాలతోపాటు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' స్పిన్నర్ నూర్ అహ్మద్ (4/18) మాయాజాలంతో.. ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) బోణీ కొట్టింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో చెన్నై 4 వికెట్ల తేడాతో ముంబై ఇండియన్స్ (ఎంఐ)పై గెలిచింది. దీంతో లీగ్‌లో తొలి మ్యాచ్‌లో ఓడే సంప్రదాయాన్ని ముంబై కొనసాగించింది. తొలుత ముంబై నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 155 పరుగులు చేసింది. తిలక్ వర్మ (31), సూర్యకుమార్ యాదవ్ (29), దీపక్ చాహర్ (28 నాటౌట్) పర్వాలేదనిపించారు. ఖలీల్ అహ్మద్ మూడు వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో చెన్నై 19.1 ఓవర్లలో 158/6 స్కోరు చేసి నెగ్గింది. స్పిన్నర్ విఘ్నేష్ పుతూర్ మూడు వికెట్లు పడగొట్టాడు. ఆంధ్ర పేసర్ సత్యనారాయణ రాజు, కేరళ స్పిన్నర్ విఘ్నేష్ లీగ్‌లో అరంగేట్రం చేశారు.

రచిన్ తుదికంటా..: ఛేదనలో ఓపెనర్ రాహుల్ త్రిపాఠి (2)ని దీపక్ రెండో ఓవర్‌లోనే అవుట్ చేశాడు. కానీ, మరో ఓపెనర్ రచిన్‌కు జత కలసిన కెప్టెన్ రుతురాజ్ ధాటిగా ఆడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. ఆరో ఓవర్‌లో శాంట్నర్ బౌలింగ్‌లో రుతురాజ్ 6,4,4 బాదడంతో చెన్నై 62/1తో నిలిచింది. ఇదే జోరులో గైక్వాడ్ అర్ధ శతకం పూర్తి చేసుకొన్నాడు. అయితే, విఘ్నేష్ మధ్య ఓవర్లలో మూడు వికెట్లు పడగొట్టి చెన్నైకు ఝలక్ ఇచ్చాడు. తను బౌల్ చేసిన తొలి ఓవర్‌లోనే గైక్వాడ్‌ను క్యాచవుట్ చేయడంతో.. రెండో వికెట్‌కు 67 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ధాటిగా ఆడే ప్రయత్నం చేసిన శివం దూబె (9), దీపక్ హుడా (3)ను కూడా అవుట్ చేసిన విఘ్నేష్.. ప్రత్యర్థిని ఒత్తిడిలోకి నెట్టాడు. సామ్ కర్రాన్ (4)ను జాక్స్ బౌల్డ్ చేయడంతో మ్యాచ్‌లో ఉత్కంఠ రేగింది. ఈ దశలో రచిన్‌కు జత కలసిన జడేజా (17) ఆరో వికెట్‌కు 36 పరుగుల భాగస్వామ్యంతో జట్టును గెలుపు ముంగిట నిలబెట్టాడు. మరోవైపు విఘ్నేష్ బౌలింగ్‌లో సిక్స్‌తో అర్ధ శతకం పూర్తి చేసుకొన్న రచిన్.. మరో భారీ షాట్ ఆడడంతో లక్ష్యం 12 బంతుల్లో 6 పరుగులకు దిగివచ్చింది. జడ్డూ రనౌట్ అయినా.. రచిన్ సిక్స్‌తో ఫినిషింగ్ టచ్ ఇచ్చాడు. ధోనీ క్రీజులోకి వచ్చినా ఖాతా తెరవలేదు.

దెబ్బకొట్టిన నూర్..: మిస్టరీ స్పిన్నర్ నూర్ మిడిలార్డర్ వెన్నువిరిచినా.. డెత్ ఓవర్లలో దీపక్ మెరుపులతో ముంబై గౌరవప్రద స్కోరు చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ముంబైను ఖలీల్ వణికించాడు. తన వరుస ఓవర్లలో ఓపెనర్లు రోహిత్ శర్మ (0), ర్యాన్ రికెల్టన్ (13)ను పెవిలియన్ చేర్చాడు. విల్ జాక్స్ (11)ను అశ్విన్ క్యాచవుట్ చేయడంతో పవర్‌ప్లేలోనే మూడు టాపార్డర్ వికెట్లు చేజార్చుకొన్న ఎంఐ 36/3తో కష్టాల్లో పడింది. ఈ పరిస్థితుల్లో తాత్కాలిక కెప్టెన్ సూర్య, తిలక్.. నాలుగో వికెట్‌కు 51 పరుగుల భాగస్వామ్యంతో జట్టును ఆదుకొనే ప్రయత్నం చేశారు. ఎదుర్కొన్న తొలి రెండు బంతులను బౌండ్రీలకు తరలించిన తిలక్ జోరు చూపారు. సూర్య కూడా సిక్స్ బాదడంతో పవర్‌ప్లేను ముంబై 52/3తో ముగించింది. అయితే, మధ్య ఓవర్లలో స్పిన్నర్లు బౌలింగ్‌కు దిగడంతో వీరిద్దరూ స్ట్రయిక్ రొటేట్ చేస్తూ స్కోరు బోర్డును నడిపించారు. అయితే, నూర్ తన వరుస ఓవర్లలో సెటిల్డ్ బ్యాటర్లను అవుట్ చేసి గట్టిదెబ్బ కొట్టాడు. 11వ ఓవర్‌లో నూర్ బౌలింగ్‌లో సూర్య స్టంపౌట్ కాగా.. 13వ ఓవర్‌లో రాబిన్ మిన్జ్ (3), తిలక్‌లను నూర్ పెవిలియన్ చేర్చాడు. అప్పటికి ముంబై స్కోరు వంద మార్క్ కూడా దాటలేదు. ఎదురుదాడి చేసే ప్రయత్నం చేస్తున్న నమన్ ధిర్ (17)ను కూడా నూర్ బౌల్డ్ చేయడంతో ముంబై కనీసం పోరాడగలిగే స్కోరైనా చేస్తుందా? అనే అనుమానం కలిగింది. శాంట్నర్ (11)ను ఎలీస్ అవుట్ చేసినా.. చివర్లో బ్యాట్‌ను ఝుళిపించిన దీపక్ జట్టు స్కోరును 150 మార్క్ దాటించాడు.

13 ఐపీఎల్‌లో ఆరంభ మ్యాచ్‌ను ఓడడం ముంబై ఇండియన్స్‌కిది వరుసగా 13వ సారి. ముంబై చివరిగా తమ తొలి మ్యాచ్‌ను 2012లో గెలిచింది.

ఖేలో పారా క్రీడల్లో శ్రీధర్‌కు స్వర్ణం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఖేలో ఇండియా పారా క్రీడల్లో తెలంగాణ మరో రెండు పతకాలు కొల్లగొట్టింది. ఆదివారం న్యూఢిల్లీ జరిగిన షూటింగ్ పోటీల్లో పురుషుల 10 మీటర్ల ఈవెంట్‌లో శ్రీధర్ స్వర్ణం, మహిళల 10 మీటర్ల ఈవెంట్‌లో పావని కాంస్యం సాధించారు. మొత్తంగా ఈ క్రీడల్లో తెలంగాణ ఇప్పటివరకు 5 పతకాలు సొంతం చేసుకుంది. ఇక ఏపీ అథ్లెట్లు ఆదివారం ఒక్కరోజే ఏడు పతకాలు కొల్లగొట్టడం విశేషం. ఇందులో 2 స్వర్ణాలు, 3 రజతాలు, 2 కాంస్యాలు ఉన్నాయి.

స్కోరుబోర్డు

ముంబై: రోహిత్ (సి) శివమ్ దూబే (బి) ఖలీల్ 0, రికెల్టన్ (బి) ఖలీల్ 13, విల్ జాక్స్ (సి) శివమ్ (బి) అశ్విన్ 11, సూర్యకుమార్ (స్టంప్డ్) ధోనీ (బి) నూర్ 29, తిలక్ (ఎల్బీ) నూర్ 31, రాబిన్ మిన్జ్ (సి) జడేజా (బి) నూర్ 3, నమన్ ధిర్ (బి) నూర్ 17, శాంట్నర్ (ఎల్బీ) ఎలిస్ 11, దీపక్ చాహర్ (నాటౌట్) 28, బౌల్ట్ (సి) రుతురాజ్ (బి) ఖలీల్ 1, సత్యనారాయణ రాజు (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 10; మొత్తం: 20 ఓవర్లలో 155/9; వికెట్ల పతనం:** 1-0, 2-21, 3-36, 4-87, 5-95, 6-96, 7-118, 8-128, 9-141; **బౌలింగ్:** ఖలీల్ అహ్మద్ 4-0-29-3, సామ్ కర్రాన్ 1-0-13-0, నాథన్ ఎలిస్ 4-0-38-1, అశ్విన్ 4-0-31-1, జడేజా 3-0-21-0, నూర్ అహ్మద్ 4-0-18-4.

చెన్నై: రచిన్ రవీంద్ర (నాటౌట్) 65, రాహుల్ త్రిపాఠి (సి) రికెల్టన్ (బి) దీపక్ చాహర్ 2, రుతురాజ్ (సి) జాక్స్ (బి) విఘ్నేశ్ 53, శివమ్ దూబే (సి) తిలక్ (బి) విఘ్నేశ్ 9, దీపక్ హుడా (సి) రాజు (బి) విఘ్నేశ్ 3, సామ్ కర్రాన్ (బి) జాక్స్ 4, జడేజా (రనౌట్) 17, ధోనీ (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 19.1 ఓవర్లలో 158/6; వికెట్ల పతనం:** 1-11, 2-78, 3-95, 4-107, 5-116, 6-152; **బౌలింగ్:** బౌల్ట్ 3-0-27-0, దీపక్ చాహర్ 2-0-18-1, సత్యనారాయణ రాజు 1-0-13-0, శాంట్నర్ 2.1-0-24-0, విల్ జాక్స్ 4-0-32-1, విఘ్నేశ్ పుతూర్ 4-0-32-3, నమన్ ధిర్ 3-0-12-0.

కమ్యూనిజానికి చావు లేదు: కూనంనేని



వనపర్తి టౌన్, మార్చి 23: "మనిషికి మరణం ఉంటుంది కానీ కమ్యూనిజానికి మరణం ఉండదు" అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సీపీఐ శత వసంతాల ఉత్సవాలను ఆదివారం వనపర్తి జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన కూనంనేని మాట్లాడుతూ.. 'సృష్టి ఉన్నంత కాలం, సూర్యకిరణాలు ఎర్రగా ఉన్నంత వరకు సీపీఐ ఉంటుందనే విషయం.. కమ్యూనిస్టుల పని అయిపోయిందనుకునే వాళ్లు గుర్తు పెట్టుకోవాలి' అని పేర్కొన్నారు. పూటకోపార్టీ మారే వాళ్లకంటే.. ఒకే పార్టీ, ఒకే సిద్ధాంతంతో ప్రజల సమస్యలపై పోరాడుతున్న కమ్యూనిస్టులు ఎంతో గొప్ప అని, దీనికి కమ్యూనిస్టులైన ప్రతీ ఒక్కరు గర్వపడాలని అన్నారు. మత రాజకీయాలు చేస్తున్న బీజేపీ పుట్టకముందే ఈ దేశంలో హిందూత్వం ఉందని కూనంనేని అన్నారు. చీమలు పెట్టిన పుట్టలోకి పాము దూరినట్లు బీజేపీ ఈ దేశంలో హిందూత్వ ఎజెండాను ఎత్తుకుందన్నారు. రాముడికి, బీజేపీకి సంబంధం లేదని, శ్రీరాముడు జనమందరికీ చెందినవాడని అన్నారు. "మోసం చేయడంలో, కమ్యూనిస్టులను కరివేపాకులా వాడుకోవడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు సిద్ధహస్తులే. కానీ, ఇది శాశ్వతం కాదు. భవిష్యత్‌లో కమ్యూనిస్టులదే రాజ్యం" అని కూనంనేని అన్నారు. సీపీఐ 100 వసంతాల ముగింపు సభ డిసెంబర్ 26న ఖమ్మంలో 5లక్షల మందితో ఘనంగా నిర్వహించుకుందామని పిలుపునిచ్చారు.

ఉపాధి పనుల్లో వికారాబాద్ అగ్రస్థానం

వికారాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో వికారాబాద్ జిల్లా రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో అత్యధిక కూలీలకు ఉపాధి, అత్యధిక కుటుంబాలకు 100 రోజుల పని, సగటు పని రోజులు కల్పించడం, అత్యధిక సగటు వేతనం, సకాలంలో వేతనాలు చెల్లించడం వంటి అంశాల్లో మెరుగైన స్కోరు సాధించింది. వలసలను నివారించేందుకు నివాసం ఉన్న చోటే వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ పథకం అమలు చేస్తోంది. వికారాబాద్ జిల్లాలో 18 మండలాల్లోని 566 గ్రామ పంచాయతీల పరిధిలో 1,86,044 ఉపాధి హామీ జాబ్ కార్డుల్లో 3,78,520 మంది కూలీలు నమోదయ్యారు. ఈ ఆర్థిక సంవత్సరంలో కూలీలకు 66,37,236 పనిరోజులతో ఉపాధి కల్పించాలన్నది లక్ష్యం కాగా ఈ నెల 22 వరకు 63,66,275 పనిరోజులు కల్పించారు. ఈ అంశంలో 95.92 శాతంతో మొదటి స్థానంలో నిలిచింది. పాటు సగటు పనిదినాల (59 రోజులు) విషయంలో, వేతనాల రూపంలో రూ.151.05 కోట్లు, మెటీరియల్ రూపంలో రూ.74.85 కోట్లు చెల్లించి ప్రథమ స్థానం సాధించింది. అత్యధిక సగటు వేతనం (ఒక్కో కూలీ రోజుకు సగటున రూ.237.28) విషయంలో నాలుగో స్థానంలో నిలిచింది. దీనిపై జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు.

భక్తజనసంద్రం యాదగిరి క్షేత్రం



యాదగిరిగుట్ట, మార్చి23(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి దర్శనార్థం వచ్చిన భక్తులతో ఆదివారం యాదగిరి కొండ సందడిగా మారింది. సుమారు 45వేల మంది భక్తులు క్షేత్ర దర్శనానికి రాగా, ప్రత్యేక, ధర్మదర్శన క్యూలైన్లలో ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులతో సందడి నెలకొంది. ప్రత్యేక దర్శనాలకు గంట, ధర్మదర్శనాలకు రెండు గంటల సమయం పట్టింది. రూ.49,28,666 ఆదాయం సమకూరినట్టు ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

అవయవ మార్పిడిలో అక్రమాలపై ఉక్కుపాదం!

టీహెచ్‌వోటీఏ-2011 సవరణ చట్టాన్ని అడాప్ట్ చేసుకోనున్న రాష్ట్ర ప్రభుత్వం

» నేడు శాసనసభలో సర్కారు తీర్మానం

హైదరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మానవ అవయవ మార్పిడిలో అక్రమాలకు పాల్పడే వారిపై ప్రభుత్వం ఇక ఉక్కుపాదం మోపనుంది. నిబంధనలకు విరుద్ధంగా అవయవ మార్పిడులకు పాల్పడితే భారీ జరిమానాతోపాటు పదేళ్ల జైలుశిక్ష కూడా విధించనుంది. ఈ మేరకు కేంద్ర మానవ అవయవాలు, కణజాలాల మార్పిడి చట్టం-2011ను తెలంగాణ ప్రభుత్వం అడాప్ట్ చేసుకోనుంది. ఇందుకు సంబంధించి సోమవారం శాసనసభలో తీర్మానం ప్రవేశపెట్టనుంది. ఈ చట్టాన్ని అడాప్ట్ చేసుకునేందుకు ఇప్పటికే రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం తెలిపింది. శాసనసభ ఆమోదం తర్వాత దీనిని గవర్నర్‌కు పంపనున్నారు. గవర్నర్ ఆమోదముద్ర పడగానే అధికారికంగా గెజిట్ విడుదల చేయనున్నారు. దీంతో అవయవ మార్పిడిలో నిబంధనలు ఉల్లంఘించినా, అక్రమాలకు పాల్పడినా శిక్షలు చాలా కఠినంగా ఉండనున్నాయి. అలాగే అవయవాల లభ్యత పెరగడంతోపాటు ప్రభుత్వ పర్యవేక్షణ ఉంటుంది. ఇప్పటిదాకా కుటుంబ సభ్యుల మధ్య ఉన్న సజీవ అవయవ దాన పరిధి విస్తృతమవుతుంది. అమ్మమ్మ, తాతయ్య సైతం తమ మనవళ్లు, మనవరాళ్లకు అవయవ దానం చేసే వెసులుబాటు కలుగుతుంది. కేంద్ర ప్రభుత్వం 1994లో తొలిసారిగా.. కేంద్ర మానవ అవయవ మార్పిడి చట్టం-1994 (ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆఫ్ హ్యూమన్ ఆర్గాన్స్ యాక్ట్ -టీహెచ్‌వోఏ)ను తీసుకువచ్చింది. దానిని ఉమ్మడి రాష్ట్రంలో అడాప్ట్ చేసుకొని ఆంధ్రప్రదేశ్ మానవ అవయవ మార్పిడి చట్టం-1995ను అమలు చేశారు. అనంతరం 2011లో కేంద్రం టీహెచ్‌వోఏ చట్టానికి సవరణలు చేసి మానవ అవయవాలు, కణజాలాల మార్పిడి చట్టం(ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆఫ్ హ్యూమన్ ఆర్గాన్స్ టిష్యూ యాక్ట్- టీహెచ్‌వోటీఏ)ను తీసుకువచ్చింది. అయితే 2014లో రాష్ట్ర విభజన తర్వాత అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం 2011 సవరణ చట్టాన్ని



కాకుండా.. ఉమ్మడి రాష్ట్ర చట్టమైన టీహెచ్‌వోఏనే అడాప్ట్ చేసుకుంది. తాజాగా దీనిపై కసరత్తు చేసిన ప్రభుత్వం.. 2011 (టీహెచ్‌వోటీఏ) చట్టాన్నే అడాప్ట్ చేసుకోవాలని నిర్ణయించింది.

పాత చట్టంలో ఏమున్నాయంటే..

టీహెచ్‌వోఏలో కాలేయం, గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీల మార్పిడినే చేర్చారు. ఇది అవయవ వ్యాపారాన్ని నియంత్రిస్తుంది. అయితే అవయవ మార్పిడి తర్వాత దాత, స్వీకర్త ఆరోగ్యాన్ని పర్యవేక్షించే విధానం ఇందులో లేదు. లైవ్ ఆర్గాన్ డొనేషన్స్ ఆమోదం కోసం ఒక అధికారిక కమిటీని ప్రభుత్వం నియమిస్తుంది. వైద్య విద్య సంచాలకుల ఆధ్వర్యంలో అవయవ మార్పిడి జరిగే ఆస్పత్రులను రిజిస్టర్ చేస్తారు. నిబంధనలు ఉల్లంఘించే వాటిపై డీఎంఈ చర్యలు తీసుకుంటారు. టీహెచ్‌వోఏ చట్టం ప్రకారం భార్య, భర్త, కుమారుడు, కుమార్తె, తండ్రి, తల్లి, సోదరుడు, సోదరి అవయవ దానం చేసేందుకు అర్హులవుతారు. సంబంధం లేని దాతలు అవయవం ఇవ్వాలంటే కమిటీ నుంచి ఆమోదం తీసుకోవాలి. బ్రెయిన్ డెడ్ ప్రకటించిన తర్వాతే కుటుంబ సభ్యుల అంగీకారంతో మృతదేహ అవయవాలను తీయవచ్చు. గుర్తుతెలియని మృతదేహాల నుంచి48 గంటల్లోపు అవయవాన్ని తీసుకోవచ్చు. ఉల్లంఘనలకు పాల్పడితే రూ.10వేల జరిమానా, గరిష్ఠంగా ఐదేళ్ల జైలు శిక్ష ఉంటుంది. లాభాపేక్ష లావాదేవీలకు 2 ఏళ్ల నుంచి 7ఏళ్ల జైలుశిక్ష, రూ.10-20వేల జరిమానా విధిస్తారు. ఆస్పత్రి రిజిస్ట్రేషన్‌లో ఉల్లంఘనలకు పాల్పడితే మూడేళ్ల వరకు జైలుశిక్ష, వైద్యులు తప్పు చేస్తే రిజిస్ట్రేషన్ రద్దు చేసే అవకాశం ఉంది.

కొత్తచట్టంతో ప్రయోజనాలెన్నో..

పాత చట్టం ప్రకారం గరిష్ఠంగా ఏడేళ్ల జైలు, రూ.10 వేల జరిమానా మాత్రమే ఉంది. తక్కువ శిక్షలుండటంతో అక్రమార్కులు యథేచ్ఛగా అక్రమ అవయవ మార్పిడి చేసేస్తున్నారు. అలాగే పాత చట్టంలో టిష్యూలైన చర్మం, ఎముక మజ్జ, గుండె కవాటాలు లాంటివి చేర్చలేదు. కొత్త చట్టం (టీహెచ్‌వోటీఏ)తో సన్నిహిత బంధువుల నిర్వచనాన్ని విస్తరించడంతోపాటు ఆస్పత్రుల్లో అవయవ మార్పిడి సమన్వయకర్తల నియామకం, బ్రెయిన్‌డెడ్‌లో ఫిజిషియన్, సర్జన్, అనస్తీషియా నిపుణులను చేర్చడం, నోటో, సోటో నెట్‌వర్క్ ఏర్పాటు, ఆస్పత్రులకు టిష్యూ బ్యాంకుల నమోదును తప్పనిసరి చేయడం వంటి వాటిని చేర్చారు. అలాగే అనుమతి లేకుండా అవయవాన్ని తొలగిస్తే పదేళ్ల జైలుశిక్ష, రూ.12 లక్షల జరిమానా విధిస్తారు. తప్పుడు ధ్రువపత్రాలు సమర్పిస్తే 5-10 ఏళ్ల జైలు శిక్ష, రూ.20 లక్షల నుంచి రూ.కోటి వరకు జరిమానా ఉంటుంది. ఇక టిష్యూ అక్రమ వ్యాపారం చేస్తే ఏడాది నుంచి మూడేళ్ల వరకు జైలుశిక్ష, రూ5 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు జరిమానా వేస్తారు. ఇతర ఉల్లంఘనలకు పాల్పడితే ఐదేళ్ల జైలు శిక్ష, రూ.20 లక్షల జరిమానా విధిస్తారు. పైగా ఈ చట్టాన్ని అన్వయం చేసుకోవడం వల్ల అవయవాల లభ్యత పెరుగుతుంది.

ఆర్థికంగా వెనుకబడిన తల్లిదండ్రులే లక్ష్యం

» తెలంగాణ సహా.. 9 రాష్ట్రాల్లో నెట్‌వర్క్

» చిన్నారుల కొనుగోలు కేసులో వెలుగులోకి విస్తుపోయే విషయాలు

హైదరాబాద్ సిటీ, మార్చి 23(ఆంధ్రజ్యోతి): పొత్తిళ్లలో ఉన్న చిన్నారులను కొనుగోలు చేసి, రాష్ట్రాలు దాటించి విక్రయిస్తున్న హైదరాబాద్‌కు చెందిన కృష్ణవేణి, అమూల్యతో పాటు అహ్మదాబాద్‌కు చెందిన వందనను అరెస్టు చేసి విచారిస్తున్న పోలీసులకు విస్తుపోయే విషయాలు తెలుస్తున్నాయి. పిల్లలు లేని తల్లిదండ్రులను లక్ష్యంగా చేసుకున్న కృష్ణవేణి, అమూల్యకు గుజరాత్‌లో అదే పనిచేస్తున్న అహ్మదాబాద్‌కు చెందిన వందనతో సామాజిక మాధ్యమాల్లో పరిచయం ఏర్పడింది. వీరు ముగ్గురు గుజరాత్, యూపీ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో తమ అనుచరుల ద్వారా నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకుని, అక్కడి మారుమూల ప్రాంతాల్లో, ఆర్థికంగా వెనుకబడిన తల్లిదండ్రుల అవసరాలను గుర్తించి వారికి సాయం చేస్తున్నట్లు నటించేవారు. అనంతరం వారి నుంచి చిన్నారులను కొనుగోలు చేసి పశ్చిమబెంగాల్, తమిళనాడు, కర్ణాటకతో పాటు రెండు తెలుగు రాష్ట్రాల్లో పిల్లలు లేని వారికి విక్రయించేవారు. ఆడపిల్లలను రూ. 2-3 లక్షలకు కొనుగోలు చేసి రూ.3-4లక్షలకు, మగ పిల్లలను రూ. 3-4 లక్షలకు కొనుగోలు చేసి రూ. 5-6 లక్షలు విక్రయించేవారని, అలా వచ్చిన కమీషన్‌ను వీరు పంచుకుంటున్నారని పోలీసులు గుర్తించారు. పిల్లల క్రయ విక్రయాలకు సంబంధించి ప్రధాన నిందితురాలైన వందనతో కృష్ణవేణి, అమూల్య వాట్సాప్ ఇతర సామాజిక మాధ్యమాల ద్వారానే మాట్లాడేవారని పోలీసులు తెలిపారు. కాగా, వివిధ రాష్ట్రాల నుంచి అక్రమంగా రవాణా అయిన చిన్నారుల తల్లిదండ్రులను గుర్తించడం పోలీసులకు చాలెంజింగ్‌గా మారింది. చిన్నారుల కొనుగోలు విషయంలో వందనకు ఇతర దళారులు సహకరించినట్లు పోలీసులు గుర్తించారు. వారంతా ఆస్పత్రుల్లో పనిచేసే ఆశా వర్కర్లు, ఆయాలు, కిందస్థాయి ఉద్యోగులని తెలిసింది. ఇప్పుడు వందనను విచారించినా చిన్నారుల అసలు తల్లిదండ్రులను కనిపెట్టడం కష్టమేనని పోలీసులు భావిస్తున్నారు.

కాలుష్య నివారణకు విద్యుత్ వాహన పాలసీ

» 296 కోట్లతో రాష్ట్ర వ్యాప్తంగా 37 ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లు

» కేసీఆర్‌పై నర్సారెడ్డి పోరాటానికి సంపూర్ణ మద్దతు: మంత్రి పొన్నం

తిమ్మాపూర్, గజ్వేల్, శామీర్‌పేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : కాలుష్య నివారణకు దేశంలోనే మొదటిసారిగా రాష్ట్రంలో విద్యుత్ వాహన పాలసీని తీసుకువచ్చామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్‌లోని జిల్లా రవాణా శాఖ కార్యాలయ ప్రాంగణంలో జువ్వాడి చొక్కారావు ట్రాఫిక్ అవగాహన పార్కును మంత్రి ప్రారంభించారు. ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐ టెక్నాలజీ ద్వారా వాహనాల ఫిట్‌నెస్‌ను నిర్ధారించేందుకు రూ.296కోట్లతో 37 ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నూతన స్క్రాప్ విధానం ద్వారా 15 సంవత్సరాలు దాటిన వాహనాల స్థానంలో కొత్తవి కొనుగోలు చేస్తే రాయితీ ఇస్తామన్నారు. కాగా కేసీఆర్‌పై గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి పోరాటానికి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు పొన్నం ప్రకటించారు. నర్సారెడ్డి చేపట్టిన పాదయాత్ర నాలుగో రోజు మంత్రి మార్గం మధ్యలో సంఘీభావం తెలిపి, మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, కేసీఆర్ నిర్ణయాలు, అమలు చేసిన పథకాలు, వివిధ శాఖల్లో చోటు చేసుకున్న అవినీతిపై విచారణ జరుగుతున్నట్లు తెలిపారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలని మంత్రి అధికారులకు సూచించారు. ఆయన హుస్నాబాద్‌లోని ఐకేపీ కార్యాలయంలో నియోజకవర్గ అభివృద్ధిపై ఆదివారం జరిగిన సమీక్షలో మాట్లాడారు. కాగా నర్సారెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆంక్షారెడ్డి చేపట్టిన పాదయాత్రకు శామీర్‌పేటలోనూ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదివారం మద్దతు తెలిపారు.



నర్సారెడ్డి పాదయాత్రకు మద్దతు తెలిపి మాట్లాడుతున్న మంత్రి పొన్నం

బిజినెస్

కార్లు మరింత ప్రియం

ఏప్రిల్ 1 నుంచి కొత్త ధరలు

న్యూఢిల్లీ: దేశీయ విపణిలో కార్ల ధరలు ప్రియం కానున్నాయి. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి సుమారుగా అన్ని కంపెనీల కార్ల ధరలు పెరగనున్నాయి. మారుతి సుజుకీ, మహీంద్రా, హ్యుండయ్, టాటా మోటార్స్, కియా, రెనో, హోండా కంపెనీలే కాకుండా లగ్జరీ కార్ల కంపెనీలైన మెర్సిడెజ్, బీఎండబ్ల్యూ, ఆడి వంటి కంపెనీలు కూడా కార్ల ధరలు పెంచుతున్నట్టు ప్రకటించాయి. కార్ల ధరలు పెరగడం ఈ ఏడాదిలో ఇది రెండోసారి. మోడల్‌ను బట్టి కార్ల ధరలో పెంపు శాతం భిన్నంగా ఉంటుంది. మారుతి సుజుకీ గరిష్ఠంగా 4% పెంపును ప్రకటించగా హ్యుండయ్ 3%, టాటా మోటార్స్ 2%, మహీంద్రా 3% పెంచుతున్నట్టు తెలిపాయి.

బోయింగ్‌లో 180 మందికి ఉద్వాసన

న్యూఢిల్లీ: అమెరికాకు చెందిన బోయింగ్ కంపెనీ బెంగళూరులోని తమ ఇంజనీరింగ్ టెక్నాలజీ సెంటర్‌లో 180 మందికి ఉద్వాసన చెబుతోంది. వారికి పింక్ స్లిప్‌లు ఇచ్చినట్టు కంపెనీ వర్గాలు తెలిపాయి. ఈ కంపెనీలో 7,000 మంది వరకు ఉద్యోగులు పని చేస్తున్నారు. గత ఏడాది కూడా కంపెనీ 10 శాతం మంది ఉద్యోగులను తగ్గించింది. అయితే దీనిపై కంపెనీ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఈ కంపెనీకి బెంగళూరు, చెన్నై నగరాల్లో ఇంజనీరింగ్, టెక్నాలజీ సెంటర్లున్నాయి.

ఫార్మా కింగ్ దివీస్ మురళి

జీవితంలో ఎదురయ్యే సవాళ్లను చూసి కొందరు నీరుగారి పోతారు. మరికొందరు వాటినే తమ అభివృద్ధికి సోపానాలుగా మార్చుకుంటారు. దివీస్ లేబొరేటరీస్ వ్యవస్థాపకులు, ఎండీ దివి మురళీ కృష్ణ ప్రసాద్ రెండో కోవకు చెందిన వ్యక్తి. దాదాపు రూ.82,000 కోట్ల నికర ఆస్తులతో భారత ఫార్మా రంగంలో దూసుకుపోతున్న ఈ 'ఫార్మా కింగ్' గురించి మరిన్ని వివరాలు.

డాక్టర్ దివి మురళీ కృష్ణ ప్రసాద్. భారత ఫార్మా పరిశ్రమలో ముఖ్యంగా హైదరాబాద్ ఫార్మా రంగంలో ఈ పేరు తెలియని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. పట్టుదల, నిజాయితీతో పారిశ్రామిక రంగంలో శిఖరాగ్ర స్థానానికి ఎదిగిన కొద్దిమంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తల్లో దివి మురళీ కృష్ణ ప్రసాద్ ఒకరు. కృష్ణా జిల్లాలోని ఒక మారుమూల గ్రామంలో 1951 మార్చి 17న ఒక పెద్ద కుటుంబంలో 13వ సంతానంగా ఆయన జన్మించారు. ఫోర్బ్స్ పత్రిక కథనం ప్రకారం గత ఏడాది దేశంలోని టాప్-100 మంది సంపన్నుల్లో దివి మురళీ 29వ స్థానంలో ఉన్నారు. ప్రస్తుతం దాదాపు రూ.82,000 కోట్ల ఆస్తులతో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత సంపన్నుడిగా ఎదిగిన దివి మురళీ కృష్ణ ప్రసాద్ ఎంతో మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు స్ఫూర్తి.

జీవిత ప్రస్థానం: దివి మురళీ చదువుల్లో ముందు నుంచి పెద్ద టాపరేమీ కాదు. టెన్త్ ఎలాగోలా గట్టెక్కినా, మచిలీపట్నంలో ఇంటర్ సెకండియర్ ఫెయిలయ్యారు. తర్వాత కష్టపడి ఇంటర్ పూర్తి చేసి కర్ణాటకలోని మణిపాల్ అకాడమీ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్‌లో బీ ఫార్మసీలో చేరారు. అక్కడా ఆయన చదువు పెద్దగా పుంజుకోలేదు. ఫస్ట్ ఇయర్ పూర్తి చేసేందుకూ బాగా కష్టపడాల్సి వచ్చింది. చివరికి ఆ కోర్సు పూర్తయ్యే సరికి యూనివర్సిటీలోనే టాపర్‌గా గోల్డ్ మెడల్ సాధించారు. తర్వాత అదే యూనివర్సిటీలో ఎం ఫార్మసీనీ గోల్డ్ మెడల్‌తో పూర్తి చేశారు. ఎం ఫార్మసీ పూర్తి చేశాక 1975లో హైదరాబాద్ వచ్చి వార్నర్ హిందుస్థాన్ అనే కంపెనీలో రూ.250 నెల జీతంతో ట్రైనీగా తన కెరీర్ ప్రారంభించారు. అలాగే కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో పీహెచ్‌డీ పట్టాను అందుకున్నారు.

పట్టుదలతో ఉన్నత శిఖరాలకు..
తెలుగు నేలపై అత్యంత సంపన్నుడు
రూ.82,000 కోట్ల నికర ఆస్తులు



అమెరికా పయనం: వార్నర్ హిందుస్థాన్ కంపెనీలో కొద్ది కాలం పని చేసేసరికే దివి మురళీ కృష్ణ ప్రసాద్‌కు బోరు కొట్టింది. ఇక్కడ లాభం లేదు. అమెరికా వెళ్లి మన లక్ పరీక్షించుకుందాం అనుకున్నారు. వెంటనే అమెరికా వీసా కోసం దరఖాస్తు చేశారు. గోల్డ్ మెడలిస్టు కావడంతో అమెరికా వీసా తేలిగ్గానే వచ్చింది. 1977లో రూ.600తో అమెరికాలో అడుగు పెట్టారు. అక్కడ దాదాపు ఏడేళ్ల పాటు అనేక ఫైన్ కెమికల్స్, ఫార్మా, కాస్మొటిక్ కంపెనీల్లో పని చేశారు. అప్పటికే అమెరికాలో శాశ్వతంగా ఉండేందుకు గ్రీన్ కార్డు కూడా వచ్చేసింది. అయినా ఏదో వెలితి. ఇంత కష్టపడి చదివి మన తెలివి తేటలన్నీ అమెరికా కోసమేనా. దేశం కాని దేశంలో ఎంతకాలం ఇలా బంధుమిత్రులు అందరికీ దూరంగా బతకాలి? అనే ప్రశ్నలు వేధించేవి. చివరకు ధైర్యం చేసి ఇండియా వచ్చేసారు.

ఇండియా వచ్చాక: ఇండియా అయితే వచ్చారు గానీ.. దివి మురళికి ఏమి చేయాలో వెంటనే తోచలేదు. ఏదైనా కంపెనీ పెట్టాలంటే చేతిలో పెద్దగా డబ్బులూ లేవు. అప్పుడే డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ అధినేత డాక్టర్ అంజిరెడ్డితో కలిసి 1984లో కెమినార్ డ్రగ్స్ అనే ఫార్మా కంపెనీని కొనుగోలు చేసి దాన్ని బహుముఖంగా విస్తరించారు. ఇక్కడా సవాళ్లు ఎదురైనా పట్టుదలతో వాటిని అధిగమించారు.

దివీస్ ల్యాబ్స్ ఏర్పాటు

అంజిరెడ్డితో కలిసి కెమినార్ డ్రగ్స్ కంపెనీని సక్సెస్ చేశాక.. 1990లో సొంతంగా 100 మంది ఉద్యోగులతో దివీస్ రీసెర్చ్ సెంటర్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ప్రత్యేక కంపెనీ ఏర్పాటు చేశారు. ప్రారంభంలో ఈ సంస్థ ఫార్మా కంపెనీలకు అవసరమైన టెక్నాలజీ, కన్సల్టెన్సీ సర్వీసులు అందించేది. ఈ అనుభవంతో ఔషధ పరిశ్రమకు కీలక ముడి పదార్థాలైన యాక్టివ్ ఫార్మా ఇన్‌గ్రిడియెంట్స్ (ఏపీఐ) తయారీ కోసం 1994లో నల్లగొండ జిల్లాలోని చౌటుప్పల్ సమీపంలో దివీస్ లేబొరేటరీస్ పేరుతో ప్రత్యేక ప్లాంట్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ప్రపంచంలోని టాప్-10 ఫార్మా కంపెనీల్లోని 8 కంపెనీలు తమకు అవసరమైన ఏపీఐలను దివీస్ నుంచే దిగుమతి చేసుకుంటున్నాయి. ఇప్పుడు ఈ కంపెనీకి చౌటుప్పల్‌తో పాటు విశాఖపట్నం సమీపంలోని చిప్పాడ వద్ద, కాకినాడ సమీపంలోని ఒంటిమామిడి గ్రామం వద్ద ఏపీఐ ప్లాంట్లు ఉన్నాయి. తుది ఔషధాల ఉత్పత్తికి అవసరమైన కీలక ఏపీఐల ఉత్పత్తిలో దివీస్ ల్యాబ్స్ ఇప్పుడు ప్రపంచంలోనే మేటి కంపెనీ. కంపెనీ షేర్ల మార్కెట్ క్యాప్ కూడా గత వారం రూ.1.53 లక్షల కోట్లకు చేరింది. ఇందులో దాదాపు 40 శాతం గత ఏడాది కాలంలో పెరగడం విశేషం.

23,650 పైన బుల్లిష్

(మార్చి 24-28 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 23,350-22,353 పాయింట్ల మధ్యన కదలాడి 953 పాయింట్ల లాభంతో 23,350 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 23,650 ఎగువన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 23,129, 22,776, 22,562, 22,718 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి: 23,650 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 23,050
నిరోధ స్థాయిలు: 23,550, 23,650, 23,750 (23,450 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 23,150, 23,050, 22,950 (23,250 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)




24వ తేదీ			
హైదరాబాద్	420	విజయవాడ	440
వరంగల్	422	గోదావరి	420
చిత్తూరు	470	విశాఖపట్నం	420
		డజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	101	విజయవాడ	105
వరంగల్	101	గుంటూరు	103
కరీంనగర్	101	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	101	చిత్తూరు	86
కర్నూలు	101	నెల్లూరు	91
విశాఖపట్నం	99	అనంతపురం	91
గోదావరి	105		

కన్సాలిడేషన్‌కు ఆస్కారం



వి. సుందర్ రాజా
టెక్ వ్యూ

నిఫ్టీ గత వారం బలమైన ర్యాలీతో ఐదు ట్రేడింగ్ దినాలూ లాభాల్లోనే కదలాడి చివరికి ముందు వారంతో పోల్చితే 950 పాయింట్ల లాభంతో ముగిసింది. ఐదు వారాల నిరంతర కరెక్షన్ అనంతరం ఏర్పడిన టెక్నికల్ పునరుజ్జీవం ఇది. మిడ్‌క్యాప్-100 (7.7%), స్మాల్‌క్యాప్-100 (8.6%) సూచీలు కూడా ఇదే విధమైన ర్యాలీలో నడిచాయి. అయితే ఐదు రోజుల ర్యాలీ కారణంగా ఇప్పుడు కన్సాలిడేట్ కావలసి ఉంది. ప్రధాన ట్రెండ్ పాజిటివ్‌గానే ఉన్నా ఈ వారంలో జోరు కొంత తగ్గవచ్చు. తదుపరి నిరోధం 23,500.

బుల్లిష్ స్థాయిలు: సానుకూలత కోసం ప్రస్తుత గరిష్ఠ స్థాయిల్లో కన్సాలిడేషన్ అనంతరం తదుపరి నిరోధం 23,500 కన్నా పైన నిలదొక్కుకోవలసి ఉంటుంది. ప్రధాన నిరోధం 24,000.

బేరిష్ స్థాయిలు: ఏ మాత్రం బలహీనత ప్రదర్శించినా భద్రత కోసం మద్దతు స్థాయి 22,200 వద్ద నిలదొక్కుకోవాలి. విఫలమైతే మరింత బలహీనపడుతుంది. ప్రధాన స్వల్పకాలిక మద్దతు స్థాయి 22,000. అంతకన్నా దిగజారితే స్వల్పకాలిక కరెక్షన్‌లో పడుతుంది.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ కూడా 2,500 పాయింట్ల బలమైన ర్యాలీతో 50,600 వద్ద ముగిసింది. నిరోధ స్థాయి 50,700 వద్ద కన్సాలిడేట్ కావచ్చు. ఆ పైన మాత్రమే స్వల్పకాలిక సానుకూలత ఏర్పడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 50,000. ఇక్కడ విఫలమైతే స్వల్పకాలిక బలహీనత తప్పదు.

పాటర్న్: గత శుక్రవారం నిఫ్టీ 50 డీఎంఏను దాటింది. ఇప్పుడు 23,500 సమీపంలో ఉన్న 100 డీఎంఏకు చేరువవుతోంది. ఇక్కడ కన్సాలిడేషన్ ఉండవచ్చు. ఆర్ఎస్ఐ సూచీల ప్రకారం స్వల్పకాలిక ఓవర్‌బాట్ స్థితిలో ప్రవేశిస్తున్నందు వల్ల ట్రేడర్లు అప్రమత్తంగా ఉండాలి. సానుకూలత కోసం 23,500 వద్ద "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" కన్నా పైన నిలదొక్కుకోవాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం బుధవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	23,440, 23,500
మద్దతు	23,280, 23,200

ఈ వారం నిలదొక్కుకుంటేనే!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మెరుగ్గా కదలాడే అవకాశాలున్నాయి. ప్రస్తుతానికి అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు కనిపించటం లేదు. మరోవైపు భారత ఈక్విటీ మార్కెట్లలోకి విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల నుంచి పెట్టుబడుల రాక మొదలైంది. గత శుక్రవారం 23,350 వద్ద ముగిసిన నిఫ్టీకి 23,800 వద్ద తక్షణ నిరోధం ఉంది. అయితే ప్రస్తుత స్థాయిలోనే మరింత కన్సాలిడేట్ అవ్వటం ముఖ్యం. అప్పుడే సూచీకి మరింత పటిష్ఠత లభిస్తుంది. ఇన్వెస్టర్లలో ఆత్మ విశ్వాసం పెరుగుతుంది.

స్టాక్ రికమండేషన్స్

టీవీఎస్ మోటార్స్: గత ఏడాది సెప్టెంబరు నుంచి ఈ షేరు డౌన్‌ట్రెండ్‌లోనే కొనసాగుతూ వస్తోంది. దాదాపు 25 శాతం వరకు దిద్దుబాటుకు లోనయ్యాయి. కీలకమైన రూ.2,230 స్థాయిలో డబుల్ బాటమ్ ఏర్పడింది. అక్కడి నుంచి మళ్లీ టర్న్ అరౌండ్ మొదలైనట్లు కనిపిస్తోంది. గత వారం ఐదు సెషన్లలోనూ ఈ షేరు వరుసగా లాభపడింది. గత శుక్రవారం రూ.2,413 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.2,400 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.2,550/2,600 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.2,360 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

మ్యాన్‌కైండ్ ఫార్మా: జీవితకాల గరిష్ఠ స్థాయి నుంచి 30 శాతం మేర దిద్దుబాటుకు లోనైన ఈ షేరు ప్రస్తుతం దూకుడును ప్రదర్శిస్తోంది. చివరి రెండు సెషన్లలో భారీ వాల్యూమ్‌తో 12 శాతం మేర లాభపడింది. ఫార్మా రంగంలో మంచి మూమెంటమ్ కనిపిస్తుండటం శుభపరిణామం. గత శుక్రవారం రూ.2,415 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.2,350 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.2,540 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.2,310 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఎస్‌బీఐ లైఫ్: సెప్టెంబరు నుంచి డౌన్‌ట్రెండ్‌లో కొనసాగిన ఈ కౌంటర్‌లో ఈ ఏడాది ఆరంభం నుంచి అక్యుములేషన్ మొదలైంది. మార్కెట్లు నష్టాల్లో ఉన్నప్పటికీ ఈ షేరు బలాన్ని ప్రదర్శించింది. గత వారం దాదాపు 12 శాతం మేర పెరిగింది. ప్రస్తుతం ఈ షేరు కీలకమైన రూ.1,550 నిరోధ స్థాయికి చేరుకుంది. ఈ స్థాయిని బ్రేక్ చేస్తే మరింత పెరగటం ఖాయం. గత శుక్రవారం రూ.1,546 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,520 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.1,660/1,690 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,480 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఎంఆర్‌పీఎల్: గత ఏడాది ఫిబ్రవరి నుంచి ఈ షేరు డౌన్‌ట్రెండ్‌లోనే కొనసాగుతూ వస్తోంది. తాజాగా భారీ వాల్యూమ్‌తో రేంజ్ ఎక్స్‌పాన్షన్ కనిపిస్తోంది. ఈ షేరు గత నెల 22 శాతం, గత వారం 13 శాతం మేర పెరిగింది. గత శుక్రవారం 14శాతం లాభంతో రూ.135 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.130 శ్రేణిలో ఎంటరై రూ.165 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.120 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఎన్‌హెచ్‌పీసీ: రెండు నెలలుగా ఈ కౌంటర్‌లో మంచి బేస్ ఏర్పడుతోంది. డార్వాస్ బాక్స్ ప్యాటర్న్ కనిపిస్తోంది. ప్రస్తుతం స్వల్పకాల నిరోధం రూ.82కి చేరుకుంది. దీన్ని అధిగమిస్తే మూమెంటమ్ పెరగవచ్చు. గత వారం ఈ షేరు 6 శాతం మేర పెరిగింది. గత శుక్రవారం రూ.82 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.80 వద్ద పొజిషన్ తీసుకుని రూ.115 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.76 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

11 వేల ఎకరాల్లో పంట నష్టం

» అధికారులు పూర్తి సర్వే చేసి నివేదిక పంపాలి: తుమ్మల

హైదరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వడగళ్ల వాన, ఈదురు గాలులకు రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాల్లో 11 వేల ఎకరాల్లో పంటనష్టం జరిగినట్లు ప్రాథమిక నివేదిక వచ్చిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఇప్పటివరకు ప్రాథమిక అంచనా వేసిన వ్యవసాయశాఖ అధికారులు.. గ్రామాల వారీగా సర్వేచేసి నివేదికలు ప్రభుత్వానికి పంపాలని ఆదేశించారు. రైతులు కూడా అధికారులకు సహకరించాలని, వాస్తవ సమాచారాన్ని అధికారులకు ఇవ్వాలని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. కాగా, అధికారంలో ఉన్నప్పుడు రుణమాఫీ పథకాన్ని అస్తవ్యస్తంగా అమలుచేసి, రెండు పర్యాయాలు చేతులెత్తేసిన బీఆర్ఎస్ పార్టీకి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కులేదని మంత్రి తుమ్మల అన్నారు. రుణమాఫీ-2024 పథకాన్ని పక్కాగా అమలు చేసి ఇతర రాష్ట్రాలకు దిక్సూచిలా నిలిస్తే.. అభినందించాల్సిందిపోయి విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు.

ఫ్యూచర్ సిటీలో మహేశ్వరం విలీనంపై సీఎంతో చర్చిస్తా: శ్రీధర్ బాబు



మహేశ్వరం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలాన్ని ఫ్యూచర్ సిటీలో విలీనం చేయాలనే జేఏసీ విజ్ఞప్తిని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. జేఏసీ నాయకులు ఆదివారం కేఎల్లార్ అధ్వర్యంలో మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డిని వేర్వేరుగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. భవిష్యత్ తరాల కోసం మహేశ్వరంతో పాటు కందుకూరు మండలాన్ని కూడా పూర్తిగా ఫ్యూచర్ సిటీలో విలీనం చేయాల్సి ఉంటుందన్నారు. గ్రామాలు విశ్వనగరంగా మారినప్పుడు లాభం ఎంత ఉంటదో.. నష్టం కూడా అంతే ఉంటుందని ఆయన చెప్పారు.

అర్చకులకు మెరుగైన వేతనం ఇస్తాం: సురేఖ

హైదరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడ్డాక అర్చకులకు ప్రతినెలా వేతనాలు అందేలా చర్యలు చేపట్టారని, త్వరలోనే ధూపదీప నైవేద్య అర్చకులకు మెరుగైన వేతనం అందేలా కృషి చేస్తామని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చెప్పారు. ధూపదీప నైవేద్య అర్చక సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన విశ్వావసు నామ సంవత్సర పంచాంగాన్ని ఆదివారం మంత్రి తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం, ప్రజలు సుభిక్షంగా ఉండాలని.. దీనికి భగవంతుని కృప అవసరమని.. ఇందుకోసం అర్చకులు నిత్యం అర్చనలు చేయాలన్నారు.

ఎమ్మెల్యేల ఫిరాయింపులపై నేడు సర్కార్ అఫిడవిట్!

» రేపు సుప్రీం కోర్టులో విచారణ

న్యూఢిల్లీ, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేల ఫిర్యాయింపుల అంశంపై తెలంగాణ ప్రభుత్వం సోమవారం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసే అవకాశమున్నట్టు తెలిసింది. అందుకు సంబంధించిన పిటిషన్లపై మంగళవారం విచారణ జరగనుంది. బీఆర్ఎస్ తరఫున గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారని, వారిపై అనర్హత వేటు వేసేలా స్పీకర్‌ను ఆదేశించాలని కోరుతూ జనవరి 15న సుప్రీంకోర్టులో మూడు వేర్వేరు పిటిషన్లు దాఖలయ్యాయి. మార్చి 22లోపు సమాధానం చెప్పాలని అసెంబ్లీ స్పీకర్, రాష్ట ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల సంఘం సహా ప్రతివాదులు అందరికీ గత విచారణ సందర్భంగా నోటీసులు జారీ చేసింది. నోటీసులు అందుకున్నవారిలో గూడెం మహిపాల్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాత్రమే అఫిడవిట్లు దాఖలు చేశారు. తాము బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతున్నామని, పార్టీ ఫిరాయింపు ఆరోపణల్లో వాస్తవం లేదని తెలిపారు.

భద్రాచలం ఆలయ అభివృద్ధిపై సీఎం నజర్

» భూసేకరణ, నిధుల వివరాలు సిద్ధం చేయాలంటూ అధికారులకు ఆదేశం

» సీతారాముల కల్యాణానికి రావాలంటూ సీఎం రేవంత్‌కు మంత్రి సురేఖ ఆహ్వానం

హైదరాబాద్/భద్రాచలం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం దేవస్థానం అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టి సారించారు. ఆలయ అభివృద్ధికి అవసరమైన భూసేకరణ, నిధులకు సంబంధించి పూర్తి వివరాలను ఇవ్వాలంటూ అధికారులను ఆదేశించారు. భద్రాచలం దేవస్థానంలో ఏప్రిల్ 6న నిర్వహించే శ్రీరామనవమి కల్యాణ మహోత్సవానికి హాజరుకావాలంటూ ముఖ్యమంత్రిని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఆలయ అర్చకులు, అధికారులు ఆహ్వానించారు. ఆదివారం హైదరాబాద్‌లో సీఎంను ఆయన నివాసంలో కలిసిన వారు.. ఆహ్వాన పత్రాన్ని అందించారు. అలాగే డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రి తుమ్మలనూ ఆహ్వానించారు. అనంతరం శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్‌ను సీఎం, మంత్రులు కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్.. భద్రాచలం ఆలయ అభివృద్ధికి అవసరమైన భూసేకరణ, ఇతర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వీటికి సంబంధించి పూర్తి వివరాలను అందించాలని ఆదేశించారు. అనంతరం దేవస్థానం రామాయణ పారాయణదారుడు ఎస్జీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు రచించిన తెలుగు కావ్య ప్రబంధ కథలు గ్రంథాన్ని సీఎం ఆవిష్కరించారు. తెలుగులో ఎంతో మంచి గ్రంథాన్ని రాశారని కృష్ణమాచార్యులును ఆయన ప్రశంసించారు. కార్యక్రమంలో సీఎం సలహాదారు నరేందర్ రెడ్డి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, ఆ శాఖ కమిషనర్ శ్రీధర్, భద్రాచలం ఆలయ ఈవో రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు కొండా సురేఖ, తుమ్మల

రహీం ఆగాఖాన్‌కు సీఎం అభినందనలు..

షియా ఇస్మాయిలీ ముస్లిం సమాజానికి 50వ వారసత్వ ఇమామ్‌గా, ఆగాఖాన్ డెవలప్‌మెంట్ నెట్ వర్క్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన రహీం ఆగాఖాన్‌కు సీఎం రేవంత్ అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో చారిత్రక వారసత్వ సంపద పరిరక్షణ, విద్య, అభివృద్ధి కోసం ఆగాఖాన్ నెట్‌వర్క్ చేస్తున్న కృషి ఎంతో అమూల్యమైందని ఓ ప్రకటనలో కొనియాడారు. రహీం ఆగాఖాన్ నాయకత్వంలో రాష్ట్రానికి ఆగాఖాన్ నెట్‌వర్క్ సహకారం మరింత పెరగాలని సీఎం ఆకాంక్షించారు.


'యువ వికాసం' తిరస్కరణ

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటు చేసుకునేందుకు ఆసక్తి చూపలేదు. మరికొందరికి మంజూరే కాలేదు. వీరు ప్రస్తుతం రాజీవ్ యువ వికాసం కింద దరఖాస్తు చేసుకోవడానికి ఆన్‌లైన్ సెంటర్లకు వెళ్లి.. ఆధార్ నంబర్‌ను నమోదు చేయగానే దరఖాస్తులు రిజెక్ట్ అవుతున్నాయి. 'ఆల్రెడీ అప్లైడ్' అని చూపుతోంది. వీరే కాకుండా.. వికలాంగుల శాఖ ద్వారా స్వయం ఉపాధి కోసం ఏడాది క్రితం పలువురు దివ్యాంగులు దరఖాస్తు చేసుకున్నారు. కానీ, వీరి నుంచి లబ్ధిదారుల ఎంపిక జరగలేదు. ప్రస్తుతం వీరు కూడా యువ వికాసం కింద దరఖాస్తు కోసం ప్రయత్నిస్తే 'ఆల్రెడీ అప్లైడ్' అనే చూపుతోంది. అయితే గతంలో దరఖాస్తుదారులు నమోదు చేసిన వివరాలను అధికారులు తొలగించకపోవడం వల్లే ఈ సమస్య ఎదురవుతున్నట్లు తెలుస్తోంది. కానీ, ఈ పరిణామంతో నిరుద్యోగ యువత ఆందోళన చెందుతున్నారు. కొత్త దరఖాస్తులను స్వీకరించని పక్షంలో తాము గతంలో చేసిన దరఖాస్తులనైనా పరిగణనలోకి తీసుకోవాలని, ప్రభుత్వం దీనిపై స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు.

ఏప్రిల్ 5వరకు దరఖాస్తుల స్వీకరణ..

రాజీవ్ యువ వికాసం పథకానికి ఏప్రిల్ 5వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ఈ నెల 16న నోటిఫికేషన్ జారీ చేసిన మరుసటి రోజే దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆన్‌లైన్‌లో, మండల కార్యాలయాలు, ప్రజాపాలన కేంద్రాల ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిశాక.. ఏప్రిల్ 6 నుంచి లబ్ధిదారుల ఎంపిక, యూనిట్ల మంజూరు ప్రక్రియ మొదలు పెడతారు. మే 30వరకు ఈ ప్రక్రియ కొనసాగనుంది. మండల స్థాయిలో దరఖాస్తులను పరిశీలించి జాబితాను కలెక్టర్లకు పంపితే.. జిల్లా కమిటీ లబ్ధిదారులను ఎంపిక చేస్తుంది. అనంతరం లబ్ధిదారుల జాబితాను ఇన్‌చార్జి మంత్రికి పంపిస్తారు. ఇన్‌చార్జి మంత్రి పరిశీలన అనంతరం లబ్ధిదారులను ప్రకటిస్తారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక లబ్ధిదారులకు మంజూరు పత్రాలను తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం దినోత్సవం సందర్భంగా జూన్ 2న ప్రారంభించి 9వ తేదీ వరకు అందజేస్తారు. ఈ నేపథ్యంలో యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకోవాలంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆయా నియోజకవర్గాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఎక్కువ మంది ఈ పథకాన్ని వినియోగించుకునేలా విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని ప్రభుత్వం సంకల్పించడంతో.. ఎమ్మెల్యేలు గ్రామాల్లో నిరుద్యోగ యువతకు పథకంపై అవగాహన కల్పిస్తున్నారు. ఏయే యూనిట్‌కు ఎంత రుణం వస్తుంది, ప్రభుత్వ రాయితీ ఎంత.. వంటి విషయాలపై ఎమ్మెల్యేల పేరుతో ప్రచురించిన కరపత్రాలతోపాటు సామాజిక మాధ్యమాల ద్వారా గ్రామ, మండల స్థాయిల్లో పార్టీ నాయకులు ప్రచారం మొదలుపెట్టారు.



ఒక్కో యూనిట్‌కు ఒక్కో రకంగా..

యువ వికాసం పథకంలో వివిధ రకాల స్వయం ఉపాధి యూనిట్లు ఉన్నాయి. వీటిలో రూ.50 వేల యూనిట్‌కు దరఖాస్తు చేసుకున్నవారికి ప్రభుత్వం నూరు శాతం రాయితీ ప్రకటించింది. వీరు తిరిగి ఒక్క పైసా కూడా చెల్లించాల్సిన అవసరం లేదు. ఇక రూ.50 వేలకు పైన విలువ చేసే యూనిట్లకు 60 నుంచి 80 శాతం వరకు రాయితీ ఉంటుందని ప్రభుత్వం ప్రకటించింది. అయితే.. ఇంకా స్పష్టమైన మార్గదర్శకాలు రాకపోవడంతో రాయితీ ఎంత? గరిష్ఠంగా ఎంత మొత్తం ఇస్తారు? వీటిలో లబ్ధిదారు వాటా ఎంత? అన్నదానిపై స్పష్టత ఇంకా స్పష్టత లేదు. అయితే ఇప్పటికే ప్రకటించిన వివరాల్లో కొన్ని మార్పులు ఉండే అవకాశం మాత్రం ఉందని ఎస్సీ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న అధికారి ఒకరు 'ఆంధ్రజ్యోతి'తో చెప్పారు. పథకంపై సోమవారం పూర్తి మార్గదర్శకాలను ప్రకటించే అవకాశం ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. కాగా, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్లు చాలా కాలం నుంచి నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అందించే ప్రక్రియను నిలిపేశాయి. దీంతో ప్రస్తుతం రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. ఈ బడ్జెట్‌లో ప్రభుత్వం ఈ పథకానికి 6 వేల కోట్లు కేటాయించింది. ఈ నిధులతో ఈ ఏడాది దాదాపు 5 లక్షల మందిని ఎంపిక చేసి వారికి స్వయం ఉపాధి కల్పించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

సన్నబియ్యం వచ్చేస్తున్నాయ్

(మొదటిపేజీ తరువాయి)

సన్నబియ్యం రవాణా ప్రక్రియను ప్రారంభించారు. నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో ఉన్న గోదాముల నుంచి.. చౌకడిపోలకు బియ్యాన్ని తరలించారు. సోమవారం నుంచి ఇతర జిల్లాల్లో కూడా సన్నబియ్యం రవాణా ప్రారంభిస్తామని పౌర సరఫరాల శాఖ అధికారులు తెలిపారు. సాధారణంగా ప్రతి నెల ఒకటో తేదీ నుంచి చౌక డిపోల్లో బియ్యం పంపిణీ ప్రారంభమవుతుంది. అయితే, ప్రభుత్వ నిర్ణయంతో ఈసారి మార్చి 30, ఉగాది రోజునే సన్నబియ్యం పంపిణీ ప్రారంభించనున్నారు. దీంతో మార్చి29 కల్లా రాష్ట్రంలోని అన్ని చౌకడిపోలకు సన్నబియ్యాన్ని చేర్చడమే లక్ష్యంగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఏప్రిల్ నెల కోటాకు సుమారు 2 లక్షల టన్నుల సన్నబియ్యాన్ని సర్దుబాటు చేస్తున్నారు. కొన్ని జిల్లాల్లో సన్నబియ్యం లేకపోతే.. ఇతర జిల్లాల నుంచి తరలించి గోదాముల్లో నిల్వ చేస్తున్నారు. గత ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం కనీస మద్దతు ధరకు అదనంగా క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ ఇచ్చి రైతుల నుంచి సన్నాలు సేకరించింది. గత వానాకాలంలో ప్రభుత్వం 54 లక్షల టన్నుల ధాన్యం సేకరించి మిల్లర్లకు అప్పగించింది. రైస్‌మిల్లర్లు 36 లక్షల టన్నుల బియ్యాన్ని తిరిగి ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉండగా ఇప్పటిదాకా 12 లక్షల టన్నుల బియ్యం మాత్రమే వచ్చింది. పీడీఎస్ అవసరాలకు ప్రతి నెలా 2 లక్షల టన్నుల బియ్యం అవసరం. వానాకాలంలో సేకరించిన ధాన్యం వార్షిక కోటాకు సరిపోయే పరిస్థితి లేదు. దీంతో యాసంగి సీజన్‌లో సేకరించే ధాన్యం నుంచి మిగిలిన బియ్యం ప్రొక్యూర్మెంట్ చేసేలా పౌరసరఫరాల శాఖ ఏర్పాట్లు చేస్తోంది. పీడీఎస్ ద్వారా పేదలకు పంపిణీ చేసే బియ్యాన్ని 'బలవర్ధక బియ్యం'(ఫోర్టిఫైడ్ రైస్) రూపంలోనే ఇవ్వనున్నారు. తాజాగా ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబరు7లో ఈ విషయాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. కాగా, ఇదివరకు పంపిణీ చేసినట్లుగానే.. ఆహారభద్రత కార్డుల్లో సభ్యులుగా ఉన్నవారికి ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున సన్నబియ్యం పంపిణీ చేయనున్నారు. ఇది వరకు రాష్ట్రంలో 90 లక్షల రేషన్ కార్డులుండగా 2.81 కోట్ల మంది లబ్ధిదారులున్నారు. ఇటీవల కొత్త రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న నేపథ్యంలో ఈ సంఖ్య మరింత పెరగనుంది.

15 లక్షలు పెరిగిన ఓపీ!

రెండేళ్లలో 70 లక్షలకు చేరిన ల్యాబ్ టెస్టులు.. కొత్త బోధనాస్పత్రులకు భారీగా రోగులు

» స్పెషాలిటీ సేవలతో సర్కారీ ఆస్పత్రులపై పెరిగిన నమ్మకం

» పేదలకు తగ్గిన వైద్య ఖర్చుల భారం

హైదరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వ వైద్య కళాశాలలు, వాటి అనుబంధ ఆస్పత్రులపై రోగులకు నమ్మకం పెరిగింది. స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి రావడంతో కొత్త బోధనాస్పత్రులకు రోగుల తాకిడి పెరిగింది. రెండేళ్లలో అవుట్ పేషంట్ల సంఖ్య ఏకంగా 15 లక్షలు పెరగడం గమనార్హం. ఇన్ పేషంట్ల సంఖ్య కూడా పెరిగింది. ప్రసవాలు మొదలుకొని పెద్ద శస్త్రచికిత్సల వరకు, ఎక్స్‌రేల నుంచి సీటీ స్కాన్ల వరకు అన్ని రకాల సేవలు అందుబాటులోకి రావడంతో పేదలకు ఉపయోగకరంగా మారాయి. 2022-23లో మంచిర్యాల, రామగుండం, జగిత్యాల, వనపర్తి, నాగర్‌కర్నూల్, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, సంగారెడ్డిలో మొత్తం 8 వైద్య కళాశాలలను నాటి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఒక్కో కాలేజీలో 150 ఎంబీబీఎస్ సీట్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. అనంతరం 2023-24లో కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, జయశంకర్ భూపాలపల్లి, ఆసిఫాబాద్, నిర్మల్, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, జనగాం జిల్లాల్లో కొత్తగా మరో 9 వైద్య కళాశాలలను ఏర్పాటు చేసింది. ఒక్కో కాలేజీలో 100 ఎంబీబీఎస్ సీట్లతో వీటిని అందుబాటులోకి తీసుకొచ్చింది. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం ఆయా కళాశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించింది. ఈ 17 వైద్య కళాశాలలకు అనుబంధంగా బోధనాస్పత్రులు ఏర్పాటయ్యాయి. జాతీయ వైద్య కమిషన్ నిబంధనల మేరకు ఒక్కో ఆస్పత్రిలో పడకల సంఖ్యను 300కు పెంచారు.

గ్రామీణ ప్రాంతాల్లో మరింత ప్రయోజనం

గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ఏర్పాటైన బోధనాస్పత్రులతో అక్కడి పేద, గిరిజన ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. ఉదాహరణకు గిరిజనులు ఎక్కువగా ఉండే మహబూబాబాద్ ప్రాంతంలో వైద్య కళాశాల ఏర్పాటైన తర్వాత ఓపీ, ఐపీ రెండేళ్లలోనే రెట్టింపు అయ్యాయి. 2021లో ఓపీ 1.65 లక్షలు రాగా, 2024 నాటికి 3.18 లక్షలకు పెరిగింది. గతంలో 3వేల లోపు సర్జరీలు జరగ్గా.. ఇప్పుడా సంఖ్య ఐదువేల వరకు నమోదైంది. మిగతా జిల్లాల్లోనూ ఇలాగే సంఖ్య పెరిగింది. అలాగే అయితే వీటిలో కొన్ని కాలేజీలు, ఆస్పత్రులకు రెగ్యులర్ ప్రిన్సిపాళ్లు, సూపరింటెండెంట్లు లేక ఇన్‌చార్జిలతోనే నెట్టుకొస్తున్నారు. పూర్తిస్థాయిలో అధ్యాపకులూ లేరు. ఇలాంటి సమస్యలను పరిష్కరిస్తే వైద్యసేవలు మరింత విస్తృతంగా అందుబాటులోకి వస్తాయి. ప్రజలపై వైద్య ఖర్చుల భారం మరింత తగ్గుతుంది.

17 బోధనాస్పత్రుల్లో సేవల తీరు..

సేవలు	2021లో	2024లో
అవుట్‌పేషంట్లు	26.53లక్షలు	41.29లక్షలు
ఇన్‌పేషంట్లు	3.47లక్షలు	4.18లక్షలు
పెద్ద శస్త్రచికిత్సలు	38,230	52146
చిన్న శస్త్రచికిత్సలు	17199	89374
ప్రసవాలు	58829	65442
ల్యాబ్ టెస్టులు	27.38లక్షలు	69.45లక్షలు
ఈసీజీలు	59113	2.22 లక్షలు
అల్ట్రాసౌండ్ స్కానింగ్స్	1.43లక్షలు	4.54లక్షలు
ఎక్స్‌రే	1..36లక్షలు	3.59లక్షలు
సీటీస్కానింగ్‌లు	18790	45196

2021 వరకు టీవీవీపీ పరిధిలో ఉన్న ఈ 17 ఆస్పత్రుల్లో ఓపీ, ఐపీ మామూలుగా ఉండేవి. అయితే డీఎంఈ పరిధిలోకి రాగానే వాటి సంఖ్య దాదాపు రెట్టింపు అయింది.

బోధనాస్పత్రులకు ప్రత్యేక గుర్తింపు దిశగా చర్యలు



ప్రభుత్వ బోధనాస్పత్రులపై రోగులకు నమ్మకం పెరిగింది. కొత్తగా ఏర్పాటైన మెడికల్ కాలేజీ అనుబంధ ఆస్పత్రుల్లో భారీగా ఓపీ, ఐపీ నమోదు అవుతోంది. ఆ మేరకు వైద్యసేవలు పెరిగాయి. మరింత పెరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. బోధనాస్పత్రులకు ప్రత్యేక గుర్తింపు తెచ్చే దిశగా చర్యలు తీసుకుంటున్నాం. వచ్చే నెలలో ఈ కాలేజీలన్నింటికీ రెగ్యులర్ ప్రిన్సిపాళ్లు, ఆస్పత్రులకు సూపరింటెండెంట్లను నియమించనున్నాం.

- ఎ.నరేంద్రకుమార్, డీఎంఈ

రాజ్యాంగాన్ని రక్షించుకుంటేనే మనుగడ

» గాంధేయ మార్గంలో ఊరూరా పాదయాత్రలు చేపట్టాలి

» పనిచేయని పార్టీ నేతలపై చర్యలు: మహేశ్ గౌడ్



రంగారెడ్డి అర్బన్/హైదరాబాద్ సిటీ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాన్ని రక్షించుకుంటేనే దేశ మనుగడ సాధ్యమని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యానించారు. కేంద్రంలోని బీజేపీ రాజ్యాంగ విలువలను కాలరాస్తూ, మనువాద రాజ్యాంగాన్ని తీసుకురావాలని ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. మతవాదుల నుంచి దేశాన్ని కాపాడుకోవాలంటే.. మరోసారి గాంధేయ మార్గంలో 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్' పేరుతో గ్రామాల్లో పాదయాత్రలు చేపట్టి రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా షైలార్‌దేవ్‌పల్లిలో 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్' సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా మహేశ్‌గౌడ్ హాజరై మాట్లాడారు. 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్' కార్యక్రమాన్ని కాంగ్రెస్ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో కరపత్రాలు పంపిణీ చేసి అంబేడ్కర్ గొప్పతనాన్ని చాటి చెప్పాలన్నారు. కాంగ్రెస్‌లో పదవులు అనుభవిస్తూ పార్టీ కోసం పనిచేయని నాయకులపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కాగా, స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలంటే పాదయాత్రలు చేపట్టి ప్రజల సమస్యలను గుర్తించి పనిచేయాలని కాంగ్రెస్ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కోట నీలిమ పి లుపునిచ్చారు. 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా గాంధీభవన్‌లో సికింద్రాబాద్ పరిధిలోని ఐదు ని యోజకవర్గాల నేతల సన్నాహక భేటీలో వారు పాల్గొని మాట్లాడారు.

త్వరలో ఎస్‌ఎల్‌బీసీ పునః ప్రారంభం

» చివరి గింజ పండే వరకు సాగర్ ఆయకట్టుకు నీరు అందిస్తాం: ఉత్తమ్



మాట్లాడుతున్న మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, జానారెడ్డి

పాలకవీడు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఎల్ఎస్‌బీసీ దుర్ఘటనతో పనులు నిలిచాయని, త్వరలోనే ఎస్ఎల్‌బీసీ పనులను తిరిగి ప్రారంభిస్తామని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తిచేస్తామని చెప్పారు. సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం జాన్‌పహాడ్ దర్గాలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నల్లగొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, ఉమ్మడి నల్లగొండ జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో కలిసి ఆదివారం ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న అనంతరం డెక్కన్ సిమెంట్ కర్మాగారంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. డిండి ప్రాజెక్టు పనులు వేగవంతం చేస్తామన్నారు. గత బీఆర్ఎస్ పాలకుల నిర్లక్ష్యంతో బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టు వెనకబడిందని, దాన్ని పూర్తిచేస్తామని చెప్పారు. నాగార్జునసాగర్ లెఫ్ట్ కెనాల్ లిఫ్టులను పూర్తిస్థాయిలో మరమ్మతు చేయించి పూర్తి సామర్థ్యంతో పనిచేసేలా చూస్తామని హామీ ఇచ్చారు. నెమ్మికల్ ఎత్తిపోతల పథకం పనులను పూర్తి చేస్తామన్నారు. గంధమల్ల ప్రాజెక్టుకు కేంద్రం ఆమోదం తెలిపిందని, వాల్ పుట్టింగ్‌లు చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. కృష్ణానది నుంచి సాగర్‌కు వచ్చే నీటిలో కొంత కొరత ఉన్న మాట వాస్తవమేనన్న ఆయన గత ప్రభుత్వం నీటి వాటాను సరిగా వినియోగించుకోలేదని, ఈ పాపం వారిదేనని విమర్శించారు. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి విద్యుదుత్పత్తిని ప్రారంభించి ఐదు టీఎంసీల నీటిని నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు తీసుకొస్తామన్నారు. చివరి గింజ పండేవరకు సాగర్ ఆయకట్టుకు నీరందిస్తామన్నారు. రేషన్ కార్డున్న వారికి సన్న బియ్యం ఇచ్చే కార్యక్రమాన్ని ఈ నెల 30 (ఉగాది) నుంచి సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని ఆయన తెలిపారు.

నల్లగొండ డ్రీమ్ ప్రాజెక్టు ఎస్ఎల్‌బీసీ

ఉమ్మడి నల్లగొండ జిల్లాకు ఎస్ఎల్‌బీసీ డ్రీమ్ ప్రాజెక్ట్ అని, దాన్ని త్వరలోనే పూర్తి చేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రూ.2వేల కోట్లతో రోడ్లు నిర్మిస్తున్నామని చెప్పారు. గత బీఆర్ఎస్ పాలనలో జిల్లా మంత్రిగా ఉన్న జగదీశ్‌రెడ్డికి ఎస్ఎల్‌బీసీ టన్నెల్ గురించి తెలియదని విమర్శించారు. సూర్యాపేటలో కేటీఆర్ గాలి మాటలు మాట్లాడాడని, వాటిని ప్రజలు పట్టించుకోరన్నారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులే వందశాతం విజయం సాధిస్తారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కె.జానారెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌వన్నీ బోగస్ మాటలే

» పొద్దుతిరుగుడు పంటనంతా కొనాలి: హరీశ్



చిన్నకోడూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రెండు లక్షల రుణమాఫీ, రెండు లక్షల ఉద్యోగాలు అని చెప్పిన రాష్ట్ర సర్కార్ మాట తప్పిందని, కాంగ్రెస్ చెప్పేవన్నీ బోగస్ మాటలేనని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరులో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిద్దిపేట జిల్లాలో 11 వేల ఎకరాల్లో పొద్దుతిరుగుడు సాగైందని, 6 నుంచి 7 వేల మెట్రిక్ టన్నుల పంట వచ్చిందని చెప్పారు. పరిమితి లేకుండా పంటనంతా కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

'దేవాదుల'పై సర్కార్ నిర్లక్ష్యం: ఎర్రబెల్లి

హనుమకొండ టౌన్/హైదరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లా రైతులకు సాగునీరందించేందుకు బీఆర్ఎస్ హయాంలో పూర్తయిన దేవాదుల ప్రాజెక్టు పనులను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ధ్వజమెత్తారు. ఆదివారం హనుమకొండ జిల్లా దేవన్నపేటలోని దేవాదుల పంప్‌హౌస్ ఫేస్-3 మోటార్లను బీఆర్ఎస్ నేతలతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి విలేకరులతో మాట్లాడుతూ.. ఎండిపోయిన పంటలకు ఎకరానికి రూ.25వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలన్నారు. కాగా, రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించేందుకు కాంగ్రెస్ సర్కార్ కుట్ర చేస్తోందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు అన్యాయం చేస్తే బీఆర్ఎస్ తరఫున రాష్ట్రంలో మరో ఉద్యమం తప్పదని తెలంగాణ భవన్‌లో ఆయన హెచ్చరించారు.

నేను కేసీఆర్ అంత మంచోణ్ణి కాదు

» మళ్లీ మన రాజ్యం వస్తుంది

» ఏ ఒక్కర్నీ వదిలేది లేదు: కేటీఆర్



కరీంనగర్ టౌన్/సిరిసిల్ల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): 'కాంగ్రెస్‌ను గెలిపిస్తే ఇందిరమ్మ రాజ్యం వస్తుందన్నారు.. ఇందిరమ్మ రాజ్యం అంటే ఎమర్జెన్సీ.. నిర్బంధం.. సోషల్ మీడియాలో పోస్టు పెట్టగానే కేసులు పెడుతున్నారు! మళ్లీ మన రాజ్యం వస్తుంది.. నేను కేసీఆర్ అంత మంచి వాణ్ణి కాదు.. రాసిపెట్టుండి. ఏ ఒక్కరినీ వదిలిపెట్టేది లేదు. విదేశాలకు వెళ్లిన వారిని సైతం వదిలేది లేదు' అని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఇప్పుడు ఎవడు పడితే వాడు.. భూమికి జానెడు.. మూడు ఫీట్ల ఎత్తున్నోడు ఎగిరెగిరి పడుతూ కేసీఆర్ గురించి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. వారి రంగంతా బయటపడుతుందని, ప్రజలు ఉరికించి కొట్టే రోజులు వస్తాయన్నారు. బీఆర్ఎస్ రజతోత్సవ సన్నాహక సమావేశాన్ని కరీంనగర్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లినా, ఏ రైతును కదిలించినా కళ్ల నుంచి నీళ్లు వస్తున్నాయని, కేసీఆర్ ఉన్నప్పుడే బాగుండేదంటున్నారని చెప్పారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా గులాబీ జెండా ఎగరడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. జనాభా ప్రాతిపదికన లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన చేయాలని బీజేపీ చూస్తోందని, దానివల్ల దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ఓటమికి చాలా కారణాలు ఉన్నాయని, అందులో మూడు ముఖ్యమైనవి అసూయ, ద్వేషం, ఆశ అని అన్నారు. కేసీఆర్ సీఎం అయిన రోజున 5 లక్షలు ఉన్న ఎకరం భూమి ధర.. ఆయన దిగిపోయే రోజు 50 లక్షలకు చేరిందన్నారు. కేసీఆర్ పాలనలో స్థానిక నాయకులు ఇల్లు, కారు కొనుక్కుంటే ఆ సంపాదనను చూపించి మంత్రులు, కేసీఆర్, కేసీఆర్ కుటుంబం దోచుకుంటోందని కాంగ్రెస్, బీజేపీలు ప్రజల్లో అసూయ కలిగించే ప్రచారం చేశాయని విమర్శించారు. చావు నోట్లో తల పెట్టి తెలంగాణ తెచ్చిన కేసీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమంపై చర్చించే సత్తా లేక దొర అంటూ ఆయనను కలవడం కష్టమని, ఫామ్‌హౌస్‌లో దోచుకున్న సంపద దాచుకున్నాడని ద్వేషం పెంచారన్నారు. కాంగ్రెస్ అమలు కానీ హామీలతో ప్రజల్లో ఆశలు రేపి... అధికారంలోకి వచ్చిందన్నారు. అధికారంలో ఉండగా కొన్ని తప్పులు, లోపాలు జరిగాయని, వాటిని సరిదిద్దుకుంటామని చెప్పారు. ఏప్రిల్ 27న వరంగల్‌లో పార్టీ రజతోత్సవాలను బీఆర్ఎస్ ఖతమైందన్న సన్నాసుల నోళ్లు మూతపడేలా జరుపుకొందామని ఆయన అన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్త బైక్ ఢీకొని మహిళా కానిస్టేబుల్‌కు గాయాలు

కరీంనగర్ క్రైం: కేటీఆర్ పర్యటన సందర్భంగా కరీంనగర్‌లో చేపట్టిన బైక్ ర్యాలీలో పుల్ల శ్రీకాంత్ అనే బీఆర్ఎస్ కార్యకర్త బుల్లెట్ అదుపుతప్పి గుండాల పద్మజ అనే కానిస్టేబుల్‌పైకి దూసుకెళ్లడంతో ఆమె గాయపడింది. ఆమె పాదంలో ఎముక విరిగింది. పోలీసులు శ్రీకాంత్‌పై కేసు నమోదు చేశారు. కేటీఆర్ ఆస్పత్రికి వెళ్లి పద్మజను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

42% బీసీ రిజర్వేషన్ల అమలుకు జీవో ఇవ్వాలి: ఆర్ కృష్ణయ్య



హైదరాబాద్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు వెంటనే జీవోలు జారీ చేయాలని 26 బీసీ కుల సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ రిజర్వేషన్ల బిల్లులను కేంద్రానికి పంపి చేతులు కట్టుకుని కూర్చోకుండా పార్లమెంట్‌లో దానిని ఆమోదించే వరకు పోరాటం కొనసాగించాలని పేర్కొన్నారు. ఆదివారం బీసీ భవన్‌లో 26 బీసీ కుల సంఘాల నాయకుల ఆధ్వర్యంలో బీసీ రిజర్వేషన్ల అమలు భవిష్యత్ కార్యాచరణపై చర్చ జరిగింది. ఈ సమావేశంలో బీసీ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ.. బీసీలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ అసెంబ్లీలో రెండు బిల్లులు పాస్ చేయడం చారిత్రాత్మకమని అన్నారు. వాటి అమలుకు తక్షణం జీవోలు జారీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఈ పార్లమెంటు సమావేశాల్లోనే బిల్లు పెట్టాలి

» లేకుంటే ఏప్రిల్ 2న ఢిల్లీలో బీసీల పోరుగర్జన: జాజుల

హైదరాబాద్, పంజాగుట్ట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ రాష్ట్ర అసెంబ్లీ చట్టం చేసిందని, కేంద్ర ప్రభుత్వం ఈ పార్లమెంటు సమావేశాల్లోనే ఈమేరకు బిల్లును ప్రవేశపెట్టి ఆమోదం తెలపాలన్నారు. లేకుంటే వేలాదిమందితో ఏప్రిల్ 2న జంతర్ మంతర్ వద్ద బీసీల పోరుగర్జన నిర్వహించనున్నట్టు ఆయన హెచ్చరించారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'హలో బీసీ-చలో ఢిల్లీ' బీసీల పోరుగర్జన పోస్టరును ఆయన ఆవిష్కరించారు. తమ పోరాటాల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేపట్టిందని, ఈ నెల 17న బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లు పెట్టి ఆమోదించిందన్నారు.

నీట్ సాధనకు డిజిటల్ టెస్ట్ సిరీస్‌లు సిద్ధం

హైదరాబాద్ సిటీ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): నీట్-2025కు సిద్ధమవుతున్న విద్యార్థుల కోసం 'కోటా' 2024, 2025 టెస్టు సిరీస్‌లు సిద్ధం చేసినట్లు ఐఐటీ, జేఈఈ/నీట్ ఫోరం తెలిపింది. సొల్యూషన్స్, స్టడీ మెటీరియల్, గ్రాండ్ టెస్టులు, ప్రాక్టీసు కోసం కోటా పూర్వ టెస్టులతో పాటు.. సొల్యూషన్స్, ర్యాంక్ బూస్టర్స్(డిజిటల్) బుక్‌లెట్‌లు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ డిజిటల్ బుక్‌లెట్‌లను మొబైల్ వెర్షన్‌లో వాట్సాప్ ద్వారా పొందవచ్చు. మరింత సమాచారం కోసం నీట్-2025 అని టైప్ చేసి, వాట్సాప్ నంబరు 9849016661కు మెసేజ్ చేయాలని ఫోరం సూచించింది.

వకుళాభరణం కృష్ణమోహన్‌రావుకు లోహియా సామాజిక న్యాయ పురస్కారం



న్యూఢిల్లీ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావుకు లోహియా సామాజిక న్యాయ పురస్కారం దక్కింది. ఆదివారం ఢిల్లీలోని విష్ణు దిగంబర్ మార్గ్‌లో రాజారామ్మోహన్ రాయ్ మెమోరియల్ హాల్‌లో ఆదిలీలా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పురస్కార వేడుక జరిగింది. విశ్రాంత ఐఏఎస్ అధికారి, నేషనల్ విజనరల్ ఫర్ క్లీన్ గంగా డైరెక్టర్ జనరల్‌గా వ్యవహరించిన జీ.అశోక్‌కుమార్.. కృష్ణమోహన్‌రావుకు అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్ మాట్లాడుతూ.. లోహియా అవార్డు తన జీవితంలో కీలక మలుపు అన్నారు. లోహియా కృషి వల్లే దేశంలో బలహీన వర్గాలకు మేలు జరుగుతోందని చెప్పారు. అశోక్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణలో కృష్ణమోహన్ సేవలను ప్రత్యక్షంగా చూశానన్నారు. ఈ పురస్కారం కింద రూ.1.5 లక్షలు అందిస్తారు.

ఎల్‌ఆర్‌ఎస్ లక్ష్యం 8,800 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

పెండింగ్‌లో పెట్టారు. ఫీజు చెల్లించాలని లేఖలు పంపిన 20 లక్షల దరఖాస్తుల్లో 30 శాతం మంది ఈ నెలాఖరులోగా ముందుకు వస్తారని అంచనా వేసిన అధికారులు.. వారి నుంచి సుమారు రూ.2 వేల కోట్ల ఆదాయం సమకూరుతుందని భావిస్తున్నారు. గత మూడు వారాల్లో రాయితీ పథకం కింద 1,25,723 మంది ఫీజు చెల్లించగా.. శుక్రవారం రాత్రి 12 గంటల వరకు రూ.500 కోట్ల ఆదాయం వచ్చింది. రెండు రోజుల నుంచి దరఖాస్తుదారుల స్పందన బాగుందని, నెలాఖరు నాటికి ఇంకో రూ.1,500 కోట్ల ఆదాయం వస్తుందని అధికారులు భావిస్తున్నారు.

ప్రొసీడింగ్స్ ఇవ్వడం లేదని ఆందోళన..

ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించినా వెంటనే ప్రొసీడింగ్స్ ఇవ్వడం లేదంటూ దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల్లో పది రోజుల వ్యవధిలో ప్రొసీడింగ్స్ ఇస్తామని చెప్పినా.. కొన్ని ప్రాంతాల్లో ఈ విషయంలో దరఖాస్తుదారులకు తలెత్తుతున్న సందేహాలను క్షేత్ర స్థాయి అధికారులు నివృత్తి చేయడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఫీజులు చెల్లించినా ప్రొసీడింగ్స్ ఎందుకు ఇవ్వడం లేదంటూ దరఖాస్తుదారులు మూడు రోజుల క్రితం ఖైరతాబాద్ జోనల్ కార్యాలయంలో ఆందోళన చేశారు. ఈ విషయంలో స్పష్టత ఇవ్వాల్సిన అధికారులు తమకేమీ తెలియదన్నట్లు వ్యవహరిస్తుండటంతో.. దరఖాస్తుదారులు ఫీజు కట్టాలా..? వద్దా..? అనే సందిగ్ధంలో ఉన్నారు. ఈ విషయంపై డీటీసీపీ దేవేందర్ రెడ్డి మాట్లాడారు. ఫీజు చెల్లించాక క్షేత్ర స్థాయి విచారణ ఉంటే తప్ప ప్రొసీడింగ్స్ ఆపడం లేదన్నారు. ప్రొసీడింగ్స్ విషయంలో ఆందోళన వద్దని.. అందుకు అవసరమైన ఫార్మాట్ సిద్ధంగా ఉంచామని చెప్పారు. ఇప్పటి వరకు సుమారు 30 వేల మందికి ప్రొసీడింగ్స్ ఇచ్చామని తెలిపారు. కాగా, ఎల్‌ఆర్‌ఎస్ వంద శాతం పురోగతి సాధించాలని పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ అధికారులకు సూచించారు. కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. సామాజిక మాధ్యమాలు, మీడియా ద్వారా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు మునిసిపల్ కమిషనర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులతో సమావేశం కావాలని సూచించారు. ఇదే విషయంపై 24న మరోసారి సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు.

బెట్టింగ్ యాప్స్ రచ్చలోకి అగ్ర నటులు

బాలకృష్ణ, ప్రభాస్, గోపీచంద్‌పై సైబర్ క్రైం విభాగానికి న్యాయవాది ఫిర్యాదు

ఫన్-88యాప్‌ను ప్రమోట్ చేశారని ఆరోపణ.. రాష్ట్రంలో బెట్టింగ్ యాప్స్‌పై 385 ఫిర్యాదులు

హైదరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ల రచ్చలోకి తెలుగు సినీ రంగ అగ్ర నటులు వచ్చి చేరారు. ఈ మేరకు సినీనటులు బాలకృష్ణ, ప్రభాస్, గోపీచంద్‌పై సైబర్ క్రైం విభాగానికి ఆన్‌లైన్‌లో న్యాయవాది ఇమ్మనేని రామారావు ఆదివారం ఫిర్యాదు చేశారు. నందమూరి బాలకృష్ణ, తొట్టెంపూడి గోపీచంద్, ఉప్పలపాటి వెంకటసూర్యనారాయణ రాజు అలియాస్ ప్రభాస్ చైనీస్ బెట్టింగ్ యాప్ అయిన ఫన్-88ను ప్రమోట్ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. యాప్ నిర్వాహకులు మ్యూల్ (ఇతరుల ఆధార్ నంబర్లతో వారికి తెలియకుండానే తీసుకున్న) ఖాతాల ద్వారా కోట్లాది రూపాయలను చైనాకు తరలించారని వివరించారు. దేశ భద్రతకే సవాల్‌గా మారిన ఫన్-88 బెట్టింగ్ యాప్ గూగుల్ ప్లేస్టోర్‌లో అందుబాటులోనే ఉందని, దాన్ని వెంటనే బ్లాక్ చేయాలని రామారావు కోరారు. కాగా, బెట్టింగ్ యాప్స్, వెబ్‌సైట్లపై రాష్ట్రంలోని వివిధ పోలీసు స్టేషన్లు, సైబర్ క్రైం, సైబర్ సెక్యూరిటీ బ్యూరోల్లో ఇప్పటిదాకా 385 కేసులు నమోదైనట్లు సమాచారం. అయితే, బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్లలో పాల్గొన్న వారికి నోటీసులు ఇచ్చి విచారించడానికి ముందు భిన్న కోణాల్లో దర్యాప్తు చేపట్టాలని ఉన్నతాధికారుల నుంచి స్టేషన్‌హౌస్ ఆఫీసర్లకు ఆదేశాలు అందినట్లు తెలుస్తోంది. ఆత్మహత్య కేసులను రీఓపెన్ చేసి, ఆయా మరణాలకు ఏయే బెట్టింగ్ యాప్స్ కారణం? ఎవరెవరు ఆ యాప్‌లను ప్రమోట్ చేశారు? అనే విషయాలను ధ్రువీకరించుకుని, అన్నింటినీ ఆ కేసుకు జతపర్చాలని సూచించినట్లు సమాచారం. కాగా, బెట్టింగ్ యాప్స్ ద్వారా వేల కోట్ల రూపాయల దందా సాగుతోందని, ఇందులో అధిక శాతం వాటా చైనా కంపెనీలదేనని దర్యాప్తు అధికారులు పేర్కొంటున్నారు. ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫామ్‌కు సంబంధించి ప్రభుత్వ అనుమతులు ఉన్న భారతీయ కంపెనీలు 28శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది. జీఎస్టీ చెల్లించని గేమింగ్ యాప్స్ సంస్థలపై ఇటీవల జీఎస్టీ ట్యాక్స్ ఇంటెలిజెన్స్ అధికారులు కొరడా ఝుళిపించారు. 357 వెబ్‌సైట్లను బ్లాక్ చేయడంతోపాటు బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్‌చేశారు. మరోవైపు రాష్ట్రంలో జియో ఫెన్సింగ్ టెక్నాలజీ ద్వారా బెట్టింగ్ సైట్లు యాక్సెస్ కాకుండా అడ్డుకోవడానికి సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటి వరకు 108 అక్రమ బెట్టింగ్ వెబ్‌సైట్లను బ్లాక్ చేయడంతోపాటు 133భారతీయ బెట్టింగ్ ప్లాట్‌ఫామ్ సంస్థలకు నోటీసులు జారీ చేశారు. బెట్టింగ్ యాప్‌ల గురించి ఎలాంటి సమాచారం లేదా ఫిర్యాదు ఉన్నా 8712672222 వాట్సాప్ నంబర్‌కు పంపించాలని సైబర్ క్రైం పోలీసులు పేర్కొంటున్నారు.



మార్క్‌ఫెడ్ జొన్నలు అగ్గువకు!

(మొదటిపేజీ తరువాయి)

జరుగుతోంది. ఈక్రమంలో టెండరును రద్దు చేసి కొత్త టెండర్లు పిలవాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదులు కూడా వెళ్లినట్లు సమాచారం. ఆదిలాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్ సహా రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల రైతుల నుంచి 2023-24 యాసంగి సీజన్‌లో మార్క్‌ఫెడ్ ఒక లక్ష మెట్రిక్ టన్నుల తెల్ల జొన్నలు కొనుగోలు చేసింది. రైతులకు క్వింటాలుకు రూ.3,180 చొప్పున ప్రభుత్వం చెల్లించింది. రవాణా, నిల్వ ఇతరత్రా నిర్వహణ ఖర్చులు పోగా.. కేవలం రైతులకు చెల్లించటానికే రూ.318 కోట్లు ఖర్చు చేసింది. రైతులనుంచి సేకరించిన జొన్నలను మార్క్‌ఫెడ్ ఈ- టెండర్ల ద్వారా విక్రయిస్తుంది. అయితే ఆన్‌లైన్‌లో టెండర్లు నిర్వహిస్తున్నప్పటికీ.. కాంట్రాక్టు ఏజెన్సీలు సిండికేటుగా మారటం, పోటీ ఎక్కువగా లేకుండా చూసుకోవటం, ధరలను నియంత్రించటం జరుగుతున్నాయి. ఈ క్రమంలో టెండర్ల ప్రక్రియలో జొన్నలు విక్రయించటానికి రెండేళ్లుగా జాప్యం జరుగుతోంది. దీంతో గోదాముల్లో నిల్వచేసిన తెల్ల జొన్నలు కొన్నిచోట్ల ముక్కిపోతున్నాయి. నిర్వహణ సరిగాలేక.. దుమ్ము, దూళి పట్టిపోతున్నాయి. కొన్ని చోట్ల పిండిలా మారుతున్నాయి. మూడు నెలల క్రితం ఓసారి టెండర్లు పిలిస్తే.. కొన్ని ఏజెన్సీలు బిడ్లు దాఖలు చేశాయి. క్వింటాలుకు రూ. 1,870 చొప్పున ధర నమోదు చేశాయి. ధర తక్కువ వచ్చిందని ప్రభుత్వం టెండర్లు రద్దు చేసింది. తాజాగా టెండర్లు పిలిస్తే.. క్వింటాలుకు రూ.1,850 చొప్పున ఒక ఏజెన్సీ గరిష్ఠ ధరను నమోదు చేసింది. మొదటి టెండరుకు, రెండో టెండరుకు ధర పెరుగుతుందనుకుంటే.. క్వింటాలుకు రూ. 20 తగ్గిపోయింది. అయితే ఇప్పటి ధర కంటే ఎక్కువ ధరకు బిడ్లు దాఖలు చేస్తే తమకు అగ్రిమెంటు చేయలేదని, తక్కువ ధర నమోదు చేసిన ఏజెన్సీకి ఇప్పుడు జొన్నలు ఎలా అగ్రిమెంటు చేస్తారని.. మొదటిసారి టెండర్లలో పాల్గొన్న కొన్ని ఏజెన్సీలు ప్రభుత్వానికి లిఖితపూర్వకంగా ఫిర్యాదులు చేశాయి. అయినా ప్రస్తుతం క్వింటాలుకు రూ.1,850 చొప్పున సదరు ఏజెన్సీకి జొన్నలను అప్పగించేందుకు మార్క్‌ఫెడ్ సిద్ధమైనట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. కనీస మద్దతు ధరకు, మార్కెట్ ధరకు పొంతన లేకుండా.. తక్కువ ధరకు టెండరు వేసిన ఏజెన్సీకి అగ్రిమెంట్ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం.

నష్టం వచ్చినా అమ్మేస్తారా?

జొన్నల కనీస మద్దతు ధర 2023-24లో క్వింటాలుకు రూ.3,180 ఉండగా.. ఇప్పుడు రూ.3,371 ఉంది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో క్వింటాలు జొన్నల ధర రూ.2,300 నుంచి రూ.2,400 ఉంది. కానీ మార్క్‌ఫెడ్ విక్రయించాలనుకుంటున్న ధర మాత్రం కేవలం రూ.1,850 కావటం విమర్శలకు దారి తీస్తోంది. రైతుల నుంచి క్వింటాలుకు రూ. 3,180 చొప్పున కొనుగోలుచేసి... ఇప్పుడు రూ. 1,850 కి విక్రయిస్తే.. క్వింటాలుకు రూ.1,330 చొప్పున నష్టం తప్పదు. అంటే.. టన్నుకు రూ.13,300 చొప్పున లక్ష మెట్రిక్ టన్నులకు రూ. 133 కోట్ల నష్టం వాటిల్లుతుంది. ప్రస్తుత ఎమ్మెస్పీ లెక్క ప్రకారం చూస్తే.. క్వింటాలుకు రూ.1,521 చొప్పున లక్ష టన్నులకు రూ.152 కోట్ల నష్టం జరుగుతుంది. ఇప్పటికే మార్క్‌ఫెడ్ అప్పుల ఊబిలో కూరుకపోయి ఉంది. పంటల ఉత్పత్తులు కొనుగోలు చేయటానికి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ నుంచి నిధుల కేటాయింపులు కూడా చేయటంలేదు. కేవలం బ్యాంకు గ్యారెంటీ ఇస్తే.. బ్యాంకుల నుంచి అప్పులు తెచ్చి రైతులకు చెల్లింపులుచేసే పరిస్థితి నెలకొంది. కాగా తక్కువ ధరకు టెండర్లు ఖరారు చేస్తున్న విషయమై మార్క్‌ఫెడ్ జనరల్ మేనేజర్ విష్ణువర్ధన్‌రావును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. టెండర్ల ప్రక్రియ పురోగతిలో ఉన్నదని తెలిపారు. నేడో, రేపో ప్రక్రియ పూర్తవుతుందని, ఇంతకంటే ఎక్కువ వివరాలు తనకు తెలియవని జీఎం అన్నారు.



ధర లేక జొన్న రైతు దిగాలు

» రూ.1000 వరకు నష్టపోతున్న రైతులు

» కొనుగోళ్లపై నిర్ణయం తీసుకోని ప్రభుత్వం

కామారెడ్డి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పండించిన జొన్న పంటకు కనీస మద్దతు ధర కూడా దక్కకపోవడంపై రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది దిగుబడి బాగానే వచ్చిందని సంతోషించేలోపే.. దారుణంగా పడిపోయిన ధరను చూసి దిగాలు పడుతున్నారు. కొనుగోళ్లపై ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోకపోవడం, దళారులు చెప్పిందే ధర అన్నట్లుగా పరిస్థితి ఉండడం.. రైతుల పాలిట శాపంగా మారింది. కామారెడ్డి జిల్లాలోనే యాసంగిలో సుమారు 20 వేల ఎకరాల్లో జొన్న పంటను సాగు చేశారు. సుమారుగా 2.20లక్షల క్వింటాళ్ల వరకు జొన్న దిగుబడులు వచ్చే అవకాశం ఉంది. జొన్నకు కనీస మద్దతు ధర రూ.3,371గా ఉంటే.. దళారులు రూ.2200-2300కే కొనుగోలు చేస్తున్నారు. ఈలెక్కన క్వింటాల్‌కు రూ.1000 వరకు రైతులు నష్టపోతున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే జొన్న నాణ్యత లేదని, ఇష్టమైతే అమ్మండి.. లేదంటే తీసుకెళ్లండంటూ దబాయిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మార్క్‌ఫెడ్ ద్వారా జొన్నను కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

సెర్ప్, మెప్మా విలీనం!

(మొదటిపేజీ తరువాయి)

సహాయక సంఘాల ద్వారా ఆదాయ వనరులు కల్పించడం ముఖ్య ఉద్దేశంగా 'ఇందిర మహిళా శక్తి మిషన్'ను ప్రారంభించినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో 47.40 లక్షల మంది మహిళలు.. 4.37 లక్షల మహిళా స్వయం సహాయక సంఘాలు, 18 వేల విలేజ్ ఆర్గనైజేషన్లు(వీవోలు), 553 మండల మహిళా సమాఖ్యలు, 32జిల్లా మహిళా సమాఖ్యలు పనిచేస్తున్నాయని వివరించారు. అలాగే పట్టణ ప్రాంతాల్లో 1.79 లక్షల ఎస్‌హెచ్‌జీల్లో 17.80 లక్షల మంది మహిళలు ఉన్నారని, 189 సమాఖ్యలు ఉన్నాయని, ఇవన్నీ సెర్ప్ పరిధిలో కొనసాగించనున్నట్లు పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో 15-18 ఏళ్ల మధ్య వయసున్న బాలికలకు అర్హత కల్పిస్తూ ప్రత్యేకంగా కిశోర బాలికల సంఘాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కిశోరబాలికలకు నైపుణ్య శిక్షణ, విద్య, ఉపాధి కల్పన ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కిశోరబాలికల గ్రూపులోని సభ్యులకు 18 ఏళ్లు నిండిన తర్వాత.. వారికి స్వయం సహాయక సంఘాల్లో చేరేందుకు వీలు కల్పిస్తామన్నారు. సెర్ప్, మెప్మా విభాగాల్లోని అధికారులు, సిబ్బంది పని విభజనకు సంబంధించి త్వరలోనే విధివిధానాలను రూపొందించనున్నట్లు లోకేశ్‌కుమార్ వెల్లడించారు.

శ్రీవారి బ్రేక్ దర్శనానికి తొలి రోజే 90 సిఫారసు లేఖలు

తిరుమల, మార్చి 23(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శనాలకు తెలంగాణ ప్రజాప్రతినిధుల నుంచి భారీగా సిఫారసు లేఖలు వచ్చాయి. తొలిరోజే 90 లేఖలను భక్తులు తీసుకొచ్చి అదనపు ఈవో కార్యాలయంలో నమోదు చేసుకున్నారు. తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలపై ఈ నెల 24 నుంచి దర్శనాలు కల్పిస్తామని టీటీడీ ప్రకటించిన సంగతి తెలిసిందే. సోమ, మంగళవారాల్లో ఒక లేఖపై ఆరుగురికి మించకుండా వీఐపీ బ్రేక్ దర్శనాలు, బుధ, గురువారాల్లో రూ.300 దర్శన టికెట్లు జారీ చేయనుంది. ఇందులో భాగంగానే దాదాపు 180మంది ప్రజాప్రతినిధుల వివరాలను అధికారులు సర్వర్‌లో నమోదు చేశారు.

కేసీఆర్ సన్నిహిత నేతకు బీదర్‌లో
దొంగ నోట్ల ప్రింటింగ్ ప్రెస్!

» ఎన్నికల్లో బీఆర్ఎస్ పంచింది ఆ నోట్లే

» కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు



కరీంనగర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కేసీఆర్ సన్నిహితుడైన ఓ బీఆర్ఎస్ నాయకుడికి బీదర్‌లో దొంగ నోట్ల ప్రింటింగ్ ప్రెస్ ఉందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. కేసీఆర్ మనుషులు బీదర్‌లో దొంగనోట్లు ముద్రించారన్నారు. ఆ ప్రింటింగ్ ప్రెస్‌ను మూసివేసేందుకు తెలంగాణ రాష్ట్ర పోలీసులు వెళితే ఒత్తిడి తెచ్చి, అక్కడికి వెళ్లకుండా చేశారని పేర్కొన్నారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ పంచిన నోట్లన్నీ దొంగ నోట్లేనని ఆరోపించారు. ఆదివారం కరీంనగర్‌లోని తెలంగాణ ఉపాధ్యాయ ప్రాంతీయ సంఘం (తపస్) ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి బండి సంజయ్, నూతనంగా ఎన్నికైన బీజేపీ ఎమ్మెల్సీలు మల్క కొమురయ్య, అంజిరెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ.. కేసీఆర్ పాలనతో రాష్ట్రం సర్వనాశనమైందన్నారు. ప్రజలు కాంగ్రె‌స్‌కు అధికారం అప్పగించినా ఇబ్బందులు తప్పడం లేదని చెప్పారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, డీఎంకే, ఆప్, సీపీఎం పార్టీలు ఒకే చోట చేరి నియోజకవర్గాల పునర్విభజన పేరుతో డ్రామాలు ఆడుతున్నాయని ధ్వజమెత్తారు. స్టాలిన్ ప్రభుత్వం వెయ్యి కోట్ల లిక్కర్ స్కాం చేసిందని ఆరోపించారు. కేరళలోను లిక్కర్ స్కాం బయటపడిందన్నారు. ఆప్, బీఆర్ఎస్ నేతలు మద్యం కుంభకోణంలోనే జైలుకు వెళ్లారని తెలిపారు. కుంభకోణం దొంగలతా చెన్నైలో సమావేశమై పునర్విభజన పేరుతో మోదీ ప్రభుత్వంపై విషం కక్కడమే పనిగా పెట్టుకున్నారన్నారు. దేశ జీడీపీకి పార్లమెంట్‌లో ప్రాతినిధ్యానికి సంబంధం ఏంటని సంజయ్ ప్రశ్నించారు. ఇక ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు ఇవ్వాలని అడుగుతుంటే డబ్బుల్లేవని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం, 18 శాతం కమీషన్లు ఇస్తే కాంట్రాక్టర్లకు మాత్రం బిల్లులు ఇస్తున్నారని ఆరోపించారు. విద్యాశాఖను అర్బన్ నక్సల్స్ చేతిలో పెట్టి తుపాకీ రాజ్యం తేవాలని కాంగ్రెస్ భావిస్తోందని విమర్శించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులను కాంగ్రెస్ మోసం చేస్తోందని, తపస్ పక్షాన వారి సమస్యల పరిష్కారానికి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. పోరాటాల వల్ల ఉద్యోగాలు పోతే బీజేపీ టికెట్లు ఇచ్చి గెలిపించుకుంటామని తెలిపారు.

కేటీఆర్ వ్యాఖ్యలు అవమానకరం

ఈ భూమిపై ధర్మం ఉన్నంత వరకు అయోధ్య ఉంటుందని, అయోధ్య లేదని కేటీఆర్ వ్యాఖ్యానించడం అవమానకరమని బండి సంజయ్ అన్నారు. 'హిందూ ఆచారాలను అవమానించినంత మాత్రాన ప్రాచుర్యం పొందలేరని గుర్తుంచుకో.. ట్విటర్ టిల్లూ' అంటూ ఆదివారం ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు. కేసీఆర్, కేటీఆర్ కరీంనగర్‌కు వచ్చినప్పుడల్లా హిందువులను హేళన చేస్తారని మండిపడ్డారు.

విపక్షాలవి అవకాశవాద రాజకీయాలు

» హామీల అమలు చేతగాక డీలిమిటేషన్‌పై దుష్ప్రచారం

» కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య ఎంఐఎం సయోధ్య: కిషన్‌రెడ్డి



హైదరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్, డీఎంకే, బీఆర్ఎస్‌లవి అవకాశవాద రాజకీయాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి మండిపడ్డారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ ప్రారంభం కాకున్నా, దక్షిణాదికి అన్యాయం జరుగుతోందని తప్పుడు ప్రచారం చేస్తూ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నాయని దుయ్యబట్టారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం చేతగాక భాష, ప్రాంతం పేరిట దుష్ప్రచారం చేస్తున్నాయని అన్నారు. చెన్నైలో జరిగిన సమావేశంలో డీలిమిటేషన్‌పై కాంగ్రెస్, బీఆర్ఎస్ పోటీ పడి మాట్లాడటం చూస్తుంటే వారి నిజస్వరూపం బయటపడిందని విమర్శించారు. దేశంలో లేని సమస్యను సృష్టించి.. బీజేపీకి, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ రెండు పార్టీలు కలిసి పనిచేస్తున్నాయని ఆరోపించారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. దక్షిణాది ప్రజల సంక్షేమం కోసం బీజేపీ చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. హిమాచల్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బీజేపీదే అధికారమని స్పష్టం చేశారు. దక్షిణాదిన బీజేపీ బలపడకూడదని కాంగ్రెస్, డీఎంకే, బీఆర్ఎస్‌లు కుట్ర పన్నాయని ఆరోపించారు. కుటుంబ, కుంభకోణ, అవినీతి పార్టీలు ముఠాగా ఏర్పడి మోదీ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. "డీలిమిటేషన్‌పై కేంద్రం ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. డీలిమిటేషన్ జరగాలంటే దేశవ్యాప్తంగా ముందుగా జనగణన జరగాలి. డీలిమిటేషన్‌పై కమిటీ ఏర్పాటు కావాలి. అన్ని రాష్ట్రాల్లో ఆ కమిటీ అభిప్రాయాలు తీసుకోవాలి. ఈ ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వాల పాత్ర కీలకం. ఏమీ జరగకముందే ఏదో జరిగిపోతోందంటూ సీఎం రేవంత్, కేటీఆర్‌లు ఒకే సమావేశంలో మాట్లాడటం విడ్డూరం. ఎన్నికల హామీలు, గ్యారెంటీల అమలుపై సీఎం రేవంత్ దృష్టిపెట్టాలి. కేంద్రంపై, డీలిమిటేషన్‌పై విమర్శలు చేసినంత మాత్రాన కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత తగ్గదని గుర్తుంచుకోవాలి. పార్లమెంటు ఎన్నికల ముందు కూడా ఇవే పార్టీలు బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తుందని తప్పుడు ప్రచారం చేశాయి. డీలిమిటేషన్ చేసినపుడు కేంద్రం దేశంలోని అన్ని ప్రాంతాలకూ సమన్యాయం చేస్తుంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య సయోధ్య కోసం మజ్లిస్ ప్రయత్నిస్తోంది. మహిళా రిజర్వేషన్‌ను అమలు చేయకుండా ఉండేందుకు ఈ పార్టీలు డీలిమిటేషన్ అంశాన్ని వివాదాస్పదం చేస్తున్నాయి. లిక్కర్ స్కాంపై తమిళనాడు సీఎం స్టాలిన్ సమాధానం చెప్పాలి. డీలిమిటేషన్‌పై కాంగ్రెస్.. డీఎంకేను ముందుపెట్టి నాటకం ఆడిస్తోంది. ఆ నాటకంలో కేటీఆర్ కూడా పాత్ర పోషిస్తున్నారు" అని కిషన్‌రెడ్డి అన్నారు. జనగణన పూర్తికావాలంటే ఏడాది పడుతుందని ఒక ప్రశ్నకు సమాధానంగా కిషన్‌రెడ్డి తెలిపారు.

ఆ భూములను ఖాళీ చేయండి

» వారంలోగా సమాధానం ఇవ్వండి

» శారదా పీఠానికి ఏపీ రెవెన్యూశాఖ నోటీసులు

అమరావతి, విశాఖపట్నం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : ఏపీ విశాఖలోని శారదాపీఠం ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూములపై ఎట్టకేలకు కదలిక వచ్చింది. పీఠం ఆక్రమించుకున్న భూములను వెంటనే ఖాళీచేయాలని, ఈ విషయంలో వారంలోగా సమాధానం ఇవ్వాలని, లేదంటే తామే ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకుంటామంటూ రెవెన్యూశాఖ నోటీసులిచ్చింది. ఆదివారం రాత్రి శారదాపీఠం మేనేజర్‌కు ఈ నోటీసులు అందచేశారు. ఇటీవల ఇదే అంశంపై 'ఆంధ్రజ్యోతి' 'పీఠం వెనక మోసం' శీర్షికన వెలువరించిన కథనంలో భూఆక్రమణలను వెలుగులోకి తీసుకొచ్చింది. ప్రభుత్వం ఈ అంశంపై దృష్టి సారించి జిల్లా కలెక్టర్, జేసీలను అమరావతికి పిలిపించి మాట్లాడింది. ఆక్రమణలపై రెవెన్యూ, మున్సిపల్ శాఖల నుంచి పీఠానికి నోటీసులు ఇవ్వాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఆదివారం పెందుర్తి మండల తహసీల్దార్ శారదాపీఠానికి ఏపీ భూ ఆక్రమణ చట్టం-1905లోని సెక్షన్-7 కింద నోటీసులిచ్చారు.

కమలానికి.. వారంలో కొత్త దళపతి!

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికకు సంబంధించి పరిశీలకురాలిగా నియమితులైన శోభా కరంద్లాజే.. రెండు మూడు రోజుల్లో రాష్ట్రపర్యటనకు రానున్నారని, కొత్త అధ్యక్షుడికి సంబంధించి నామినేషన్‌లు స్వీకరిస్తారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. అయితే అధ్యక్ష పదవికి అరడజనుపైగా నేతల పేర్లు ప్రచారంలో ఉన్నాయి. ఎంపీలు లక్ష్మణ్, ధర్మపురి అర్వింద్, ఈటల, ఎం.రఘునందన్‌రావు, డీకే అరుణతోపాటు కేంద్రమంత్రి బండి సంజయ్, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు, బీజేఎల్పీ ఉపనేత పాయల శంకర్, మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు పేర్లు ప్రచారంలో ఉన్నాయి. ఈ ప్రచారానికి త్వరలో ఫుల్‌స్టాప్ పడనుంది. వివాద రహితుడు, సైద్ధాంతిక నిబద్ధత కలిగిన నేతగా గుర్తింపుపొందిన రాంచందర్‌రావు పేరు రేసులో ముందంజలో ఉందని పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఒకవేళ సమీకరణాలు మారితే.. బీసీ ఎంపీకి పార్టీ పగ్గాలు అప్పగించవచ్చంటున్నారు. ఇప్పటికే ఎమ్మెల్యేలు, ఎంపీలతో పాటు పలువురు సీనియర్ల నుంచి అభిప్రాయాలు తీసుకున్న జాతీయ నాయకత్వం.. తాజాగా కొంతమంది ముఖ్యుల నుంచి అభిప్రాయాలు సేకరించింది. అయితే, బీసీ వర్గానికి చెందిన ఎంపీయే రాష్ట్ర పార్టీకి కొత్త అధ్యక్షుడన్న సంకేతాలు ఢిల్లీ నుంచి వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఇదే వాస్తవమైతే.. ఈ కోటాలో రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌లలో ఒకరికి అవకాశం దక్కవచ్చునని ముఖ్యనేత ఒకరు అభిప్రాయపడ్డారు. ఒకవేళ సైద్ధాంతిక నిబద్ధతనే ప్రామాణికంగా తీసుకుంటే రాంచందర్‌రావుకు అవకాశం వస్తుందని అన్నారు. ఇవేవీ కాకుండా పార్టీ నాయకత్వం మరో కోణంలో ఆలోచించి నిర్ణయం తీసుకున్నా ఆశ్చర్యపోనక్కర్లేదని ఆయన చెప్పారు. ప్రస్తుతం కేంద్ర మంత్రిగా కొనసాగుతున్న బండి సంజయ్‌ని ఆ బాధ్యతల నుంచి తప్పించి మరోసారి రాష్ట్ర పార్టీ పగ్గాలు కట్టబెట్టే అవకాశాలు కూడా లేకపోలేదని అన్నారు. మహిళా నేతకు పార్టీ సారథ్య బాధ్యతలు అప్పగించాలని నాయకత్వం భావిస్తే మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అధ్యక్షురాలు అవుతారని మరో నేత తెలిపారు. ఇదిలా ఉండగా.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆదివారం అత్యవసరంగా ఢిల్లీకి వెళ్లారు. హైదరాబాద్‌లో తన పర్యటన షెడ్యూలు కార్యక్రమాలు కొన్నింటిని రద్దు చేసుకుని మరీ ఆయన ఢిల్లీ వెళ్లడం పార్టీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. కొత్త అధ్యక్షుడి నియామక ప్రక్రియ కొలిక్కి రావడం వల్లే పార్టీ జాతీయ నాయకత్వం కిషన్‌రెడ్డిని పిలిపించిందనే ప్రచారం జరుగుతోంది. అయితే పార్లమెంటు సమావేశాల నేపథ్యంలో తన శాఖకు సంబంధించిన సమాధానాలను సోమవారం కిషన్‌రెడ్డి ఇవ్వాల్సి ఉన్నందునే ఢిల్లీ వెళ్లారని ఆయన కార్యాలయ వర్గాలు తెలిపాయి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.